www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 6-5-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 20 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: నవమి ఉ.8:39 తదుపరి దశమి, నక్షత్రం: మఖ మ.3:52 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.12:40-2:26, దుర్ముహూర్తం: ఉ.8:23-9:13, రా.10:14-10:58, అమృతఘడియలు: మ.1:16-3:00, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:50, సూర్యాస్తమయం: 6:33 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## మాతృత్వ సెలవులు ఇక 180 రోజులు

ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలకూ వర్తింపు

ఇప్పటిదాకా ఆ సెలవులు 120 రోజులే

మెటర్నిటీ లీవుల జీవోను సవరించిన ప్రభుత్వం

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాతృత్వ సెలవుల (మెటర్నిటీ లీవులు)ను మరో 60 రోజులు పెంచడమే కాకుండా, ఇద్దరు పిల్లల వరకే వర్తింపు అనే నిబంధనను కూడా తొలగించింది. ప్రస్తుతం 120 రోజులుగా ఉన్న ఈ సెలవులను 180 రోజులకు పెంచింది. అలాగే ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కన్నా కూడా ఈ పెంపుదల వర్తించేలా మాతృత్వ సెలవుల నిబంధనలు సవరించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటూ రాష్ట్రంలోని దంపతులకు

మిగతా 12వ పేజీలో...

# పౌరాహుషార్

## పౌరుల భద్రత సన్నద్ధతపై రేపు మాక్ డ్రిల్స్
## కీలక రాష్ట్రాల్లో నిర్వహణకు కేంద్రం ఆదేశాలు

వైమానిక దాడి సైరన్లు మోగగానే సేఫ్ జోన్‌కెళ్లడం.. దాడి జరిగినపుడు స్వీయ రక్షణకు సిద్ధమవడం

మాక్ డ్రిల్‌లో అవగాహన కల్పించే అంశాలివే.. దళాల యుద్ధ సన్నద్ధతపై ప్రధానికి రక్షణ శాఖ నివేదన

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం.. ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్

కశ్మీర్‌లోని రెండు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు పూడికతీత పనులు

నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల పూర్తికి కసరత్తు.. పాకిస్థాన్‌కు ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలంటూ ఆసియా అభివృద్ధి బ్యాంకుకు భారత్ విజ్ఞప్తి



### ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి నదిలో దూకి మృతి

పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో ఘటన

కావాలని చేసిందేనని కుటుంబ సభ్యుల ఆరోపణ

2

న్యూఢిల్లీ, మే 5: పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. పౌరుల భద్రతా సన్నద్ధతపై బుధవారం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర హోం శాఖ.. రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. డ్రిల్స్‌లో భాగంగా చేపట్టాల్సిన చర్యలను వివరించింది. వైమానిక దాడులు జరిగినపుడు అప్రమత్తం చేసే సైరన్లు మోగగానే ప్రజలు ఏం చేయాలన్నది ఈ డ్రిల్‌లో వివరిస్తారు. శత్రుదేశం దాడి చేసినపుడు తమను తాము ఎలా రక్షించుకోవాలో సామాన్య పౌరులకు, ప్రత్యేకంగా విద్యార్థులకు ఇందులో చెబుతారు. ఆకాశ మార్గాన విదేశీ నిఘాను తప్పించుకోవడానికి హఠాత్తుగా లైట్లు ఆపేసినా, తగ్గించినా.. భయపడకుండా, కంగారు పడకుండా

మిగతా 2వ పేజీలో...

**మోదీతో రాహుల్ భేటీ** — సైనిక సన్నద్ధతపై ప్రస్తావన.. సీబీఐ చీఫ్ ఎంపికపై చర్చ



## ఇన్‌చార్జ్ ఈవో సహా ఏడుగురిపై వేటు!

సింహగిరి గోడ దుర్ఘటనలో త్రిసభ్య కమిటీ సిఫారసులకు ఆమోదం

సస్పెండైన వారిలో దేవస్థానం, ఏపీటీడీసీ ఇంజనీర్లు

కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు.. బ్లాక్ లిస్టులో కాంట్రాక్టు సంస్థ

సచివాలయంలో సీఎంను కలిసిన ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్

ఏడుగురు భక్తులు మరణించిన దుర్ఘటనపై ప్రాథమిక నివేదిక సమర్పణ

అది నాసిరకం గోడ.. ప్లాన్ లేదు.. డిజైనూ లేదు.. ఫ్లైయాష్ ఇటుకలు వాడారు.. డ్రెయిన్ పైపులు పెట్టలేదు.. అన్నింటా అధికారుల నిర్లక్ష్యం

అమరావతి/విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవం నాడు గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన ఘటనకు బాధ్యులైన దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు సహా ఏడుగురు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. సింహగిరిపై జోడుభద్రాలు వద్ద ఓ భారీ గోడను ఉత్సవానికి ఐదు రోజుల ముందు నిర్మించారు. ఆ పక్క నుంచే రూ.300 క్యూలైన్ ఏర్పాటుచేశారు. గత 29వ తేదీ రాత్రి

మిగతా 12వ పేజీలో...

## 'లిక్కర్'లో బాసులూ లాక్!

సూపర్‌బాస్ సెటిల్‌మెంట్లకు వీరే కేరాఫ్!




ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలదే నాడు రాజ్యం

వీరిద్దరూ నోరు విప్పితే తాడేపల్లి కొంప కొల్లేరే

అందుకే విచారణకు వెళ్లకుండా ఏవో సాకులు

చివరికి సుప్రీంకోర్టులో కూడా దొరకని ఊరట

ఒకరిది 'ఢిల్లీ' సర్వీస్.. మరొకరిది సర్పంచ్‌గా చేసిన చరిత్ర.. సీఎం కార్యదర్శి, ఓఎస్డీలుగా డ్యూటీ

జగన్ కోటరీలో కీలకం.. అరాచక మద్యం పాలసీలో ఈ ఇద్దరి వరకు వచ్చి ఆగిన దర్యాప్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ అధికారంలో ఉన్నప్పుడు వారిదంతా హుంకరింపులు, ఘీంకరింపులే. ఎంతటివారినైనా సరే తమ పాదాక్రాంతం చేసుకుని అరాచకం చేశారు. అధికారం చేతిలో ఉంది కదా అని అటు అధికారులను, ఇటు పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు, నేతలు, ప్రజాప్రతినిధులను బెదిరించి మరీ దారిలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు మద్యం స్కామ్‌లో పీకల్లోతున కూరుకుపోయారు. విచారణకు ఎలా డుమ్మా కొట్టాలా? అని తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. వీరిలో ఒకరు జగన్ హయాంలో సూపర్‌బాస్‌గా

మిగతా 12వ పేజీలో...

## ఆ హక్కు ఏపీ ప్రభుత్వానికి ఉంది



12

స్వేచ్ఛగా నడుచుకోవచ్చు.. లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సహా ముగ్గురికి షాక్

ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ.. అరెస్టు నుంచి రక్షణకు కూడా తిరస్కృతి.. లాయర్ తీరుపై అసహనం

నిర్ణయాధికారం హైకోర్టుదేనని వ్యాఖ్య.. ఏదొక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సూచన.. తదుపరి విచారణ ఎల్లుండికి వాయిదా

## పోలీసు అధికారులు తప్పుడు అఫిడవిట్లు వేశారు!



వర్రా రవీందర్‌రెడ్డి భార్య పిటిషన్‌పై తుది విచారణ జరుపుతాం: హైకోర్టు

వివరాలు తెప్పించుకునేందుకు సమయం కోరిన ఏజీపీ

12

తదుపరి విచారణ జూన్ 17కి వాయిదా

సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరచాలని ఆదేశం

## ఓఎంసీ కేసులో సీబీఐ కోర్టు తీర్పు నేడే

ఇనుప గనుల అక్రమ తవ్వకాలతో రూ.884 కోట్లు లూటీ చేశారని అభియోగం

14 ఏళ్ల తర్వాత కేసు కొలిక్కి

219 మంది సాక్షుల విచారణ

2

3,400 డాక్యుమెంట్లు పరిశీలించిన కోర్టు

నిందితుల్లో గాలి జనార్దన్‌రెడ్డి, సబితారెడ్డి

అధికారులు రాజగోపాల్, కృపానందం కూడా

## 'గ్రూప్-1 కేసు'.. ఏ2 ఆఫీసులో సోదాలు

హైదరాబాద్‌లో 'కామ్‌సైన్' డైరెక్టర్ మధును విచారించిన పోలీసులు

డిజిటల్ మూల్యాంకనం చేసింది ఈ సంస్థే.. కేసులో ఏ2గా చేర్చిన అధికారులు

కీలక పత్రాలు, డాక్యుమెంట్లు స్వాధీనం.. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనంపై ఆరా

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం నాటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నియామకాల్లో జరిగిన అక్రమాలు వెలికితీస్తున్న విజయవాడ పోలీసులు కీలక ముందడుగు వేశారు. వైఎస్ అభిమాని, జగన్ సన్నిహితుడు 'కామ్‌సైన్' కంపెనీ డైరెక్టర్లలో ఒకరైన పమిడికాల్వ మధుసూదన్‌ను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో సోమవారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. వైఎస్ సహకారంతో మధుసూదన్ 2008లో 'కామ్‌సైన్' మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. కరోనా సమయంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకనం ఈ సంస్థ ఆధ్వర్యంలోనే నిర్వహించారు. దీంతో ఈ కంపెనీని ఏ-2గా పేర్కొన్నారు. వాస్తవానికి మాన్యువల్ విధానాన్ని కాదని, డిజిటల్ మూల్యాంకనం చేసి రూ.1.14 కోట్లు తీసుకున్న కామ్‌సైన్ కంపెనీ డైరెక్టర్ హోదాలో ఆయనపై కేసు నమోదైంది. గ్రూప్-1 మూల్యాంకనం అక్రమాల్లో

మిగతా 9వ పేజీలో...



## లిక్కర్ స్కాంలో దిలీప్ త్రిపాత్రాభినయం!

కమీషన్లు, ఆర్డర్లు, మనీలాండరింగ్ మూడింట్లోనూ చక్రం తిప్పారు: సిట్

రాజ్ కసిరెడ్డి కలెక్షన్ టీమ్‌కు కెప్టెన్ ఈయనే

విదేశాలకు పారిపోతుంటే అరెస్టు చేశాం

తదుపరి దర్యాప్తు కోసం ఆయన్ను పూర్తిస్థాయిలో విచారించాలి

ఈ స్కాం విలువ ఇప్పటికి 3.5 వేల కోట్లు

రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో చోటుచేసుకున్న రూ.వేల కోట్ల విలువైన అతిపెద్ద మద్యం కుంభకోణం కేసులో పైలా దిలీప్ ప్రధాన పాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పేర్కొంది. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డికి ముఖ్య అనుచరుడైన ఈయన ఈ వ్యవహారంలో త్రిపాత్రాభినయం చేసినట్లు

మిగతా 11వ పేజీలో...

## ఆర్‌టీఐలో నేనే సర్కార్!

ప్రభుత్వమైనా నన్ను అడిగే చేయాలి

నా సమ్మతితోనే నియామకాలు జరగాలి

అడక్కుండా నియమించడానికి సీఎస్ ఎవరు?

చీఫ్ కమిషనర్ బాషా హుంకరింపు!

కొత్త సెక్రటరీ గదికి తాళం వేయించిన వైనం

మర్యాదపూర్వకంగా కలుస్తానన్నా నిరాకరణ

అవమానభారంతో వెనుదిరిగిన సెక్రటరీ

రెండేళ్ల క్రితం ఆర్‌టీఐలోకి వచ్చిన మాజీ జర్నలిస్టు

ఒక అఖిల భారత సర్వీసు అధికారిపైనే జులుం

నేడు సీఎస్ దృష్టికి తీసుకెళ్లే యోచనలో అధికారి

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): "సెక్రటరీని నియమించడానికి ప్రభుత్వం ఎవరు? సీఎస్ ఎవరు? సమాచార కమిషన్‌లో ప్రభుత్వమైనా నన్ను అడిగే ఏదైనా చేయాలి"... వైసీపీ హయాంలో చీఫ్ సమాచార కమిషనర్‌గా నియమితులైన ఆర్.ఎం.బాషా హుంకరింపు ఇది. రెండేళ్ల క్రితం ఈ పోస్టులోకి వచ్చిన మాజీ జర్నలిస్టు అయిన బాషా...ఒక అఖిలభారత సర్వీసు అధికారినే అడ్డుకుని ఆయన గదికి తాళం వేయించారు. ఆయనను చాలాసేపు పడిగాపులు

మిగతా 11వ పేజీలో...

## విశాఖ-బెజవాడ విమాన సర్వీస్ పునరుద్ధరణ

జూన్ 1 నుంచి సేవలు

9



2

## యువత కోసం అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లు

ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో శిక్షణకు

ష్నైడర్ ఎలక్ట్రిక్‌'తో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

యువతకు ఉచితంగా ఒకాకిల్ శిక్షణకు డీల్

# సాయంత్రంలోగా సాయం

## వర్షాలు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు నేడు పరిహారం

పిడుగుపాటు బాధిత కుటుంబాలకూ

వెంటనే నష్టాన్ని అంచనా వేయండి

పలు జిల్లాలకు ఇంకా వర్షసూచన

ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు

అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి

సాంకేతికతతో ముందస్తు సూచనలు చేయాలి

రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందే

అకాల వర్షాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



వర్షాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు మంగళవారం సాయంత్రంలోగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. పిడుగుపాటు కారణంగా చనిపోయిన 10 మంది బాధితుల కుటుంబాలకు కూడా తక్షణమే పరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలో గత రెండురోజులు కురిసిన అకాలవర్షాలపై సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, విపత్తుల నిర్వహణ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జిల్లా

మిగతా 11వ పేజీలో...

మరో 2 రోజులు భారీ వర్షాలు, ఎండలు.. కోస్తా జిల్లాలకు విపత్తుల శాఖ హెచ్చరిక

## మళ్లీ '95 సీఎం'!

మంత్రులతో లంచ్ భేటీలకు శ్రీకారం

తొలి సమావేశంలో ఆనం, అనిత, కొండపల్లి, వాసంశెట్టి

ఆయా జిల్లాల్లో సమస్యలపై చర్చ

కేడర్ ఫిర్యాదుల్లో నిజాలుంటే ఎమ్మెల్యేలతో మాట్లాడండి

11

అవసరమనుకుంటే నా దృష్టికి తెండి

ఇక నెలకు 2-3 లంచ్ భేటీలు: బాబు

## అధికారుల జనం బాట!

21 నుంచి మూడ్రోజులు 'స్వర్ణాంధ్ర సంకల్పం'

తొలి విడత 450 సచివాలయాల్లో నిర్వహణ

పాల్గొననున్న ఐఏఎస్, ఐపీఎస్, హెచ్‌వోడీలు

ప్రభుత్వ పనితీరు, పథకాలపై అభిప్రాయ సేకరణ

సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి

9



## విశాఖ నుంచి రాయ్‌పూర్‌కు హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్

రూ.2,212 కోట్లతో పనులు.. మూడేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యం

రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో 165 కి.మీ. పొడవున ఏర్పాటు

భూసేకరణకు కమిటీల నియామకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రిఫైనరీ విస్తరణ పనులు పూర్తికావడంతో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) పైప్‌లైన్ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఇక్కడ ఏడాదికి 8.3 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన రిఫైనరీ ఉండగా, దానిని 15 మిలియన్ టన్నుల సామర్థ్యానికి విస్తరించింది. ఇక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా దూర ప్రాంతాలకు పెట్రోల్, డీజిల్, ఇతర ఇంధనాలు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధంచేసింది. విశాఖ నుంచి

మిగతా 12వ పేజీలో...

### ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి
## నదిలో దూకి మృతి

శ్రీనగర్, మే 5: పహల్గాంలో దారుణానికి పాల్పడ్డ ఉగ్రవాదులకు సహాయం అందించాడన్న ఆరోపణలు ఎదుర్కొన్న ఇంతియాజ్ అహ్మద్ మాగ్రే(23) ఆదివారం వెష్వ్ నదిలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. విచారణ నుంచి తప్పించుకునే క్రమంలో మరణించినట్టు భద్రత బలగాలు చెబుతుండగా, పోలీసులే కావాలని ఈ పని చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉగ్రవాదుల రహస్య స్థావరాలను చూపిస్తానంటూ తొలుత అతడు పోలీసులు, భద్రత బలగాలకు చెప్పాడు. పోలీసులు డ్రోన్ కెమేరా, ఇతర సామగ్రిని తీసుకొని అతడి వెంట వెళ్లారు. నదికి సమీపంలో ఓ స్థావరం ఉందని చెప్పి జవాన్లను అక్కడికి తీసుకెళ్లాడు. అక్కడికి చేరుకోగానే వారి నుంచి నుంచి తప్పించుకునేందుకు నదిలో దూకాడు. నదిలో ఈత కొట్టి బయటపడేందుకు ప్రయత్నించినా నీటి ప్రవాహ వేగం బలంగా ఉండడంతో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన డ్రోన్ వీడియో వైరల్‌గా మారింది. కొన్ని గంటల తరువాత అతడి శవం కుల్గాం జిల్లాలోని అహర్‌బల్ ప్రాంతంలో ఉన్న అబ్దుల్ వాగులో దొరికింది. కుటుంబ సభ్యులు మాత్రం దీనితో ఏకీభవించడంలేదు. విచారణ నిమిత్తం శనివారం అతడిని పోలీసులు తీసుకెళ్లారని తెలిపారు. ఇది కస్టోడియల్ మరణమేనని, దీనిపై దర్యాప్తు చేయించాలని డిమాండు చేశారు. ఉగ్రవాదులకు సహకరించినట్టు మాగ్రే విచారణలో అంగీకరించాడని తెలిసింది. కుల్గాంలోని తంగ్‌మార్గ్ అడవిలో దాక్కొన్న ఉగ్రవాదులకు ఆహారం, ప్రయాణ సౌకర్యాలు కల్పించినట్టు చెప్పాడని సమాచారం. మాగ్రే మరణం కుట్ర అని మాజీ సీఎం ముఫ్తీ ఆరోపించారు.

### భర్తను కోల్పోయిన హిమాన్షిపై ట్రోలింగా ?


హిమాన్షి నర్వాల్

న్యూఢిల్లీ, మే 5: ఇటీవల పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్‌కు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యు) మద్దతుగా నిలిచింది. ఆమెపై సోషల్‌మీడియాలో వస్తున్న ట్రోల్స్‌పై సీరియస్‌గా స్పందించింది. భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని విమర్శించడం బాధాకరమని కమిషన్ వ్యాఖ్యానించింది. ఆమె వ్యక్తిగత జీవితంపై చేసిన ట్రోల్స్ ఏమాత్రం ఆమోదయోగ్యమైనవి కాదని తెలిపింది. గత నెల 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత దేశం మొత్తం ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో ముస్లింలను, కశ్మీరీలను టార్గెట్ చేయవద్దంటూ హిమాన్షి ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలు కొంతమందికి నచ్చలేదు. దీంతో ఆమెపై ట్రోల్స్ మొదలుపెట్టారు.

### ..కరాచీ, లాహోర్‌లో మన గురుకులాలు: రాందేవ్

హమీర్‌పూర్, మే 5: పాకిస్థాన్ అంతర్గత కలహాలతో విచ్ఛిన్నమయ్యే స్థితిలో ఉందని యోగా గురువు బాబా రాందేవ్ అన్నారు. బలూచిస్థాన్ ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారని, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. "యుద్ధం వస్తే భారత్‌ను వారు నాలుగు రోజులు కూడా ఎదుర్కోలేరు. కొన్ని రోజుల్లోనే మనం కరాచీలో ఒక గురుకులాన్ని, లాహోర్‌లో మరో గురుకులాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తుంది" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు, సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తే ప్రపంచపటం నుంచి పాకిస్థాన్ తుడిచిపెట్టుకుపోతుందని బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ హెచ్చరించారు.

### పాక్‌లో భూకంపం..ఐదు వారాల్లో మూడోసారి

ఇస్లామాబాద్, మే 5: పాకిస్థాన్‌లో భూమి కంపించింది. రిక్టర్‌స్కేలుపై తీవ్రత 4.2గా నమోదైంది. సాయంత్రం 4 గంటల సమయంలో ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్ చిత్రాల్ జిల్లాలో భూ ప్రకంపనలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఐదువారాల్లో ఇది మూడో భూకంపం అని వెల్లడించారు.

### వక్ఫ్‌పై సుదీర్ఘ విచారణ అవసరం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుదీర్ఘంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అభిప్రాయపడ్డారు. దాఖలైన 72 పిటిషన్లపై విచారణను తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం చేపడుతుందని పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

### ప్రజల ఖాతాల్లోకి తగ్గుతున్న ప్రత్యక్ష నగదు బదిలీ

న్యూఢిల్లీ, మే 5: వివిధ సంక్షేమ పథకాల కింద కేంద్రప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ విధానం(డీబీటీ) ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రజల ఖాతాల్లో రూ.6.77లక్షల కోట్లు జమ చేసింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇదే అతి తక్కువ. ఆహార, ఎరువుల సబ్సిడీల్లో కోత విధించడమే డీబీటీ నిధుల్లో తగ్గుదలకు ప్రధాన కారణం కాగా, సంక్షేమ పథకాల్లో నకిలీ లబ్ధిదారులను ఏరివేయడం, పథకాల పునర్వ్యవస్థీకరణ, సబ్సిడీ నిధుల సద్వినియోగం వల్లే డీబీటీ నిధుల్లో తగ్గుదల నమోదవుతోందని ప్రభుత్వ అధికారులు తెలిపారు.

### నీరవ్ ఫైళ్లు ఉన్న ఈడీ ఆఫీసులో అగ్ని ప్రమాదం

ముంబై, మే 5: దక్షిణ ముంబైలోని ఈడీ జోన్-1 కార్యాలయంలో ఏప్రిల్ 28 (ఆదివారం) అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కీలక పత్రాల పరిస్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు పది గంటల పాటు మంటలు వ్యాపించాయి. బల్లార్డ్ ఎస్టేట్‌లోని ప్రయివేటు భవనం కైసర్ ఎ హింద్‌లోని నాలుగో అంతస్తు, ఒకటో అంతస్తులోని కొంత భాగంలో ఈ కార్యాలయం నడుస్తోంది. నాలుగో అంతస్తులో అదనపు డైరెక్టర్ ఆఫీసు ఉంది. ఆర్థిక నేరగాళ్లు మెహుల్ చోక్సీ నీరవ్ మోదీ, రాజకీయ నాయకులు ఛగన్ భుజబల్, అనిల్ దేశ్‌ముఖ్ వంటి ప్రముఖుల కేసుల ఫైళ్లు ఇందులోనే ఉన్నాయి. వాటిలో కొన్నయినా కాలిపోయి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 'రాహుల్ పౌరసత్వం' పిటిషన్ రద్దు

లఖ్‌నవూ, మే 5: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ పౌరసత్వాన్ని సవాల్‌చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. వేరే న్యాయ మార్గంలో కోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ పిటిషన్‌ను కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్ విఘ్నేశ్ శిశిర్ దాఖలుచేశారు. రాహుల్ బ్రిటన్ పౌరుడు అని నిరూపించే పత్రాలు, బ్రిటిష్ ప్రభుత్వం నడిపిన కొన్ని మెయిల్ సందేశాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ వాదించారు. రాహుల్ ద్విపౌరసత్వం కలిగి ఉన్న కారణంగా లోక్‌సభలో ప్రతిపక్షనేతగానూ, ఎన్నికల్లో అభ్యర్థిగానూ ఆయన అనర్హుడని వాదించారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కేంద్రం తరపున కోర్టుకు హాజరైన డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పాండే దీనిపై తుది నిర్ణయం తీసుకోవడానికి మరింత గడువు అవసరమని అభ్యర్థించారు. దీంతో కోర్టు పిటిషన్‌ను కొట్టేసింది.

### ఆ పార్టీలకు విరాళాల పేరిట పన్ను ఎగవేతలు

» దాతలపై ఐటీశాఖ కొరడా.. రూ.1,400 కోట్ల పన్ను వసూలు

న్యూఢిల్లీ, మే 5: రిజిస్టర్ అయి ఉండి గుర్తింపులేని రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తూ భారీగా పన్ను ఎగవేతలకు పాల్పడిన దాతలపై ఐటీ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. 2022 నుంచి 2024 వరకు ఇలా విరాళాలిచ్చిన 63వేల మంది దాతల నుంచి రూ.1,400 కోట్లను రికవరీ చేసింది. 2022-2023, 2023-2024లో 3,264కు పైగా గుర్తింపు లేని రాజకీయ పార్టీలు రూ.10వేల కోట్లకుగాపైగా ఎన్నికల విరాళాల అందుకున్నట్టు తెలుస్తోంది.

### గాజాను పూర్తిగా ఆక్రమించేద్దాం

» కొత్త ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదం

టెల్‌అవీవ్, మే 5: హమాస్ ఆధీనంలో ఉన్న గాజాను పూర్తిస్థాయిలో ఆక్రమించుకోవాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. సోమవారం జరిగిన 'భద్రతపై ఇజ్రాయెల్ క్యాబినెట్ కమిటీ' భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 50శాతం గాజా ఇజ్రాయెల్ ఆధీనంలో ఉండగా.. ఉత్తరాదిని కూడా పూర్తిస్థాయిలో ఆక్రమించాలని తాజా భేటీ నిర్ణయించింది.

# పారాహుషార్!


సీడీఎస్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాల అధిపతులతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

(మొదటిపేజీ తరువాయి)

తమ పని తాము చేసుకోవడం నేర్పిస్తారు. రక్షణ పరంగా ముఖ్యమైన పరిశ్రమలను, భవనాలను శత్రు దేశాలు గుర్తుపట్టకుండా మాయోపాయాలు చేయడం ఇందులో భాగమే. దాడి జరిగినపుడు కంగారు లేకుండా జనాన్ని తప్పించడంపై రిహార్సల్స్ చేస్తారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడిపై దర్యాప్తులో రష్యా, చైనా జోక్యం కోరుతున్న పాకిస్థాన్‌కు.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ షాక్ ఇచ్చారు! ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్నివిధాలా అండగా ఉంటామని భారత ప్రధాని మోదీకి ఆయన హామీ ఇచ్చారు. భారత విదేశాంగ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. సోమవారం మోదీకి ఫోన్ చేసి మాట్లాడిన పుతిన్.. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారని, ఈ దాడిలో అమాయకుల ప్రాణాలు పోవడం పట్ల ఆవేదన వెలిబుచ్చారని పేర్కొన్నారు. ఈ దాడుల వెనుక సూత్రధారులను ఎట్టిపరిస్థితుల్లోనూ చట్టం ముందు నిలబెట్టాలని పుతిన్ అభిప్రాయపడినట్టు ఆయన తెలిపారు. మరోవైపు.. వార్షిక ద్వైపాక్షిక భేటీ నిమిత్తం భారత్‌కు రావాలని మోదీ ఆహ్వానించగా, పుతిన్ అందుకు అంగీకరించారని క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అయితే, చైనా మాత్రం తాను ఎప్పటిలా పాక్‌పక్షమేనని మరోసారి నిరూపించుకుంది. దక్షిణాసియాలో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు తాము ఎప్పుడూ పాక్‌కు మద్దతు ఇస్తామని ఇస్లామాబాద్‌లో చైనా రాయబారి జియాంగ్ జైడాంగ్ తెలిపారు. సోమవారం ఆయన పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీతో భేటీ అయ్యారు. మరోవైపు.. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ ప్రధాని నరేంద్ర మోదీని సోమవారం కలిసి మాట్లాడారు. సాయుధ దళాల యుద్ధ సన్నద్ధతపై ఆయన ప్రధానికి వివరాలు వెల్లడించినట్లు సమాచారం. కాగా.. జమ్ముకశ్మీర్‌లోని జైళ్లపై ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందంటూ నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరీ ముఖ్యంగా హైప్రొఫైల్ ఉగ్రవాదులు, వారికి సహకరించే స్లీపర్ సెల్ సభ్యులు ఉండే శ్రీనగర్ సెంట్రల్ జైల్, జమ్ములోని కోట్ బల్వాల్ జైల్ వంటివాటిపై దాడులు జరిగే ప్రమాదం ఎక్కువని సమాచారం అందడంతో భద్రత కట్టుదిట్టం చేశారు. మరోవైపు.. పూంఛ్‌లో భారీ దాడికి ఉగ్రవాదులు పన్నిన కుట్రను భద్రతాదళాలు భగ్నం చేశాయి. దాడి కోసం సిద్ధం చేసిన ఐదు ఐఈడీలను, వైర్‌లెస్ సెట్లను స్వాధీనం చేసుకున్నాయి.

#### రిజర్వాయర్ల పూడికతీత

పహల్గాం దాడి వెనుక పాక్ హస్తం ఉన్న నేపథ్యంలో ఆ దేశానికి బుద్ధి చెప్పడానికి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన భారత్.. దాయాది దేశాన్ని ఎండగట్టే చర్యలను వేగవంతం చేసింది. అందులో భాగంగా కశ్మీర్‌లోని రెండు ప్రధాన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల (సలాల్, బాగ్లిహార్) నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు రిజర్వాయర్ ఫ్లషింగ్ ప్రక్రియ చేపట్టింది. అంటే జలాశయాల అడుగున పేరుకుపోయిన పూడికను అధిక నీటి ప్రవాహంతో దిగువకు తోసివేయడం. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈ ప్రక్రియను కిందటివారమే నిర్వహించింది. దీంతోపాటు.. నత్తనడకన సాగుతున్న/నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సహా పలు శాఖల మంత్రులు, సీనియర్ అధికారులతో ఈ వారమే కీలక భేటీ నిర్వహించనున్నట్టు తెలిసింది. ఈ ఆరు ప్రాజెక్టులూ పూర్తి అయిపోతే జమ్ముకశ్మీర్‌లో 10 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. మరింత సాగు, తాగు నీరు అందుబాటులోకి వస్తుంది. మరోవైపు.. పాకిస్థాన్‌కు ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలంటూ ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు భారత్ విజ్ఞప్తి చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆ బ్యాంకు 58వ వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు ఇటలీకి వెళ్లిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఈ అంశాన్ని ఏడీబీ చీఫ్ మసాటో దృష్టికి తీసుకెళ్లినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి.

### మోదీతో రాహుల్ భేటీ

» సైన్యం సన్నద్ధతపై ప్రస్తావన

» సీబీఐ చీఫ్ ఎంపికపై చర్చలు

న్యూఢిల్లీ, మే 5: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం దుర్ఘటన అనంతరం తలెత్తిన పరిస్థితులు, సైన్యం సన్నద్ధతపై రాహుల్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. నిజానికి ఈ సమావేశం సీబీఐ తదుపరి చీఫ్ ఎంపిక కోసం జరిగింది. సీబీఐ చీఫ్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ ఎంపిక చేయాల్సి ఉంది. దాంతో రాహుల్‌తో పాటు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ప్రధాని కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుత సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ ఈ నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది.

### భారత్‌కు దీటుగా బదులిస్తాం

» ఉద్రిక్తతల వేళ పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ వ్యాఖ్య

భారత్ ప్రతీకార చర్యలకు పాల్పడితే దీటుగా బదులిస్తామని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ చెప్పారు. దాడి జరిగిన వెంటనే తమ సైన్యం చురుగ్గా స్పందిస్తుందన్నారు. భారత్ ఏ క్షణంలోనైనా నియంత్రణ రేఖ వెంబడి దాడి చేసే అవకాశం ఉందని, దీనికి దీటుగా బదులిస్తామని పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యానించారు. మరోవైపు, భారత్, పాక్ సంయమనం పాటించాలని ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ సూచించారు. సమస్యకు సైనిక చర్య పరిష్కారం కాదన్నారు.


భారత్-పాక్ మధ్య ఉద్రిక్తల నేపథ్యంలో జవాన్లు దేశ సరిహద్దుకు తరలివెళుతున్నారు. సోమవారం తమిళనాడు నుంచి ప్రత్యేక రైలులో బయల్దేరిన జవాన్లు నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కొంతసేపు ఆగారు.

### లోకం తీరు




### దాయాది దొంగ బుద్ధి

» వేరే దేశాల మీదుగా భారత్‌కు సరుకులు

న్యూఢిల్లీ, మే 5: ఉగ్రవాదానికి ఊతమిస్తూ పెడదారి పట్టిన పాకిస్థాన్.. భారత్ తనపై విధించిన వాణిజ్య నిషేధాన్ని అధిగమించడానికి అడ్డదారిని ఎంచుకుంది. నేరుగా మనదేశానికి తన ఉత్పత్తులను పంపే అవకాశం లేకపోవడంతో.. యూఏఈ, సింగపూర్, ఇండోనేసియా, శ్రీలంక తదితర దేశాల గుండా పంపుతోందని ఒక అధికారి వెల్లడించారు. పాకిస్థాన్ నుంచి వచ్చే పండ్లు, ఎండు ఖర్జూరాలు, తోలు ఉత్పత్తులు, వస్త్రాల వంటివాటిని యూఏఈ రీప్యాక్, రీలేబుల్ చేసి భారత్‌కు పంపుతోందని ఆ అధికారి తెలిపారు. కొన్నిరకాల రసాయనాలను సింగపూర్ ద్వారా.. సిమెంట్, సోడా యాష్, వస్త్రాలకు సంబంధించిన ముడిపదార్థాలను ఇండోనేసియా ద్వారా పంపుతోందని వివరించారు. భారత్ నిషేధం విధించినప్పటి నుంచి ఇప్పటిదాకా ఇలా దాదాపుగా రూ.4,200 కోట్ల విలువైన ఉత్పత్తులను పాక్ భారత్‌కు పంపినట్టు సమాచారం.

#### పాక్ సైబర్ దాడులు!

గత కొద్దిరోజులుగా భారత రక్షణ వెబ్‌సైట్లను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తున్న పాక్ సైబర్ గ్రూపులు.. ఇండియాకు చెందిన మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్, మనోహర్ పర్రీకర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ వెబ్‌సైట్లను హ్యాక్ చేసి సున్నితమైన సమాచారాన్ని పొందినట్టు 'ఎక్స్' వేదికగా ప్రకటించుకున్నాయి! ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి, దాంట్లో ఉన్న భారత యుద్ధ ట్యాంకు స్థానంలో పాక్ యుద్ధ ట్యాంకును పెట్టారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడి వెనుక తమ హస్తం ఉందంటూ భారత్ దుష్ప్రచారం చేస్తోందని పాక్ తీవ్రంగా మండిపడింది. భారత ప్రచారాన్ని ఖండిస్తూ పాక్ పార్లమెంటు సోమవారం తీర్మానం చేసింది.



### ఓఎంసీ కేసులో..
### నేడు సీబీఐ కోర్టు తీర్పు

» నిందితుల్లో గాలి జనార్దన్‌రెడ్డి, సబితారెడ్డి

బళ్లారి, మే 5(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) ఇనుప గనుల అక్రమ తవ్వకాలకు పాల్పడిందన్న కేసులో సీబీఐ కోర్టు 14 ఏళ్ల తర్వాత మంగళవారం తుది తీర్పు వెలువరించనుంది. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో, అనంతపురం, బళ్లారి రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ఏరియా, అనంతపురం జిల్లా ఓబుళాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని ఇనుప గనులను ఓఎంసీ అక్రమంగా తవ్విందని అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం రోశయ్య 2009 డిసెంబరు 7న సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఓఎంసీలో మైనింగ్ కార్యకలాపాలను నిషేధిస్తూ అప్పటి ప్రభుత్వం జీవో 71ను విడుదల చేసింది. ఓఎంసీ అక్రమాల కేసులో అప్పటి ఓఎంసీ ఎండీ బీవీ శ్రీనివాస్‌రెడ్డిని ఏ-1గా, గాలి జనార్దన్ రెడ్డిని ఏ-2గా చేర్చారు. అప్పటి మైనింగ్ డైరెక్టర్ వాల్మికి రాజగోపాల్, అప్పటి ఐఏఎస్ అధికారి కృపానందం, గాలి జనార్దన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ఎం.అలీఖాన్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై కూడా సీబీఐ కేసు నమోదు చేసింది. 2011లో మొదటి చార్జిషీటు దాఖలు చేసింది. రూ.884.13 కోట్ల ప్రజాధనం లూటీ చేశారని పేర్కొంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత కేసు కొలిక్కి వచ్చింది. 219 మంది సాక్షులను విచారించిన సీబీఐ కోర్టు.. 3,400 డాక్యుమెంట్లను పరిశీలించింది. ఎట్టకేలకు మంగళవారం తీర్పు ఇవ్వనుంది.

# మా పరిధి చాలా పెద్దది!

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య.. బీజేపీ ఎంపీ దూబేపై 'ధిక్కార' విచారణకు నో

» అయితే పరిమిత ఆదేశాలిస్తామని స్పష్టం


నిశికాంత్ దూబే

న్యూఢిల్లీ, మే 5: సుప్రీంకోర్టుపైన, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నాపైన తీవ్ర విమర్శలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలన్న పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే తమ పరిధి చాలా విస్తృతమైనదని జస్టిస్ ఖన్నా సోమవారం స్పష్టంచేశారు. 'అయితే దీనిపై పరిమితత ఆదేశాలు జారీచేస్తాం. అందులో కారణాలను రికార్డు చేస్తాం. మా అభిప్రాయాలను వ్యక్తీకరిస్తాం. ధిక్కార పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం లేదు' అని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువు విధించడంపై దూబే తీవ్ర స్థాయిలో విమర్శించిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఖన్నాపైనా ఆరోపణలు చేశారు. ఆయన న్యాయవ్యవస్థను అవమానించేలా మాట్లాడారని.. కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు. ఇది సోమవారం జస్టిస్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. తివారీ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని 129వ అధికరణ ప్రకారం దూబేపై ధిక్కార చర్యలు ప్రారంభించాలని కోరారు. అత్యున్నత న్యాయస్థాన గౌరవాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉందని, ఇలా వదిలేయడానికి వీల్లేదని.. గతంలో (1991లో) ఢిల్లీ జ్యుడీషియల్ సర్వీసుల కేసులో ధిక్కార చర్యల వినతిని కోర్టు పరిగణనలోకి తీసుకుందని గుర్తుచేశారు (ఆ తీర్పులో.. సుప్రీంకోర్టు పరిధి, అధికారం పరిమితమైనవి కావని.. కోర్టు తన పరిధిని తాను నిర్ణయించగలదని.. అదే ఫైనల్ అని జస్టిస్ కేఎన్ సింగ్, జస్టిస్ కుల్‌దీప్‌సింగ్, జస్టిస్ ఎన్ఎం కస్లీవాల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం తేల్చి చెప్పింది). దీనిపై సీజేఐ స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. పెండింగ్ బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవలసిందేనంటూ సుప్రీంకోర్టు ఇటీవల చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని అంశాలపై జస్టిస్ ఖన్నా కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిని ఝార్ఖండ్‌లోని గొడ్డా లోక్‌సభ సభ్యుడు దూబే, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తప్పుబట్టారు. "భారత ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి నియమిస్తారు. మిమ్మల్ని నియమించే అథారిటీకి మీరెలా ఆదేశాలిస్తారు? ఈ దేశంలో చట్టాలు చేసేది పార్లమెంటు. పార్లమెంటును మీరెలా శాసించగలరు? 3 నెలల్లో రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని ఏ చట్టం చెబుతోంది. దేశాన్ని అరాచకం వైపు తీసుకెళ్లాలని మీరు (కోర్టు) భావిస్తున్నారా? దేశంలో మతయుద్ధాలకు సుప్రీంకోర్టే కారణం. తన పరిధులు దాటి వ్యవహరిస్తోంది. ప్రతిదానికీ సుప్రీంకోర్టుకే వెళ్లేటట్లయితే ఇక పార్లమెంటును, అసెంబ్లీని మూసివేయాలి' అని దూబే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు కోర్టు పరువుకు నష్టం కలిగించేవిగా.. రెచ్చగొట్టేవిగా.. విద్వేషపూరితంగా ఉన్నాయని, ఆయనపై ధిక్కార చర్యలు తీసుకోవలసిందేనని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కూడా కోరింది. ఈ దాడి ఓ సంస్థగా సుప్రీంకోర్టుపైనే గాక.. వ్యక్తిగా సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నాపై కూడా అని.. ఇది ఆమోదయోగ్యం కాదని.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తీర్మానం కూడా ఆమోదించింది. ఆయనపై ధిక్కార చర్యలకు అనుమతివ్వాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి సైతం ఓ లాయర్ లేఖ రాశారు. దూబే వ్యాఖ్యలు వ్యక్తిగతమని బీజేపీ కూడా పేర్కొంది.



### ఎర్రకోట ఒక్కటే అడుగుతున్నారేం!

» మొఘల్ వారసురాలిని ప్రశ్నించిన సుప్రీం.. పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, మే 5: ఎర్రకోటను తనకు అప్పగించాలని మొఘల్ చక్రవర్తుల వారసురాలు చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనవడు బెదర్ భక్త్ భార్య సుల్తానా బేగం దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై దిగ్భ్రాంతికి గురైన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 'ఎర్రకోట మాత్రమే ఎందుకు? ఫతేపూర్ సిక్రీ, తాజ్‌మహల్‌లను ఎందుకు అడగట్లేదు?.. మీరు దీని గురించి వాదించాలనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు. పిటిషన్‌ను కొట్టివేశారు. సుల్తానా బేగం ప్రస్తుతం కోల్‌కతా సమీపంలోని హౌరాలో నివసిస్తున్నారు. ఎర్రకోటకు అసలైన యజమానులైన మొఘల్ చక్రవర్తుల ప్రత్యక్ష వారసురాలు అనే కారణంతో దాన్ని తనకు అప్పగించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తనకు ఆర్థిక సాయం చేయాలని ఆమె కోరారు. కాగా, సుల్తానా బేగం ఈ అంశంపై కోర్టును ఆశ్రయించడం ఇదే తొలిసారి కాదు. 2021లో ఆమె ఇదే డిమాండ్‌తో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది.

# యువత కోసం అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లు

» ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో శిక్షణకు.. 'ష్నైడర్ ఎలక్ట్రిక్'తో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

» యువతకు ఉచితంగా ఒరాకిల్ శిక్షణకు డీల్

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా.. ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా, ఒరాకిల్ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రెండు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి లోకేశ్ సమక్షంలో సోమవారం ఉండవల్లిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఇండియా మధ్య ఈ ఒప్పందం జరిగింది. ఒప్పందంలో భాగంగా 2027 మార్చిలోగా ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, ఎన్ఏసీ శిక్షణ కేంద్రాల్లో 20 అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారు. 9 వేల మందికి ఈ ల్యాబ్‌ల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణా పరికరాలు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఇండియా రూ.5 కోట్లు ఖర్చు చేయనుంది. శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ చూపించడంలోనూ సహకారం అందిస్తుంది. మంత్రి లోకేశ్ విజ్ఞప్తితో రూ.15 కోట్లతో మంగళగిరిలో ష్నైడర్ ఎలక్ట్రిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు. అనంతపురంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పా టు చేయనున్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి.గణేష్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ కె.దినేష్‌కుమార్, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా హెడ్ దీపక్ శర్మ, ఎస్‌జీఎం రిచా గౌతమ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

#### మూడేళ్లలో 4లక్షల మందికి ఒరాకిల్ శిక్షణ

ఐటీ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో యువతకు శిక్షణ ఇచ్చి, వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేయడానికి ప్రఖ్యాత సంస్థ ఒరాకిల్‌తో నైపుణ్యాభివృద్ధి సంస్థ మరో ఒప్పందం చేసుకుంది. మంత్రి లోకేశ్ సమక్షంలో సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా యువతకు ఒరాకిల్ యూనివర్సిటీ లెర్నింగ్ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా లభించనుంది. మహిళలు, ఆర్థికంగా వెనకబడిన వర్గాల యువత ఒరాకిల్ క్లౌడ్‌లో నైపుణ్యం సాధించేందుకు చేయూత అందించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. తొలి ఏడాది లక్ష మందికి, రెండో ఏడాది లక్షన్నర, మూడో ఏడాది మరో లక్షన్నర మందికి ఒరాకిల్ మై లెర్న్ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా శిక్షణ అందిస్తారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి.గణేష్‌కుమార్, ఒరాకిల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ శైలేంద్రకుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

### డీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» పారదర్శకంగా టీచర్ల బదిలీలు

» విద్యా శాఖపై మంత్రి లోకేశ్ సమీక్ష

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానానికి ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యా శాఖపై సమీక్షలో మంత్రి మాట్లాడారు. పారదర్శకంగా టీచర్ల బదిలీలు చేపట్టాలని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. డిగ్రీ కాలేజీల్లో త్రీ మేజర్, సింగిల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలుపై సంబంధిత భాగస్వాముల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 205 ప్రభుత్వ గ్రంథాలయాలను ప్రక్షాళన చేసి నిరుద్యోగ యువత, ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ల బదిలీలకు మంత్రి అంగీకారం తెలిపారు. ఉన్నతాధికారులు కోన శశిధర్, భరత్ గుప్తా, కృతికా శుక్లా, విజయ రామరాజు పాల్గొన్నారు.



స్కూటీ, ట్రాక్టర్, కారుపై పడిన చెట్టు కొమ్మ, మృతిచెందిన పూర్ణిమ



# చెట్టు రూపంలో మృత్యువు

- నడుపుతున్న వాహనంపై విరిగిపడ్డ చెట్టు కొమ్మ
- మహిళ దుర్మరణం.. విశాఖలో ఘటన

విశాఖపట్నం/సీతమ్మధార, మే 5(ఆంధ్రజ్యోతి): స్కూటీపై వెళుతున్న మహిళను మృత్యువు చెట్టు రూపంలో మాటేసి కాటేసింది. విశాఖపట్నం సీతమ్మధారలోని ఏఎంజీ ఆస్పత్రి(నక్కవానిపాలెం) వద్ద సోమవారం ఈ విషాదం చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తుని బ్రాంచిలో చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న సీమకుర్తి సాయిబాబా కుటుంబంతో విశాఖలోని ఏఎంజీ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న సితార ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన రోజూ రైలులో తుని వెళ్లి వస్తుంటారు. సోమవారం ఉదయం తుని వెళ్లేందుకు బయలుదేరిన సాయిబాబాను ఆయన భార్య పూర్ణిమ (42) ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్‌లో దింపి, తిరిగి ఇంటికొచ్చారు. అనంతరం పూజా సామగ్రి కోసం ఉదయం 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై సీతమ్మధారవైపు బయలుదేరారు. ఏఎంజీ ఆస్పత్రి ఎదురుగా వచ్చేసరికి రోడ్డుపక్కనే ఉన్న తురాయి చెట్టు కొమ్మ ఒక్కసారిగా విరిగి పూర్ణిమ నడుపుతున్న వాహనంపై పడింది. స్థానికులు వెంటనే స్పందించి చెట్టుకొమ్మను వెంటనే తొలగించినప్పటికీ తలకు తీవ్రమైన గాయాలవడంతో పూర్ణిమ అక్కడికక్కడే మరణించారు. అదే సమయంలో డెబ్రిస్ లోడుతో వెళ్తున్న జీవీఎంసీ ట్రాక్టరుపై కూడా కొమ్మ భాగం పడడంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. రోడ్డుపక్కనే నిలిపి ఉన్న మరో కారు కూడా ధ్వంసమైంది. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# 'గోడ' నాణ్యతపై సంతృప్తి

- నేడు లోతైన విశ్లేషణ చేపడతామన్న విదేశీ నిపుణులు
- పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటన
- డయాఫ్రం వాల్, బట్రస్ డ్యాం పనుల పరిశీలన
- 'వెదర్‌రాక్'పై జలవనరుల శాఖకు మద్దతు
- వారి వెంట కేంద్ర, రాష్ట్ర అధికారులు



డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విదేశీ నిపుణులు, అధికారుల బృందం

అమరావతి/పోలవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): డయాఫ్రం వాల్ నిర్మాణ పనుల్లో వేగం, నాణ్యతపై విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే సమయంలో వాటిపై మంగళవారం లోతైన విశ్లేషణ చేస్తామన్నారు. ఆదివారమే రాజమహేంద్రవరం చేరుకున్న అమెరికా నిపుణులు డేవిడ్ బి.పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో.. కెనడాకు చెందిన సీన్ హెంచ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ సోమవారం ఉదయం పోలవరం ప్రాజెక్టు వద్దకు వచ్చారు. తొలుత సమావేశ కార్యాలయంలో జలవనరుల శాఖ ఇంజనీర్లు, అధికారులతో భేటీ అయ్యారు. అనంతరం డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతంలో పనులను, బట్రస్ డ్యాం పనులను పరిశీలించారు. బట్రస్ డ్యాం నిర్మాణంలో వినియోగిస్తున్న రాతి, కాంక్రీట్ నాణ్యత, జరుగుతున్న పనుల విధానాలను, డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో పనులను పరిశీలించారు. డయాఫ్రం వాల్, బట్రస్ డ్యాం నిర్మాణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన అనంతరం.. నేల గట్టిదనానికి చేస్తున్న పనులు, బట్రస్ డ్యాం నిర్మాణంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, ఎగువ కాఫర్ డ్యాం పటిష్ఠతకు చేపట్టిన పనులను తిలకించారు. ఇంజనీర్లను వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, మేఘా సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీశ్‌బాబు, బావర్ కంపెనీ ప్రతినిధి హసన్ ఆ వివరాలన్నీ తెలియజేశారు. నిపుణుల వెంట పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జల సంఘం అధికారులు సరబ్‌జిత్ సింగ్ భక్షి, అశ్వినీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) అధికారులు మనీశ్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి, వాప్కోస్ ప్రతినిధులు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, బావర్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు తదితరులు పర్యటించారు. మధ్యాహ్నం రెండు గంటల దాకా క్షేత్రస్థాయి పర్యటన చేసిన నిపుణులు.. ప్రాథమికంగా డయాఫ్రం వాల్ నిర్మాణంపైనా.. కాంక్రీట్ మిక్చర్‌పైనా సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే వెదర్‌రాక్ (పిండి రాయి)ని పరిగణనలోకి తీసుకోకుండా.. భూమి పొరల్లో ఉన్న గట్టి రాయిని రెండు మీటర్లు తవ్వాలని రాష్ట్ర జల వనరుల శాఖ చేసిన సూచనలతో బావర్ ఏకీభవించలేదు. మరింత లోతుగా గట్టి రాయి తగిలేంత వరకూ వెళ్తే.. సమయం వృధాతో పాటు ఖర్చు కూడా పెరుగుతుందని పేర్కొంది. దీనిపై జల వనరుల శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వెదర్‌రాక్‌ను చేత్తో ముట్టుకుంటేనే పిండిలా రాలిపోతుందని.. దానికి గట్టిదనం ఉండదని.. అందువల్ల సహజసిద్ధమైన గట్టి రాయి తగిలాక.. దానిపై రెండు మీటర్ల లోతులో తవ్వితేనే నిర్మాణంలో గట్టిదనం ఉంటుందని తేల్చిచెప్పింది. కాంట్రాక్టు ఒప్పందంలోను, వాల్ డిజైన్‌లోనూ ఇదే తరహాలో పనులు చేయాలని ఉందని గుర్తుచేసింది. ఉభయపక్షాల వాదనలను ఆసాంతం విన్న అమెరికా, కెనడా నిపుణులు.. జల వనరుల శాఖ సూచనలనే సమర్థించారు. మంగళవారం మరింత లోతుగా విశ్లేషిద్దామన్నారు. ప్రస్తుత పనులు తమ సూచనలు, సలహాలు, డిజైన్ల మేరకే జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.





కొత్తఇసుకపల్లిలో వేగులమ్మతల్లికి గరగ తీసుకు వెళుతున్న వృద్ధురాలు పేరంటాలు

## పవన్ గెలుపు మొక్కు తీర్చుకున్న 96 ఏళ్ల అవ్వ

కొత్తపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆ వృద్ధురాలికి జనసేన పార్టీ అంటే ఎనలేని అభిమానం. పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపు.. ఆ తర్వాత ఆయన డిప్యూటీ సీఎం కావడంతో సోమవారం మొక్కు తీర్చుకుంది. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన 96 ఏళ్ల వృద్ధురాలు పోతుల పేరంటాలు జనసేన పార్టీకి, పవన్‌కల్యాణ్‌కు వీరాభిమాని. 2024లో పవన్ పిఠాపురం నుంచి పోటీ చేయడంతో.. గ్రామంలోని వేగులమ్మ తల్లికి పొర్లుదండాలు పెట్టింది. పవన్‌ను గెలిపించాలని, ఆయన గెలిస్తే అమ్మవారికి గరగ చేయించి సమర్పిస్తానని మొక్కుకొంది. తనకు వచ్చే పింఛను సొమ్ములో రూ.2,500 చొప్పున పోగు చేసింది. ఈ నెలతో రూ.27వేలు కాగా, ఆ సొమ్ముతో అమ్మవారికి గరగ చేయించి సోమవారం సమర్పించింది. పవన్‌కల్యాణ్‌తో కలిసి బువ్వ తినాలని ఉందని, ఆ బువ్వ తన పింఛను డబ్బుతోనే తయారు చేస్తానని చెప్పింది.

## ఉపాధి శ్రామికుల ప్రమాద పరిహారం పెంపు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులు పని ప్రదేశాల్లో చనిపోతే వారికి చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పని ప్రదేశాల్లో గాయపడి శాశ్వత వైకల్యం చెందితే పరిహారాన్ని రూ.ఒక లక్షకు పెంచారు. గాయపడటం ద్వారా పూర్తిగా మంచానపడితే రూ.2 లక్షలకు పెంచారు. పని ప్రదేశాల్లో ఆరేళ్ల లోపు పిల్లలు గాయపడి వికలాంగులైతే రూ.లక్షకు పెంచుతూ సవరణ జీఓ జారీ చేశారు.







# ఏడాదంతా పర్యాటక శోభ..!

## టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్ సిద్ధం చేయాలి

- నైట్ సఫారీ, డాల్ఫిన్ షోల ఏర్పాటును పరిశీలించాలి
- పర్యాటక రంగంలో 20% వృద్ధి సాధించడమే లక్ష్యం
- రాష్ట్రంలో 150 అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేయాలి
- టూరిజం అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పర్యాటక శోభ తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందేలా, అందరినీ ఆకర్షించేలా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనికోసం టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రదేశాల్లోనూ ఆయా ప్రాంతాల ప్రాముఖ్యతను బట్టి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం పర్యాటక రంగంపై సచివాలయంలో టూరిజం అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందన్నారు. ఈ రంగంలో తప్పనిసరిగా 20 శాతం వృద్ధి సాధించాలని నిర్దేశించారు. సింగపూర్ తరహాలో రాష్ట్రంలోనూ నైట్ సఫారీ గురించి అధ్యయనం చేయాలని, అందమైన సముద్రతీర ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్వాకల్చర్‌లో ఏపీ నంబర్‌వన్‌గా ఉన్నా.. దాన్ని ప్రతిబింబించే ప్రాజెక్టులు ఎక్కడా లేవన్నారు. రాష్ట్రంలోనూ డాల్ఫిన్ షోలు ఏర్పాటు చేయాలని సూచించారు. గండికోటకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రసాద్ పథకం కింద సింహాచలం, అన్నవరంలో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. రాష్ట్రమంతా 150 అరకు కాఫీ స్టాల్స్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భవానీ ఐల్యాండ్, హోప్ ఐల్యాండ్ సహా రాష్ట్రంలోని ఐల్యాండ్లన్నింటినీ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం చెప్పారు. కాగా.. కొండపల్లి, కూచిపూడి, కడియం, మంగళగిరి, చీరాల, బాపట్ల అరకు ప్రాంతాల్లో మొత్తం 14 చోట్ల ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొనగా.. వాటిని 50 చోట్ల ఏర్పాటు చేయాలని సీఎం నిర్దేశించారు. మరోవైపు రాష్ట్రంలోని 20 ప్రధాన దేవాలయాల్లో టెంపుల్ టూరిజాన్ని, అలానే విశాఖ, అమరావతిలో హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని చెప్పారు. అమరావతిని క్రియేటివ్ సిటీ హబ్‌గా చేయాలన్నారు.

### టెంట్ సిటీస్..

రాష్ట్రంలో అరకు, గండికోట సహా 6 ప్రాంతాల్లో 180 టెంట్లతో టెంట్ సిటీస్ ఏర్పాటు చేస్తున్నామని, ఇంకా సీ క్రూయిజ్, రివర్ క్రూయిజ్ సర్వీసులు ప్రవేశ పెడుతున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాజమండ్రి, విజయవాడ, బెరంపార్క్, సూర్యలంకలో పర్యాటకుల కోసం త్వరలోనే హౌస్ బోట్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. రూ.76 కోట్లతో రాష్ట్రంలో పర్యాటక రంగానికి చెందిన 15 హోటళ్లు, రిసార్టులను అప్‌గ్రేడ్ చేయగా, మరో 15 హోటళ్లు, రిసార్టులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పర్యాటక రంగాన్ని ఆకట్టుకునేందుకు 8 మెగా ఈవెంట్స్, 11 నేషనల్ ఫెయిర్స్, 10 ఇంటర్నేషనల్ ఫెయిర్స్ నిర్వహిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. కొత్తగా రోప్‌వేల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న 10 ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. రూ.12,565 కోట్ల పెట్టుబడితో 8,073 రూముల సామర్థ్యం కలిగిన హోటళ్లు, రిసార్టులకు సంబంధించి మొత్తం 69 ప్రాజెక్టులు చేపట్టేందుకు వివిధ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని సీఎం అధికారులకు చెప్పారు.

### హోమ్‌స్టే పాలసీతో స్థానికులకు జీవనోపాధి

స్థానికులకు జీవనోపాధి, సంస్కృతి పరిరక్షణ, సుస్థిర పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా గిరిజన, వారసత్వ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 500కి పైగా హోమ్ స్టేలు గుర్తించామని అధికారులు సీఎంకు తెలిపారు. వంతమూరు, మగడ, కూరిడి, తజంగి వంటి అరకు గిరిజన ప్రాంతాల్లోనూ హోమ్ స్టేలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తిరుపతిలో ఇప్పటికే ఉన్న 600కు పైగా హోమ్‌స్టేలను ప్రముఖ సంస్థలైన ఎయిర్‌బీఎన్‌బీ, యాత్రధామ్, హోమ్‌స్టేస్ ఆఫ్ ఇండియా, మేక్ మై ట్రిప్ తదితర భాగస్వాముల సహకారంతో అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా హోమ్ స్టే పాలసీ రూపొందించాలని సీఎం అధికారులకు సూచించారు.

# అన్ని సేవలూ వాట్సా్ప్‌లోనే..

- వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన పెంచాలి
- వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం
- డేటా లేక్ పనులు వేగవంతం చేయాలి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కార్యకలాపాలపై సోమవారం అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. డేటా లేక్ పనులు కూడా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. డ్రోన్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పురపాలక శాఖ, ప్రజారోగ్య శాఖలు దోమల నివారణకు డ్రోన్‌లు ఎక్కువగా వినియోగించాలన్నారు. అలాగే వర్క్‌ఫ్రమ్ హోంను అమలు చేయాలని, ఈ విధానాన్ని కొనసాగించేలా నిరంతరం కృషి చేయాలని సూచించారు. రాబోయే మూడేళ్లలో ఎన్ని ఉద్యోగాలను కల్పిస్తామో, వారికి ఎలాంటి నైపుణ్యాలు అందిస్తామో అనే అంశంపై కసరత్తు చేయాలని చెప్పారు. ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ.. డేటా లేక్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని సీఎంకు వెల్లడించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 273 రకాల సేవలు అందిస్తున్నామని.. ఈ ఏడాది జూన్ 12 నాటికి 370 నుంచి 380 సేవలు అందిస్తామని చెప్పారు. ఆర్టీజీఎస్‌లో అవేర్ హబ్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను గమనిస్తూ ప్రజలకు సమాచారం అందిస్తామని భాస్కర్ వివరించారు.

## ఏపీపీజీసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశానికి (ఏపీ పీజీసెట్-2025) దరఖాస్తు గడువు ఈ నెల 11వ తేదీ దాకా పొడిగిస్తున్నట్లు ఏపీపీజీసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు తెలిపారు.

## నేడు ఏపీఈసెట్.. 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఈసెట్-2025) మంగళవారం జరగనుంది. పరీక్షల నిర్వహణ కోసం ఏపీలో 109, హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఏపీఈసెట్ కమిటీ చైర్మన్, అనంతపురం జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య సోమవారం విలేకరులకు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## గత్యంతరం లేక...

న్యాయస్థానాలతో మొట్టికాయలు వేయించుకోవడం, అదికూడా ఎన్నికలు ఇంకో ఏడాదిలో ఉండగా ఏ ప్రభుత్వానికైనా ఇబ్బంది కరమైన విషయమే. తమిళనాడు మంత్రివర్గంనుంచి ఇటీవల ఇద్దరు మంత్రులు రాజీనామా చేయడం వెనుక చాలా అంశాలు పనిచేశాయి. ఓ వారం గడువు ఇచ్చి, పదవికావాలో, జైలుకావాలో తేల్చుకోమని సుప్రీం కోర్టు చెప్పిన తరువాత, తన బెయిల్ రద్దుకావడం ఖాయమని సెంథిల్ బాలాజీకి అర్థమైపోయింది. సెంథిల్ విషయంలో డీఎంకె ప్రభుత్వం ఆది నుంచీ ఎంత నిస్సిగ్గుగా వ్యవహరిస్తూవచ్చిందో తెలియనిదేమీ కాదు. మరో మంత్రి పొన్ముడి కూడా హిందూమత సంబంధిత వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా మద్రాస్ హైకోర్టుతో చీవాట్లు తిని రాజీనామా చేయాల్సి వచ్చింది. ఏడాదిలో ఎన్నికలున్న నేపథ్యంలో, న్యాయస్థానాల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న మంత్రులను గ్రక్కున విడవకపోతే, వారి నిష్క్రమణ వల్ల రేపటి ఎన్నికల్లో కలిగే రాజకీయనష్టం కంటే ప్రజల్లో ముందుగానే అప్రదిష్టపాలవుతామన్న భయం డీఎంకె అధినాయకత్వాన్నీ వెంటాడి ఉంటుంది.

వీరి రాజీనామాలను డీఎంకె నాయకులు ఏ విధంగానైనా సమర్థించుకో వచ్చును గానీ, న్యాయస్థానాలే వీళ్ళిద్దరినీ బయటకు గెంటేశాయన్నది వాస్తవం. సెంథిల్ రాజీనామా విషయం తెలియగానే, ఆయన బెయిల్ రద్దు కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో ఉన్న మంత్రిగారు బయటవుంటే అందరినీ ప్రభావితం చేస్తారు కనుక, మళ్ళీ జైలుకు పంపేయాలని ఒక బాధితుడితోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ కూడా కోరిన విషయం తెలిసిందే. కేసు తేలే వరకూ సెంథిల్‌కు మళ్ళీ మంత్రిపదవి ఇవ్వకూడదన్న నిబంధన విధించాలంటూ న్యాయమూర్తిని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థిస్తూ, ఆ నియమం లేకుంటే మరో నెలలో, అంటే, మే 24న సదరు న్యాయమూర్తి రిటైర్ అయిన మర్నాడే సెంథిల్ మళ్ళీ మంత్రి అయిపోవచ్చునని ఓ హెచ్చరిక కూడా చేశారు. అదేకనుక జరిగితే అప్పుడు మళ్ళీ బెయిల్ రద్దుకోసం రండి అంటూ న్యాయమూర్తి అన్నారు. నిజానికి, సెంథిల్ బాలాజీ విషయంలో డీఎంకె ఆదినుంచీ అదేరీతిన వ్యవహరిస్తూ వచ్చింది. 2023 జూన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఈయనను అరెస్టుచేసింది.

ఈ కేసులో ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారించినప్పటికీ, దర్యాప్తు సాగక, బాలాజీ అన్యాయంగా జైల్లో మగ్గిపోతున్నారని, 21వ అధికరణ ఉల్లంఘన జరుగుతోందని చెప్పి సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు గత ఏడాది సెప్టెంబర్‌లో బెయిల్ మంజూరుచేసింది. డీఎంకె శ్రేణుల ఘన స్వాగత సత్కారాల మధ్య జైలు నుంచి బయటకు వచ్చిన సెంథిల్‌ను నలభై ఎనిమిదిగంటల్లోనే స్టాలిన్ మళ్ళీ మంత్రిని చేసేశారు. సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మాత్రమే ఇచ్చిందనీ, నిర్దోషి అనలేదని స్టాలిన్‌కు తెలియకపోదు.

జయలలిత హయాంలో ప్రభుత్వ రవాణాసంస్థలో ఉద్యోగాలు అమ్ముకున్న ఆరోపణలమీద సిట్ దర్యాప్తులో సెంథిల్ కుట్రంతా వెలుగు చూసి న్యాయస్థానాలకు చేరింది. నిజానికి, సెంథిల్ అవినీతిమీద విపక్ష నేతగా స్టాలిన్ స్వయంగా పోరాడారు. తాను శాసనసభలో సాక్ష్యాలు సమర్పించినా చర్యలు లేనందుకు జయలలిత ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆ తరువాత జయలలిత దూరం పెడితే డీఎంకెలో చేరిన సెంథిల్‌ను చేరదీసి, మరింత నిస్సిగ్గుగా ఆయన పక్షాన వ్యవహరించడం ఆరంభించారు.

సెంథిల్ పదవిలో ఉంటే దర్యాప్తు ప్రక్రియకు విఘాతం కలుగుతుం దంటూ అప్పట్లో రాజ్‌భవన్ సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ప్రకటన ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తున్నది. సెంథిల్ జైల్లో ఉన్నా కూడా ఎనిమిదినెలల పాటు పోర్టుఫోలియో లేని మంత్రిగా కొనసాగారు. క్యాష్ ఫర్ జాబ్స్, మనీ లాండరింగ్ ఆరోపణలతో పాటు, అంతకుపూర్వంనుంచే ఆయనపై అనేక క్రిమినల్ కేసులున్నాయి. అటువంటి వ్యక్తిని ఇప్పుడు సుప్రీంకోర్టు ఆగ్రహం నేపథ్యంలో పదవినుంచి తప్పించినప్పటికీ, ఒక అవినీతిపరుడిని వెనకేసు కొచ్చిన అప్రదిష్ఠ స్టాలిన్‌కు తప్పదు. మరో మంత్రి పొన్ముడి సైతం ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఇరుక్కొని, కేవలం న్యాయస్థానాల ఉపశమనాల కారణంగా బయట తిరుగుతూ, చిత్తం వచ్చినట్టు మాట్లాడుతూ స్వేచ్ఛను దుర్వినియోగం చేసినవారే. కోర్టుల కారణంగా ఈ ఇద్దరు మంత్రులను వదిలించుకున్నంత మాత్రాన స్టాలిన్‌కు అంత సులభంగా మచ్చ తొలిగిపోదు.

# 'అంతరిక్ష' విజ్ఞాని కస్తూరి రంగన్

భారతీయ అంతరిక్ష విజ్ఞాన వినీలాకాశంలో ఓ ధ్రువతార డా. కృష్ణ స్వామి కస్తూరి రంగన్. ఆయన ఇటీవల (2025 ఏప్రిల్ 25న) కన్నుమూసిన విషయం విదితమే. 1994–2003 మధ్యకాలంలో 'ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్' (ఇస్రో)ను విజయవంతంగా ముందుకు నడిపిన ద్రష్ట. 84 ఏళ్ల వయసులో కన్నుమూసే నాటికి కూడా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్, ఎన్ఐఐటి యూనివర్సిటీలకు కస్తూరి రంగన్ ఛాన్సలర్‌గా ఉన్నారు. అంతకుముందు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఛాన్సలర్, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యత్వం, ప్లానింగ్ కమిషన్ సభ్యత్వం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ డైరెక్టర్. వీటన్నిటికీ మించి 'న్యూ ఎడ్యుకేషన్ పాలసీ–2020' కమిటీకి ఛైర్మన్... ఇలా కస్తూరి రంగన్ అందించిన సేవలు ఎనలేనివి.

భారతదేశపు తొలి ప్రయోగాత్మక భూ అధ్యయన ఉపగ్రహాలైన భాస్కర–1, 2లకు సంబంధించి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గానూ, తర్వాత రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ (ఐఆర్ఎస్–1ఎ)కు పర్యవేక్షకుడిగానూ ఆయన బాధ్యతలు నిర్వహించారు. తర్వాత సారథిగా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అలాగే పోలార్ శాటిలైట్స్‌ను విజయవంతం చేశారు. వ్యవసాయం, అటవీ సంపద, టౌన్ ప్లానింగ్, నీటి వనరుల నిర్వహణ, చేపల పెంపకం, ఆరోగ్యం, విద్య వంటి మంత్రిత్వ శాఖలకు దోహదపడే నేషనల్ నేచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ సిస్టమ్స్ ద్వారా సామాన్య జనానికి అంతరిక్ష విజ్ఞానం ఎలా సాయం చేయగలదో చేసి చూపించారు. 1999 నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా మే 11న చేసిన ప్రసంగంలో చంద్రుడి చుట్టూ ప్రదక్షిణం చేయగల కృత్రిమ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ ద్వారా ఎలా సాధించగలమో వివరించారు. నాలుగేళ్ల తర్వాత ఆ దార్శనిక ప్రసంగమే చంద్రాయన్–1 ప్రాజెక్ట్ రిపోర్టుగా రూపుదాల్చింది. 2003 ఆగస్టు 15న అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో దీని గురించి తొలుత ప్రస్తావించారు.



మనదేశంలో 1962లో అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. ఈ ఇస్రోకు విక్రమ్ సారాభాయ్, ఎంజీకే మీనన్, సతీష్ ధావన్, యుఆర్ రావు తర్వాత 1994లో కస్తూరి రంగన్ ఛైర్మన్‌గా పగ్గాలు చేపట్టారు. భూగ్రహాన్ని పరిశీలించేందుకు, సమాచారం సేకరణ, బట్వాడా కోసం వినియోగించిన ఉపగ్రహాలు, వాటిని ప్రయోగించే రాకెట్లు, అంతరిక్ష విజ్ఞానం నుంచి ఆదాయం వంటివన్నీ ఆయన హయాంలో సుసాధ్యమైనవే. ఎడ్యుశాట్, ఇన్‌శాట్, జీ శాట్, రిసోర్స్ శాట్, ఆస్ట్రో శాట్, ఒకే రాకెట్ ద్వారా ఒకేసారి పలు ఉపగ్రహాలను ప్రయోగించడం వంటివి ఆయన సాధించిన విజయాల మైలురాళ్లు. 1999లోనే ఇన్సాట్–2ఇ లోని 10 ట్రాన్స్‌పాండర్లను లీజుకి ఇవ్వడం ద్వారా మనం ప్రాంతీయ భాషల్లో సైతం కేబుల్ టీవీని చూడగలిగాం. అంతేకాదు, సుమారు 47 దేశాలకు భారతీయ టీవీ ఛానెళ్ల కార్యక్రమాలు చేరగలిగాయి. 'షార్' సెంటర్లో ఉపగ్రహాలను ప్రయోగించేందుకు మరో లాంచింగ్ పాడ్ ఏర్పాటు ప్రయత్నాలు, చంద్రయాన్ ప్రాజెక్టు పురుడు పోసుకోవడం ఆయన చలువే. అందుకే ఈ విజయ గాథను 'కస్తూరి రంగన్ మ్యాజిక్' అని ఆయన మిత్రులు, సిబ్బంది కొనియాడుతూ ఉంటారు.

కస్తూరి రంగన్ వ్యక్తిగత జీవితాన్ని పరిశీలిస్తే.. కొచ్చిన్ సంస్థాన ప్రాంతంలోని ఎర్నాకులంలో 1940 అక్టోబర్ 24న సీ.ఎం. కృష్ణస్వామి అయ్యర్, విశాలాక్షి దంపతులకు కస్తూరి రంగన్ జన్మించారు. కృష్ణస్వామి అయ్యర్ 'టాటా'తో పాటు ఇండియన్ ఎయిర్‌లైన్స్ కార్పొరేషన్‌లో పనిచేశారు. చిన్న వయసులోనే తల్లిని కోల్పోయారు. అక్కడే శ్రీరామ వర్మ హైస్కూల్ విద్య, రామ్ నారాయణ రుయా కాలేజ్‌లో డిగ్రీ చదివారు. అటు పిమ్మట బొంబాయి యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ (ఫిజిక్స్) పూర్తి చేశారు. అనంతరం అహ్మదాబాద్‌లోని విక్రం సారాభాయ్ డైరెక్టర్‌గా ఉన్న 'ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ'లో హై ఎనర్జీ ఎక్స్ రే, గామా రే ఆస్ట్రానమి'కి సంబంధించి 1967లో పీహెచ్‌డి పూర్తి చేశారు. 1969లో కస్తూరి రంగన్‌కు లక్ష్మితో వివాహమైంది. తొలుత 1967లో రీసెర్చ్ అసోసియేట్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించి, 1971లో బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో ఫిజిసిస్ట్‌గా చేరారు. అలా 35 ఏళ్లు అక్కడే పని చేసి ఇస్రో ఛైర్మన్‌గా, స్పేస్ కమిషన్ బాధ్యులుగా, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ సెక్రటరీగా పని చేసి 2003లో పదవీ విరమణ చేశారు.

కస్తూరి రంగన్ తన జీవితాన్నంతా పరిశోధనకే అంకితం చేశారు. తొలుత ఎర్నాకులం, తర్వాత బొంబాయి, అనంతరం అహ్మదాబాద్‌లో, తర్వాత నాలుగు దశాబ్దాలకు పైగా బెంగళూరులో గడిపి అక్కడే కన్నుమూశారు. 240 పరిశోధనా పత్రాలు కల్గిన కస్తూరి రంగన్‌కు 27 యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లతోపాటు ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ గౌరవాలు కూడా లభించాయి. రంగన్ రచించిన 'స్పేస్ అండ్ బియాండ్' అనే పుస్తకం అంతరిక్ష విజ్ఞానం, విద్యా రంగం గురించి ఆయన చేసిన కృషిని వివరిస్తుంది.

• డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి పూర్వ సంచాలకులు

# పహల్గాంపై ప్రతీకారానికి నిరీక్షణ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కి బాత్' ప్రసంగం (ఏప్రిల్ 27)లో ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాద దాడి, దాని అనంతర పరిణామాల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయన ఇలా అన్నారు: 'మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గాంలో ఉగ్రదాడి ప్రతి భారతీయుని హృదయాన్ని గాయ పరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా, ఏ భాష మాట్లాడేవారైనా ఆ ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు. ఆ ఉగ్రదాడి చిత్రాలను చూస్తుంటే ప్రతి భారతీయుని రక్తం మరిగిపోతోంది'. నూట నలభై కోట్లకు పైగా భారతీయుల మనోభావాలను ప్రధానమంత్రి వ్యక్తం చేశారు. దేశ సమైక్యత, సమస్త భారత ప్రజల సంఘీభావం, దృఢసంకల్పం ఉగ్రవాదంపై పోరులో అతి పెద్ద బలం అని ఆయన అన్నారు. ఒక జాతిగా భారత్ తన సంకల్ప బలాన్ని నిరూపిస్తుందని ఆయన వాగ్దానం చేశారు. ప్రధానమంత్రి దృఢ నిశ్చయాన్ని నేను హర్షిస్తున్నాను. ఆయన ఉత్తేజకర మాటలు కేవలం మాటలుగా మిగిలిపోవని ఆశిస్తున్నాను.



■ పి. చిదంబరం

ప్రధానమంత్రి తన ప్రసంగంలో చెప్పినవన్నీ యథార్థాలు కావేమో?! పహల్గాం దాడికి ముందు కశ్మీర్‌లోని పరిస్థితుల గురించి ఆయన ఇలా చెప్పారు: 'కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠశాలలు, కళాశాలలు సరికొత్త విద్యావాతావరణంతో మళ్లీ కళకళలాడుతున్నాయి. నిర్మాణ రంగ కార్యకలాపాలు మునుపెన్నడూ లేని విధంగా వేగం పుంజుకున్నాయి. ప్రజాస్వామ్యం మరింతగా శక్తిమంతమవుతోంది. పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించడం జరుగుతోంది..' అందరూ ఆయనతో ఏకీభవించడం కష్టం. అంతెందుకు, మోదీయే తన మాటలపై ప్రగాఢంగా ఆలోచించుకుంటే తాను చెప్పినవి అతిశయోక్తులు అని తప్పక భావిస్తారు! మరింత వివరంగా చూద్దాం:

కశ్మీర్‌లో శాంతి ఒక సుదూర లక్ష్యంగా ఉన్నది. ఏప్రిల్ 24, 2025న జరిగిన అఖిలపక్ష సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ అధికారులు నివేదించిన వివరాల ప్రకారం జూన్ 2014 నుంచి మే 2024 మధ్య కాలంలో 1643 ఉగ్రవాద సంఘటనలు సంభవించాయి. 1925 చొరబాటు ప్రయత్నాలు జరిగాయి, వాటిలో 726 ప్రయత్నాలు సఫలమయ్యాయి; ఉగ్ర దాడుల్లో 576 మంది భద్రతా దళ సిబ్బంది మరణించారు. పాఠశాలలు విద్యావాతావరణంతో కళకళలాడడం లేదు. విద్యారంగ పరిస్థితులపై ప్రథమ్ అనే ఎన్జీఓ ఏటా ప్రచురించే ప్రామాణిక నివేదిక ప్రకారం కశ్మీర్‌లో 2018 అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోయింది. ఉన్నత పాఠశాల బాలల్లో ఏడవ తరగతి వాచకాలు తప్పుల్లేకుండా చదివే బాలల శాతం చాలా తక్కువగా ఉంది.

ప్రజాస్వామ్యం మరింతగా శక్తిమంతమవుతుందన్న వాదనను గట్టిగా సవాల్ చేయవలసివుంది. జమ్మూ–కశ్మీర్‌ను ఒక కేంద్రపాలిత ప్రాంతంగా కుదించివేసిన అనంతరం ప్రజాస్వామ్యం బాగా క్షీణించిపోయింది. జమ్మూ–కశ్మీర్ ఇప్పుడు ఒక అర్ధ ప్రజాస్వామిక వ్యవస్థ మాత్రమే. ఎందుకని? కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ విస్తృత అధికారాలు చెలాయిస్తుండగా ప్రజలు ఎన్నుకున్న మంత్రి మండలికి, ప్రజాప్రతినిధులకు కనీస అధికారాలనూ నిరాకరిస్తున్నారు! కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేయడం (అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామన్న హామీ హామీగానే ఉండిపోయింది) తమను అవమానించడమేనని కశ్మీరీలు భావిస్తున్నారు. ఆ అగౌరవం ఇంకా కొనసాగుతుండడం పట్ల వారు అమితంగా మనస్తాపం చెందుతున్నారు. మాటల్లో చెప్పలేనంతగా బాధపడుతున్నారు. జమ్మూ–కశ్మీర్‌లో 2023–24లో నిరుద్యోగిత అధికారిక గణాంకాల ప్రకారమే 6.1 శాతంగా ఉన్నది. తలసరి ఆదాయం కూడా జాతీయ సగటు తలసరి ఆదాయం కంటే తక్కువ. అయితే కశ్మీర్‌కు వస్తున్న పర్యాటకుల సంఖ్య బాగా పెరుగుతోందన్న వాదన వాస్తవమే. అయితే ఉగ్రవాద దాడితో పర్యాటకుల వెల్లువ నిలిచిపోయింది. సామాన్య కశ్మీరీల ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లింది.

పహల్గాంలో ఉగ్రవాద దాడి చోటుచేసుకున్న వెనువెంటనే ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజలు తమంతట తామే అంతర్ ప్రేరణతో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టినా తాము సంపూర్ణంగా మద్దతునిస్తామని కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాలు స్పష్టంగా ప్రకటించాయి. ఆ సంఘీభావం ఇప్పుడు అంత దృఢంగా లేనట్టు కనిపిస్తోందంటే అందుకు ప్రభుత్వాన్నే తప్పుపట్టవలసి ఉంది. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. పహల్గాం దాడిపై ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందేగానీ ప్రగాఢ పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. ప్రభుత్వంలో బాధ్యతాయుత స్థానాలలో ఉన్నవారెవరూ భద్రతా ఏర్పాట్లలో తీవ్ర లొసుగులు లోపాలు ఉన్న వాస్తవాన్ని అంగీకరించలేదు. సౌదీ అరేబియాలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక పర్యటనను మధ్యలోనే ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చారుగానీ వెన్వెంటనే పహల్గాంనుగానీ శ్రీనగర్‌నుగానీ సందర్శించలేదు. కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అయితే ప్రధానమంత్రి ఆ సమావేశానికి హాజరు కాకుండా ఒక ర్యాలీలో పాల్గొనేందుకు పాట్నా వెళ్లారు. పహల్గాంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల తదాది పార్టీలు, వ్యక్తులు భిన్న వైఖరులతో ప్రతిస్పందిస్తున్నారు. 'పహల్గాం విషాదాన్ని తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించు కునేందుకు భారతీయ జనతా పార్టీ తన అధికారిక, పరోక్ష సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ప్రయత్నిస్తోందని, ఐక్యత, సంఘీభావం అవసరమైన సమయంలో విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజల్లో విభజనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని' కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం దుయ్యబట్టింది. ఆ తీర్మానం ఇంకా ఇలా పేర్కొంది: 'పహల్గాంలో భద్రతా ఏర్పాట్లను చేదించి ఉగ్రవాదులు తమ ఘాతుకానికి పాల్పడడానికి గూఢచార వర్గాల వైఫల్యమే ప్రధాన కారణమని భావించక తప్పదు. ఈ వైఫల్యానికి దారితీసిన పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లలో లోపాలను సమగ్రంగా విశ్లేషించాలి'.




> ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు ప్రభుత్వాలు, ప్రభుత్వేతర వ్యక్తులు, సంస్థలపై నిర్ణయాత్మక నిరోధక ప్రభావం చూపేదిగా ఉండితీరాలి.

పహల్గాం ఘటనపై తక్షణమే ప్రతీకార చర్యలు చేపట్టాలనే డిమాండ్లు సహజంగానే వెల్లువెత్తుతున్నాయి. యుద్ధోన్మాద ప్రకటనలపై కశ్మీర్ వ్యవహారాలపై నిపుణుడు, గూఢచార సంస్థ 'రా' మాజీ అధిపతి అయిన ఎఎస్ దులాత్ ప్రతిస్పందిస్తూ 'యుద్ధం ఒక ప్రత్యామ్నాయం కాదు. యుద్ధం అసలు ఒక చివరి ప్రత్యామ్నాయం కూడా కాదు, అదొక చివరి చెడ్డ ప్రత్యామ్నాయం' అని స్పష్టం చేశారు. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపై పాకిస్థాన్‌లో మాజీ హైకమిషనర్ శరత్ సబర్వాల్ ప్రతిస్పందిస్తూ, ఇది ఇప్పుడు చేపట్టవలసిన చర్య అని తాను భావించడం లేదని, అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించేందుకు తాను సుముఖంగానే ఉన్నానని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి కూడా దాడికి పాల్పడిన 'ది రెసిస్టెన్స్ ఫోర్స్' (టిఆర్ఎఫ్)ను గానీ, లష్కరే తోయిబాను గానీ తప్పుపట్టలేదు. చైనా వైఖరి సైతం ఎంతమాత్రం నిష్పాక్షికంగా లేదు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు పాకిస్థాన్ దృఢ సంకల్పంతో చర్యలు చేపట్టడాన్ని చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి ప్రశంసించారు. తమ జాతీయ భద్రతపై పాక్ ఆందోళనలు న్యాయసమ్మతమైనవని ఆయన అన్నారు. తన భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడంలో పాకిస్థాన్‌కు చైనా మద్దతునిస్తుందని వాంగ్ యి అన్నారు.


పహల్గాం ఉగ్ర దాడి సంభవించి పదమూడు రోజులు గడిచిపోయాయి. గతంలో వలే ఇప్పుడు కూడా పాక్ భూభాగాలలోని ఉగ్రవాదుల స్థావరాలపై 'సర్జికల్ స్ట్రైక్స్' నిర్వహించడం చకితపరిచే ఘటనలు కాబోవని మెరుపు దాడులకు పాల్పడే విమానాలను పాక్ సైనిక దళాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుంటాయని సైనిక నిపుణులు గట్టిగానే చెబుతున్నారు. అటువంటి దాడుల ఫలితాలు ఆశించినవిగా ఉండకపోవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. భారత్ సైనిక పాటవ ఆధిక్యత దృష్ట్యా సర్జికల్ స్ట్రైక్స్‌కు ఇతర ప్రత్యామ్నాయాలు ఉన్నాయని విశ్వసిస్తున్నాను. పహల్గాం దాడులకు ప్రతిస్పందనగా ఎప్పుడు? ఎలా? ఎలాంటి చర్య తీసుకోవాలి? అనే విషయమై సైనిక దళాలకు ప్రధానమంత్రి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చినట్టు ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన.. కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు ప్రభుత్వాలు, ప్రభుత్వేతర వ్యక్తులు, సంస్థలపై నిర్ణయాత్మక నిరోధక ప్రభావం చూపేదిగా ఉండితీరాలి. అటువంటి చర్య కోసం భారత్ నిరీక్షిస్తోంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి)

# అమరావతి క్రాంతదర్శి చంద్రన్న

నవ్యాంధ్రకు నవశకం ఆరంభమైంది. ఆరు కోట్ల ఆంధ్రుల కలలు సాకారమైనవేళ అమరావతికి మంచి రోజులు వచ్చాయి. చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిన నాటి అమరావతే నేడు ఆంధ్రుల ఆధునిక రాజధాని నగరంగా మారబోతుంది. ఆ మలుపునకు కారణం కూడా తానే అయి నిలిచిన క్రాంతదర్శి నారా చంద్రబాబు నాయుడు.

2019–24 మధ్యకాలంలో విధ్వంస పాలకుల చేతిలో శిథిలమైన అమరావతి స్వప్నం తిరిగి పునర్జీవం దిశగా పనులకు అడుగులు పడిన వేళ ఆంధ్రప్రదేశ్ అంతటా పండుగ వాతావరణంతో నిండిపోయింది. తరతరాలకు ఆదర్శంగా అమరావతి నిలవబోతున్నది. రాజధాని లేని రాష్ట్రంగా విభజిత ఆంధ్రప్రదేశ్ అవతరించిన నాటి నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ మరెన్నో రాజకీయ కుట్రలను తట్టుకుంటూ చివరికి నేడు స్థిరమైన ఆంధ్రప్రదేశ్ రాజధానిగా పట్టాభిషేకం అందుకుంది.




రాజధాని పునర్నిర్మాణం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయింది. ఓ వేడుకలా సాగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా చూశారు. మన రాజధాని అనే భావనతో ఒక్కసారే యాభై వేల కోట్ల రూపాయల పనులను మోదీ ప్రారంభించడంతో ఈసారి ఆలస్యం కాదన్న నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

అమరావతి రాజధానికి ఎప్పుడో పునాదులు పడ్డాయి. వాటిని తవ్వేసే పాలకులు తర్వాత అధికారంలోకి రావడంతో అవి పాడుబడిపోయాయి. అయితే అంతకుముందు పడిన ఆ పునాదులు చెక్కుచెదరలేదు. అది భౌతికంగానే కాదు.. ప్రజల మనసుల్లో కూడా. అందుకే ఈసారి అమరావతి నిర్మాణం పునాదుల మీద నుంచి చకచకా జరిగిపోతుంది. టార్గెట్ ప్రకారం నిర్మాణాలు చేయించడంలో ముఖ్య మంత్రి చంద్రబాబుకు ప్రత్యేక అనుభవం ఉంది. అందుకే ఏడాది, రెండేళ్లలోనే అమరావతి నిర్మాణంలో స్పష్టమైన మార్పు కనిపించనుంది. నిర్మాణ పనులు జెట్ స్పీడ్‌గా సాగేలా చర్యలు చేపడుతున్నారు.

అమరావతికి అడుగడుగునా అడ్డంకులు ఎదురయినా అంతిమంగా మాత్రం అడుగు బలంగా పడబోతోంది. మొదటి అడుగుతోనే ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అమరావతి, అనుపానులు కళ్లముందు కనిపించడానికి మరో మూడేళ్లు పట్ట వచ్చు. కేవలం పరిపాలనా రాజధానిగా కాకుండా అమరావతి డైనమిక్‌గా ఉండబోతుంది. ప్రతి తెలుగువాడు మాకు అమరావతి గొప్ప రాజధాని ఉందని గర్వంగా తలెత్తుకునేలా ప్రపంచస్థాయిలో దీనిని నిర్మించాలని సీఎం చంద్రబాబు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రపంచంలో టాప్–5 నగరాల్లో ఒకటిగా ఈ నగరాన్ని నిర్మించాలని నిర్ణయించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో కొత్తగా నిర్మించాలని తలపెట్టిన అతి పెద్ద నగరం అమరావతి. చక్కటి జనావాసాలతో, విశాలమైన రహదారులు, అత్యుత్తమ ప్రజారవాణా, హాయిగొలిపే పచ్చదనం, ఆహ్లాదాన్నిచ్చే వినోద కేంద్రాలు, క్రీడా మైదానాలు, అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల శుద్ధి కేంద్రాలు, ఇలా అమరావతిని సర్వశ్రేష్ఠ నగరంగా ప్రపంచ పటంలో నిలపడానికి తొమ్మిది థీమ్ సిటీలను, 27 టౌన్‌షిప్‌లుగా అమరావతి నగర నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. కృష్ణా నదీ తీరాన 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 53,647 ఎకరాలలో రూపుదిద్దుకొనున్న అమరావతి రాజధానికి నవనగరాలు నవ నాగరికంగా నిలవనున్నాయి.

అమరావతికి పెద్ద ఎత్తున ప్రైవేటు కంపెనీలు క్యూ కట్టనున్నాయి. క్వాంటమ్ వ్యాలీ కోసం మూడు దిగ్గజ కంపెనీలు ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి క్వాంటమ్ వ్యాలీ రెడీ అవుతుంది. అమరావతిలో భూములు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల నిర్మాణాలతో ఆ ప్రాంతం బిజీగా మారనుంది. ఉపాధి అవకాశాలు వెల్లువెత్తనున్నాయి. ఈ కళ రాష్ట్రం మొత్తం కనిపించనుంది.

ఆంధ్రుల రాజధాని అమరావతి నగరం దేశంలోనే తొలి అత్యాధునిక, సాంకేతిక నగరం కాబోతున్నది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అలరారే అరుదైన రాజధానులు–టోక్యో, రోమ్, లండన్, బెర్లిన్, మాస్కో, వాషింగ్టన్, ఒట్టావాలకు అమరావతి దీటుగా నిలవనున్నది. కానీ, ఆ రాజధానులు వేటికీ లేని విశిష్టత ఉన్న మహోజ్వల నగరం ఇది. అమరావతి అభివృద్ధి కేవలం రాజధాని నిర్మాణం మాత్రమే కాదు. అది ఒక రాష్ట్రం ఆత్మగౌరవానికి, ప్రజల భవిష్యత్‌కు నిలకడగా నిలబడే మార్గం. గతంలో అభివృద్ధి చేసిన హైదరాబాద్ స్థాయిని మించి అమరావతిని తీర్చిదిద్దే శక్తి చంద్రబాబుకే ఉంది. హైదరాబాద్ లాంటి విస్తృతావకాశాలు గల ఒక నగరం ఆంధ్రకు లేని లోటుని తీర్చడానికి ఉద్దేశించిన అమరావతి.. చంద్రబాబు నాయుడు దార్శనికతకు ఒక సజీవరూపంగా నిలిచిపోతుంది. చంద్రబాబు చేస్తున్న ఈ మహోపకారానికి ప్రజలందరూ ఎప్పటికీ రుణపడి ఉంటారనడంలో సందేహం లేదు. ప్రపంచంలోని ప్రసిద్ధ తొలి రాజధానుల్లో అమరావతిని ఒకటిగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షలు ఫలించాలని ఆశిద్దాం.



○ వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖ మంత్రి

# పొంచి ఉన్న 'కృష్ణా' జలకాటకం!

సుప్రీంకోర్టు స్టే ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్–2 తుది తీర్పు(2013)పై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సన్నాహాలు చేస్తున్నారు. బేసిన్‌లోని రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించి తీర్పును గెజిట్ నోటిఫికేషన్ చేయదలచారు. ఇదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి పంగనామాలు మిగులుతాయి. ఈ నెల ఏడవ తేదీన బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేశారు. వాస్తవంలో కర్ణాటక ఆల్మట్టి జలాశయం నిర్మించిన తర్వాత కృష్ణకు వరద ఆలస్యంగా వస్తోంది. ఈ తీర్పు నోటిపై జరిగి, ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెరిగితే, ఇంతే సంగతులు. పైగా వర్షాభావ నీటి సంవత్సరాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఈ తీర్పు ద్వారా ఎగువ రాష్ట్రాలు పొందిన లబ్ధికి వ్యతిరేకంగా కొంత చురుకుగా వ్యవహరించారు. కాని రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కేసీఆర్ ఎగువ రాష్ట్రాలు పొందిన లబ్ధి గురించి పట్టించుకోవడం మానేశారు.

కేసీఆర్ భావోద్వేగాలు పెంచి పోషించే వ్యూహం రచించి, కృష్ణ నదీ జలాల వాటాల గురించి అవశేష ఆంధ్రప్రదేశ్‌తో వాదులాటకు దిగారు. తుదకు 2020లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బుట్టలో వేసుకొని తిరిగి ఉభయ రాష్ట్రాల మధ్య కృష్ణ నదీ జలాల పంపిణీకి ట్రిబ్యునల్ నియామకం గురించి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందారు. ఈ ప్రతిపాదన కేంద్ర న్యాయశాఖ వద్ద మూడేళ్ల కాలం దస్త్రాలకే పరిమితమవగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2023 తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏకంగా ట్రిబ్యునల్ నియామకానికి ఆమోదం తెలిపి, ఆంధ్రప్రదేశ్ గొంతు కోసింది.

గమనార్హమైన అంశమేమంటే ఇదే ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు 2015 నుంచి విచారణ జరుపుతుండగా, 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం సెక్షన్ 3 కింద అదనపు అంశాలు జోడించి, విధి విధానాలతో విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు రెండు రాష్ట్రాలు కోరిన 31 అంశాలు పక్కన బెట్టి, తాజాగా కేంద్రం జారీ చేసిన ఆదేశాల మేరకు విచారణ సాగిస్తోంది. ఇదంతా ఎందుకంటే, తాజాగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గైకొంటున్న చర్యలు ఫలిస్తే, రెండు తెలుగు రాష్ట్రాలకూ ప్రమాదం పొంచి ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక లబ్ధి పొందుతాయి. పైగా అదనంగా 258 టియంసీల నికర జలాలు ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల జల వనరులు శాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయడంలోని ఆంతర్యమేమిటి? ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెంచుతామని రైతుల సమావేశంలో ప్రకటించారు. దానికి, కేంద్ర మంత్రి చొరవకు ఏమైనా సంబంధముందా?

బచావత్ ట్రిబ్యునల్ తీర్పు కాల పరిమితి ముగిసిన తరువాత 2004లో నియామకమైన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తుది తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర శరాఘాతంగా ఉండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకెక్కింది. సుప్రీంకోర్టు ఈ తీర్పుపై స్టే విధించడంతో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు యథాతథస్థితి కొనసాగుతోంది. అయితే రాష్ట్ర విభజన తర్వాత 2015లో తెలంగాణ కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. గత రెండు మూడేళ్లుగా మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో స్టే వెకేట్ చేయించేందుకు శతవిధాల విఫల యత్నాలు చేశాయి. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కనీసం షరతులతో ఆల్మట్టి ఎత్తు పెంచుకొనేందుకు అనుమతి ఇవ్వమని సుప్రీంకోర్టును కోరింది. కాని జరగలేదు. ఇప్పుడు తాజాగా కేంద్ర జల శక్తి శాఖ మంత్రి ఏకాభిప్రాయం సాధనకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయనకు ఇప్పుడు ఎందుకు ఈ ఆలోచన వచ్చిందో, దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు.

> కేంద్ర జలశక్తి మంత్రి ఏర్పాటు చేసే సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ కూడా ఏకాభిప్రాయ ప్రకటనను గట్టిగా వ్యతిరేకించవలసి ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఇతర జల వివాదాలు ఈ సమిష్టి పోరాటానికి అడ్డు రాకూడదు. ఏకాభిప్రాయ సాధన పేరుతో కేంద్రం ఇతర తాయిలాలతో మభ్యపరిస్తే మాత్రం ఉభయ తెలుగు రాష్ట్రాల కొంపలు కొల్లేరవుతాయి.




దేశంలో ఏ నదీ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా నదికి ఆఖరుగా ఉండే రాష్ట్రం నీటి ఎద్దడి రోజుల్లో వాడుకొనేందుకు మిగులు జలాలు కేటాయించే సంప్రదాయముంది. వర్షాభావ రోజుల్లో ఆ నీరే గతి. కాని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కృష్ణ నదిలో చుక్క మిగులు నీళ్ల లేకుండా మొత్తం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపకం చేసింది. మిగులు జలాలు ఉండివుంటే నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ స్థాయిలో నీటి వివాదాలు ఉండేవి కావు. పైగా క్యారీ ఓవర్ అనే హెడ్ కాకుండా మిగిలిన రెండు రాష్ట్రాలకు కేటాయించిన నీటిని నేరుగా వాడుకొనే అవకాశం కల్పించింది. కనీసం ఇతర రాష్ట్రాలతో సమానంగా ఇంచుమించు కేటాయింపులు లేకుండా కేవలం 38 టీయంసీలు మాత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది.

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఏర్పాటు చేసే సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ కూడా ఏకాభిప్రాయ ప్రకటనను గట్టిగా వ్యతిరేకించవలసి ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఇతర జల వివాదాలు ఈ సమిష్టి పోరాటానికి అడ్డు రాకూడదు. ఏకాభిప్రాయ సాధన పేరుతో కేంద్రం ఇతర తాయిలాలతో మభ్యపరిస్తే మాత్రం రెండు రాష్ట్రాల కొంపలు కొల్లేరవుతాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిపై చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయాలి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఉంది. అలాంటి వివాదాన్ని కోర్టు బయట పరిష్కారానికి పూనుకుంటున్న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి, కేసులున్నా, సుప్రీంకోర్టు స్టే లేని వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు ఎందుకు నోటిపై చేయలేదో అర్థం కాదు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు నోటిపై కోసం మహారాష్ట్ర, కర్ణాటక ముఖ్యమంత్రుల స్థాయిలో చర్యలు ఉంటున్నాయి, ఫాలో అప్ చేస్తున్నారు. ఏపీ కూడా లాబీయింగ్ మొదలు పెట్టి ఉంటే వంశధార ట్రిబ్యునల్ ఇంకా పెండింగ్‌లో ఉండేది కాదు. ఇప్పటికైనా ఏపీ ఇంజనీరింగ్ అధికారులు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్–2 తీర్పు నోటిపైకి వ్యతిరేకంగా పోరాడుతూ, అదే సమయంలో సుప్రీంకోర్టు స్టే లేని వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిపై చేయించుకోవాలి. ఇదే జరిగితే అతి తక్కువ నిధులతో వంశధార, నాగావళి నదులు అనుసంధానికి మార్గం సుగమం అవుతుంది.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



» మూడు రోజుల పాటు క్లోజ్
» ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు, ఉచిత రవాణా



# మిర్చికి ధర పోటు!

## నాడు పంట కాపాడుకునేందుకు భారీగా పెట్టుబడులు

- నేడు కోత కూలీ కూడా రాకపోవడంతో దున్నేస్తున్నరైతులు
- రూ.11,750 ధర అమలు చేయాలని డిమాండ్

ధరలు క్షీణిస్తుండటంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత కూలీ కూడా రాని స్థితిలో పంటను కాయలతోనే దున్నేస్తున్నారు. స్పైసెస్ బోర్డు పట్టించుకోకపోవడం, కేంద్ర మద్దతు ధర ప్రకటనలకే పరిమితం కావడంతో రైతులు మరింత కుదేలయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర మద్దతు ధర అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.



6లో

# నేటి నుంచి ఘాట్‌రోడ్డు మూసివేత

## ఇంద్రకీలాద్రికి మెస్ మరమ్మతుల నేపథ్యంలోనే..

**ఇంద్రకీలాద్రి, మే 5 (ఆంధ్రజ్యోతి) :** ఇంద్రకీలాద్రిపై కొండప్రాంతానికి మెస్ మరమ్మతుల పనుల కారణంగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఘాట్‌రోడ్డుపై రాకపోకలను నిషేధిస్తున్నట్లు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రూట్‌లో వచ్చే భక్తులు పున్నమిఘాట్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటుచేసిన బస్సుల్లో కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. చెన్నై, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వీఎంసీ కార్యాలయం సమీపంలోని సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థానం బస్సుల్లో ఆలయానికి చేరుకోవాలని పేర్కొన్నారు. కనకదుర్గానగర్ వైపు ఉన్న మార్గం ద్వారానే కొండపైకి చేరుకునే వీలుంటుందని తెలిపారు. ఈ మూడు రోజులు పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులకు ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఈవో స్పష్టం చేశారు.

# స్పాట్ మార్చారు

## స్పా సెంటర్ల నుంచి లాడ్జీలవైపు మళ్లిన వ్యభిచారం

- ఉత్తరాది అమ్మాయిలను తీసుకొచ్చి గదుల్లో వ్యాపారం
- పోలీసుల తనిఖీల నేపథ్యంలో స్పా నిర్వాహకుల ప్లాన్
- ఓ యాప్ ద్వారా అన్ని వ్యవహారాలు ఫోన్‌లోనే..

స్పా ముసుగు మార్చుకుంటోంది. ఇప్పటివరకు భవనాల్లో సాగిన మసాజ్ ఇప్పుడు లాడ్జీలవైపు మారింది. పోలీసుల తనిఖీలు ముమ్మరం కావడంతో స్పా సెంటర్ నిర్వాహకులు ఉత్తరాది అమ్మాయిలను లాడ్జీల్లోని ఓ గదిలో ఉంచి జస్ట్ డయల్ యాప్‌లో ఫోన్ నెంబర్ పెడుతున్నారు. ఆకర్షితులై వస్తున్న విటులను మరో గదిలో యథేచ్ఛగా వ్యభిచారం నడిపిస్తున్న వ్యవహారం గత శనివారం బట్టబయలు కాగా, ఇలాంటి మరిన్ని వ్యవహారాలు లాడ్జీల్లో జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



శనివారం నగరంలోని ఓ లాడ్జీలో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఉత్తరాది అమ్మాయిలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** నగరంలోని స్పా కేంద్రాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల ఉత్తరాది యువతులతో చలసాని ప్రసన్న భార్గవ్ అనే వ్యక్తి అత్యాధునిక సాంకేతిక పరికరాలను అమర్చుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యవహారాన్ని మాచవరం పోలీసులు బట్టబయలు చేశారు. దీంతో చాటుమాటుగా స్పా కేంద్రాలను నిర్వహిస్తున్న వారంతా రూటు మార్చారు. ఎలా అంటే..

### తొలుత ఉత్తరాది యువతులకు వల

తొలుత స్పా కేంద్రాల నిర్వాహకులు ఉత్తరాది ట్రెండ్‌ను కొనసాగిస్తున్నారు. కోల్‌కతా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ముంబయి ప్రాంతాల్లో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతులకు వివిధ స్పా కేంద్రాల్లో పనిచేసే యువతులతో ట్రాప్ వేయిస్తున్నారు. నెలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం చూపిస్తామని చెప్పి ఇక్కడికి తీసుకొస్తున్నారు. తర్వాత వారిని సెక్స్ సర్వీసులకు ఉపయోగిస్తున్నారు.

### లాడ్జీల్లో రాసలీలలు

సాధారణంగా సినిమాలు, టీవీ షోల్లో అవకాశాల కోసం ఎదురుచూసే అమ్మాయిలకు ఆడిషన్స్ నిర్వహిస్తారు. ఉత్తరాది నుంచి తీసుకొచ్చే యువతులను ఎంపిక చేసుకోవడానికి నిర్వాహకులు ఇలాంటి ఆడిషన్సే నిర్వహిస్తున్నారు. చూడగానే విటులు మంత్రముగ్ధులయ్యే అందమైన అమ్మాయిలను ఎంచుకుని వారితో కాంట్రాక్ట్ కుదుర్చుకుంటున్నారు. వారికోసం నగరంలోని లాడ్జీల్లోప్రత్యేక గదులు బుక్ చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని సిటీల నుంచి ఐదారుగురిని ఎంపిక చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు. లాడ్జీల్లో రెండు గదులను పక్కపక్కనే ఉండేలా బుక్ చేస్తున్నారు. ఒక గదిలో యువతులను ఉంచుతున్నారు. మరో గదిని రాసలీలలు మిగతా 6లో..

ఓ ఆటోడ్రైవర్, మరో కారుడ్రైవర్ చేసిన తప్పిదానికి అమాయకులైన ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. తొందరగా వెళ్లాలన్న కంగారులో జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్లి ఆటోడ్రైవర్ ఆ పేదల ఉసురు తీయగా, వేగంగా వచ్చి ఢీకొని, కనీసం క్షతగాత్రులను ఆసుపత్రికి కూడా తీసుకెళ్లకుండా కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. రెండు కుటుంబాల్లో విషాదం నింపడంతో పాటు ఏడుగురు గాయపడేలా చేశారు.



మరియమ్మ (ఫైల్)

# కూలిన బతుకులు



దుర్గ (ఫైల్)

## మూలపాడు వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం

- ఇద్దరు మహిళా కూలీలు మృతి, ఏడుగురికి గాయాలు
- రాంగ్‌రూట్‌లో వెళ్తున్న ఆటోను ఢీకొన్న కారు
- ప్రమాదం అనంతరం ఆగకుండా వెళ్లిపోయిన కారు

**ఇబ్రహీంపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) :** ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామం వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం రాంగ్‌రూట్‌లో కేతనకొండవైపు వెళ్తున్న ఆటోను హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న కారు వేగంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన తొమ్మిది మంది కూలీల్లో వేల్పుల మరియమ్మ (45), బూక్యా దుర్గ (40) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఏడుగురు మహిళలు గాయపడ్డారు. రోజువారీ కూలి పనుల్లో భాగంగా సోమవారం ఉదయం కూడా అందరూ ఒకే ఆటోలో మొక్కజొన్నలు ఒలిచే పనికి బయల్దేరారు. మరికొద్దిసేపట్లో పొలంలోకి వెళ్లి ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యేవారు. ఇంతలో ఈ ప్రమాదం జరిగింది. ఢీకొన్న కారు



ప్రమాదంలో నుజ్జయిన ఆటో

మాత్రం కనిపించలేదు. క్షతగాత్రుల్లో ముడావతు గౌరీ తలకు తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కన్నెగంటి స్వప్న, వి.మరియమ్మకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో విజయవాడలోని మిగతా 6లో..

# విచారణకు రాజకీయ రంగు

## అవనిగడ్డలోని జలవనరుల శాఖ ఏఈపై విచారణలో జాప్యం

**ఉన్నతాధికారులతో మాట్లాడి నిలుపుదల చేసిన ఓ ఎమ్మెల్యే**

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** కృష్ణాజిల్లాలోని జలవనరుల శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)పై విచారణ ముందుకు కదలకపోవడానికి రాజకీయ ప్రమేయమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఫిబ్రవరిలో విచారణకు ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడకపోవడానికి ఓ ఎమ్మెల్యే సహకరిస్తున్నారని సమాచారం. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'విచారణ ఎప్పటికో' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అన్ని అక్రమాలకు పాల్పడిన ఏఈపై ఫిబ్రవరిలో విచారణకు ఆదేశించినా ఇప్పటి వరకు ఎందుకు విచారణ జరగలేదన్న దానిపై ఆ శాఖలో చర్చ మొదలైంది.

### అడ్డుకుంటున్నది ఎవరు..?

ఏఈపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిన అధికారులే ఒక అడుగు వెనక్కి వేసినట్టు జలవనరుల శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆ అధికారులపై కృష్ణాజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ఒత్తిడేనని సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేల మాటల్నే ఆదేశాలుగా భావించి, నిబంధనలను ఉల్లంఘించి పనిచేసిన అధికారులను కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. ఆరోపణలు రుజువైన వారిపై వేటు వేసింది. వైసీపీ పాలనలో తానే జలవనరుల శాఖలో జిల్లా అధికారిగా వ్యవహరించిన ఈ ఏఈ మాత్రం పరిస్థితులకు అనుగుణంగా చక్రం తిప్పారు. ఆయన ఎక్కడ పనిచేసినా అధికార, ప్రతిపక్ష నేతలను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతారన్న ప్రచారం జరుగుతోంది. సర్వీసులో ఎక్కువ కాలం అవనిగడ్డ నియోజకవర్గంలో పనిచేయడంతో అక్కడ అన్ని పార్టీల నేతలతో సత్సంబంధాలు కొనసాగించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలవనరుల శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. అయినా ఈ అసిస్టెంట్ ఇంజనీర్ మాత్రం తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. పైగా ఓ సబ్ డివిజన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను దక్కించుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియ వెనుక ఓ ఎమ్మెల్యే చక్రం తిప్పారని ఆరోపణలు ఉన్నాయి. ఆయనే ఇప్పుడు శాఖాపరమైన విచారణను నిలుపుదల చేయించినట్టు తెలిసింది.

# శ్రీవారి స్థలం కబ్జా

## యనమలకుదురు కట్ట దిగువన భూ ఆక్రమణ

- ఇప్పటికే అక్రమంగా రేకుల షెడ్ల నిర్మాణం
- తాజాగా ఓ ప్రైవేట్ వ్యక్తి ఆధ్వర్యంలో 100 గజాలు
- నానాటికీ కుచించుకుపోతున్న దేవస్థాన స్థలం
- చోద్యం చూస్తున్న వన్‌టౌన్ వేంకటేశ్వరస్వామి ఆలయ అధికారులు

### నిర్మాణ పనులు అడ్డుకున్నాం

యనమలకుదురు కట్ట దిగువన దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణ పనులు చేపడుతున్నాడని సమాచారం తెలుసుకున్నాం. అక్కడకు వెళ్లి పనులు అడ్డుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా భూమిని ఆక్రమించుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- సన్యాసిరావు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో

**వన్‌టౌన్/పెనమలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) :** శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన లక్షల రూపాయల విలువచేసే ఖాళీస్థలాన్ని ఓ వ్యక్తి దర్జాగా కబ్జా చేశాడు. అంతేకాదు.. ఏకంగా పక్కా భవనాన్ని కూడా నిర్మించేస్తున్నాడు. ఖాళీగా ఉన్న ఈ స్థలానికి గతంలో వేలంపాట నిర్వహించగా, ఉచితంగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఆ వేలాన్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆ ఖాళీస్థలం నిరుపయోగంగా మారింది. వివరాల్లోకి వెళితే..

### ప్రైవేట్ వ్యక్తి ఆధ్వర్యంలో పక్కా నిర్మాణం

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి పోరంకిలో ఎకరం పొలం, గూడవల్లిలో



ఆక్రమిత స్థలంలో భవన నిర్మాణం, ఆ పక్కనే 'ఇది దేవదాయ శాఖ భూమి' అని తెలియజేస్తూ ఏర్పాటుచేసిన భూమి

ఎకరం పొలం, వేల్పూరులో 9 ఎకరాలు, వేమండలో 9 ఎకరాలకు పైగా భూములున్నాయి. గవర్నర్‌పేటలో సుమారు పది షాపుల భవన సముదాయం ఉంది. యనమలకుదురు కట్ట దిగువన సుమారు ఏ.2.14 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. అందులో సుమారు 85 సెంట్లను గతంలో కొందరు కబ్జాచేసి, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. దేవదాయ శాఖ అధికారులు రేకుల షెడ్లను తొలగించటానికి ప్రయత్నించగా, రాజకీయ నాయకులు అడ్డుకుని ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. ఇంకా ఏ.1.29 సెంట్లు ఖాళీగా ఉంది. ఈ స్థలంలో 2014 నుంచి 2019 వరకు మిగతా 6లో..

# పైసామే పర్సంటేజీ

## కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో కమీషన్ల కక్కుర్తి

కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విభాగంలోని కొందరు అధికారులు పర్సంటేజీలకు అలవాటు పడి కీలకమైన పనుల నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు. రోడ్లు, డ్రెయిన్లు, కాల్వలు ఇలా ప్రతి పనులూ నాసిరకంగా మారుతుండగా, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల కోసం పదేపదే అవే పనులు చేయించడం రివాజుగా మారింది. ఈ చర్యలతో కార్పొరేషన్‌పై ఆర్థిక దుబారా పడుతోంది.

- ఎక్కడికక్కడ చేయి తడిపితేనే కాంట్రాక్టర్లకు బిల్లులు అందేది
- గుమస్తా నుంచి పైస్థాయి అధికారి వరకు అందరికీ మామూళ్లే
- కీలకమైన పనులు తూతూమంత్రంగా చేస్తున్న కాంట్రాక్టర్లు
- నామమాత్రంగా తనిఖీలు చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు




**కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) :** కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. బడ్జెట్‌ను బట్టి పర్సంటేజీలు లెక్కకట్టి వసూలు చేస్తున్నారు. గుమస్తా మిగతా 6లో..

# వంశీ ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

**అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి) :** భూ ఆక్రమణ వ్యవహారంలో గన్నవరం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో ఈ నెల 9న నిర్ణయం వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు ప్రకటించారు. అప్పటి వరకు పిటిషనర్ విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేశారు. తన భూమిని ఆక్రమించడమే కాకుండా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని మరొకరికి విక్రయించారంటూ విజయవాడకు చెందిన సుంకర సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వంశీపై ఫిబ్రవరి 24న గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ హైకోర్టును ఆశ్రయించారు.

# మిర్చికి ధర పోటు!

- నాడు పంట కాపాడుకునేందుకు భారీగా పెట్టుబడులు
- నేడు కోత కూలీ కూడా రాకపోవడంతో పంట దున్నేస్తున్న రైతులు
- రూ.11750 ధర అమలు చేయాలని డిమాండ్



ధరలు క్షీణిస్తుండటంతో మిర్చి రైతులు డీలా పడుతున్నారు. అండగా ఉండాల్సిన స్పైసెస్ బోర్డు ముఖం చాటేసింది. కేంద్ర మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది. ఫలితంగా మిర్చి రైతులు కోలుకోలేని స్థితికి చేరుకున్నారు. కోత కూలీ కూడా రాని స్థితిలో పంటను కూడా మట్టిలో కలుపుతున్నారు. కాయలతోనే పంటను దున్నేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర మద్దతు ధర అమలుచేసేలా నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను సంప్రదించి ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

(నందిగామ, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది మిర్చి సాగు ఆసాంతం అటుపోట్ల నడుమ సాగింది. సాగు ప్రారంభంలోనే భారీ వర్షాలు, వరదలకు మొక్క దశలో ఉన్న పంట దెబ్బతింది. అనంతరం కొత్త రకాల చీడపీడలను అదుపులో పెట్టేందుకు భారీగా క్రిమి సంహారకాలు వినియోగించాల్సి వచ్చింది. ఎలాగైనా పంటను కాపాడుకొనే క్రమంలో భారీగా ఎరువులు కూడా అందించాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. కౌలు ధరతో కలిపి సాగు వ్యయం ఎకరానికి సరాసరి లక్షన్నర వరకూ ఖర్చ యింది. దిగుబడులు 18 నుంచి ఇరవై క్వింటాళ్లకు పడిపోయింది. ఈ ప్రకారం క్వింటా దిగుబడికి ఏడు నుంచి తొమ్మిది వేల రూపాయల వరకూ ఖర్చయింది. ఇది కేవలం పంట పండించే ఖర్చు మాత్రమే. ఇక కోత కూలి, టిక్కీల కొనుగోలు, టిక్కీలకు కాయలు తొక్కే ధర, వాటిని ఇంటికి చేర్చే రవాణా ఖర్చులు అన్నీ కలిపి క్వింటాకు ఐదు నుంచి ఆరువేల రూపాయల ఖర్చయింది. ఈ మొత్తం కలిపితే పంట ఇంటికి చేరే సరికి 13 నుంచి 15 వేల రూపాయల వరకూ ఖర్చయింది.

### గత పాలకుల అనాలోచిత విధానాలు

గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా మిర్చికి ఏడు వేల రూపాయల మద్దతు ధర ప్రకటించారు. నిన్నమొన్నటి వరకూ అదే మద్దతు ధర కొనసాగింది. మిర్చి సాగులో అటుపోట్లు గమనించిన కూటమి ప్రభుత్వం ముందుగానే మేల్కొని మద్దతు ధర పెంపునకు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పెద్దలతో మాట్లాడి క్వింటాకు రూ.11750 మద్దతు ధరను ప్రకటింపజేశారు. వాస్తవానికి ఈ ఏడాది నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఆ ధర కూడా ఏమాత్రం సరిపోదు. ప్రకటించిన మద్దతు ధర అందించడంలో విఫలం కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నష్టాల పాలైన మిర్చి రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కన్నెర్రజేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.11750 ధర అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖం చాటేస్తున్న స్పైసెస్ బోర్డును రంగంలోకి దింపి నాఫెడ్, మార్క్‌ఫెడ్‌ల ద్వారా మిర్చి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. లేదా ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసిన ధరకు, మద్దతు ధరకు ఉన్న వ్యత్యాసాన్ని తమకు జమచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యత, రకాలను బట్టి మిర్చి ధరలు ఏడు నుంచి తొమ్మిది వేల రూపాయల ధర లభిస్తుంది. మిర్చి రైతుకు మేలు జరగాలంటే క్వింటాకు 15 నుండి 16 వేల రూపాయల ధర ఉండాల్సి ఉంది. కనీసం కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ఉన్నా కొంత మేర ఊరట లభిస్తుందని రైతులు అంటున్నారు.

### మిర్చి చరిత్రలోనే దయనీయమైన పరిస్థితులు

మిర్చి సాగులో గతంలో లేని పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. చివరి కోతలు కోయాల్సిన స్థితిలో కేంద్రం ఉపాధి పనులు ప్రారంభించింది. దీంతో కూలీల కొరత ఏర్పడింది. సాధారణంగా మిర్చి కోతలు ఉదయాన్నే చేపట్టాల్సి ఉంది. ఆ సమయంలో ఉపాధి పనులు ప్రారంభమౌతున్నాయి. అక్కడైతే కొద్ది సమయం పనిచేస్తే మూడు వందల రూపాయల కూలీ లభిస్తుంది. మిర్చి కోతలకు కూలీలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు పంటను దున్నివేస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి మిర్చి రైతును ఆదుకోవాలంటే ఉపాధి కూలీలతో మిర్చి కోతలు కోయించాల్సి ఉంది.

### ధర పతనానికి కారణాలు

మిర్చి ధరలు పడిపోవడంపై మార్కెట్ నిపుణల అంచనా ప్రకారం గత ఏడాదికి సంబంధించి నిల్వలు అధికంగా ఉన్నాయి. 2023-2024 సంవత్సరాలలో క్వింటాకు గరిష్టంగా 21 నుండి 23 వేల రూపాయల ధర లభించింది. ఒక్కసారిగా ధర పెరగడంతో మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని భావించిన రైతులు సరుకు నిల్వ ఉంచారు. వర్షాలు, వరదల వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాలో పంట దిగుబడి తగ్గిందని, మిగిలిన ప్రాంతాలలో మంచి దిగుబడులు వచ్చినట్టు వారు తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఈఏడాది సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులు కూడా గణనీయంగా ఉన్నాయి. దీని వల్లనే డిమాండ్ తగ్గి మిర్చి ధరలు క్షీణించాయని నిపుణులు చెపుతున్నారు. ఏది ఏమైనా ఈ పరిస్థితుల నుంచి మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉంది.

## వేణుగోపాలుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



కేశవచార్యులు దంపతులు

గంపలగూడెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : నెమలి వేణుగోపాల స్వామిని హైకోర్టు న్యాయమూర్తి కేశవచార్యులు సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య, ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలచార్యులు వారికి స్వామి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. వైశాఖమాసం సోమవారం సందర్భంగా స్వామికి చందన అలంకరణ చేశారు.

## ఆప్కాబ్, డీసీసీబీ, పీఏసీల అవకతవకల విచారణ కమిటీలో యార్లగడ్డ

విజయవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆప్కాబ్, డీసీసీబీ, పీఏసీలలో జరిగిన అవకతవకలపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ ఏర్పాటు చేసిన హౌస్ కమిటీలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును సభ్యునిగా నియమించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధ్యక్షతన నియమించిన హౌస్ కమిటీలో కూన రవికుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, బూర్ల రామాంజనేయులు, ఎస్.అమర్‌నాథ్ రెడ్డిలతో పాటు యార్లగడ్డ వెంకట్రావు సభ్యుడిగా ఉంటారు.



రాశి అమేజ్ విత్తనాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు.

## 'రాశి అమేజ్' పత్తి విత్తనాల ఆవిష్కరణ

లబ్బీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పత్తి విస్తీర్ణం ఉన్నా.. దిగుబడుల పరంగా మరింత మెరుగవ్వాలని రాశి సీడ్స్ వైస్ ప్రసిడెంట్ సురేష్ బాబు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం రాశి సీడ్స్ పత్తి నూతన రకం రాశి అమేజ్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు విదేశాల నుంచి పత్తి దిగుబడులు చేసుకునే స్థాయి నుంచి ఎగుమతులు చేసే స్థాయికి త్వరలోనే చేరుకుంటామని అన్నారు. భారతదేశంలో పత్తి పంట ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి పరిష్కార దిశగా రాశి సీడ్స్ చేస్తున్న పరిశోధనలు, భారత ప్రభుత్వం ప్రకటించిన కాటన్ మిషన్ తదితర అంశాలను వివరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, రాయలసీమ ప్రాంతాల్లో రాశి స్విఫ్ట్ రకాన్ని ఎక్కువగా రైతులు సాగు చెస్తున్నారని, ఇప్పుడు ప్రత్యేకించి మన ప్రాంతంలో ఉన్న రేగడి నేలలకు అనుకూలమైన రాశి అమేజ్ రకాన్ని ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సేల్స్ మేనేజర్ వాసుకి వెంకటాద్రి, డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, రీజనల్ బిజినెస్ మేనేజర్ డి.సాయిచంద్, క్రాప్ మేనేజర్ యం.వేంకటేశ్వరరావు, రెండు రాష్ట్రాల పంపిణీదారులు, విత్తన విక్రేతలు పాల్గొన్నారు.

## 'పది' తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులను ఉత్తీర్ణుల జాబితాలోకి ఎక్కించడానికి విద్యాశాఖ నడుం బిగించింది. కొద్దిరోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ఉత్తర్వులు చేసింది. దీనిప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోయిన వారందరికి ఆయా అంశాల్లో బోధన చేయడానికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8.45 గంటలకు ప్రత్యేక తరగతులు ప్రారంభమై మధ్యాహ్నం 11.45 గంటలకు ముగుస్తాయి. 18వ తేదీ వరకు ఈ తరగతులను నిర్వహిస్తారు. రెగ్యులర్ పరీక్షల్లో తప్పిన ప్రతివిద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికలను రూపొందించి ఉపాధ్యాయులు బోధిస్తున్నారని డీఈవో సుబ్బారావు తెలిపారు.

## ఐఏఎస్ దినేశ్‌కుమార్‌కు బెయిలబుల్ వారెంట్

- కోర్టుధిక్కరణ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అప్పటి కమిషనర్, ఐఏఎస్ అధికారి కె. దినేశ్‌కుమార్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈయనతోపాటు అప్పటి టౌన్‌ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ టీఎస్ అనితలకు కూడా ఇదే వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 18కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఈ నెల 1న ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్ఎస్ నెంబరు 135, 136లో ఉన్న 1,086 చదరపు గజాల స్థలానికి ఎలాంటి పరిహారం చెల్లించకుండానే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని సవాల్ చేస్తూ కుందుల బలరామకృష్ణ, ఆయన భార్య గంగా భవాని, కుమారులు మురళీకృష్ణ, సురేశ్‌కుమార్, కనువిల్లి పూర్ణ గంగా భవాని 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు రోడ్డు విస్తరణ నిమిత్తం పిటిషనర్ల నుంచి సేకరించిన భూమికి 8 వారాల్లో టీడీఆర్ బాండ్లు జారీ చేయాలని 2023, మార్చి 1న కార్పొరేషన్ అధికారులను ఆదేశించింది. ఈ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో పిటిషనర్లలో ఒకరైన కనుమిల్లి పూర్ణ గంగా భవాని 2024లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో అప్పటి కమిషనర్ కె. దినేశ్‌కుమార్, టౌన్‌ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ టీఎస్ అనితలను ప్రతివాదులుగా చేర్చారు. విచారణ జరిపిన న్యాయమూర్తి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఫామ్-1 నోటీసు జారీ చేశారు. ఈ నెల 1న పిటిషన్ విచారణకు వచ్చినా అధికారులు కౌంటర్లు వేయలేదు. వారి తరఫున న్యాయవాదులు కూడా విచారణకు హాజరుకాలేదు. దీంతో అసహనం వ్యక్తం చేసిన న్యాయమూర్తి అధికారులపై బెయిలబుల్‌వారెంట్ జారీ చేశారు.

## పారిశ్రామికవేత్తలకు తోడ్పాటు అందించండి

- యువత, మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- ఎంఎస్ఎంఈ థీమ్ స్టాల్‌ను ప్రారంభించిన కలెక్టర్



ఎంఎస్ఎంఈ థీమ్ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-2047 దార్శనికతకు అనుగుణంగా, ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలనే ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేలా ముఖ్యంగా యువత, మహిళలకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) సందర్భంగా జిల్లా పరిశ్రమల అధికారులు ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ థీమ్ స్టాల్‌ను కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. పారిశ్రామికరంగానికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఔత్సాహికులకు పారిశ్రామిక విధానాలు, అనుమతుల మంజూరు ప్రక్రియ, మౌలిక సదుపాయాలు తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన సేంద్రీయ ఎరువుల స్టాల్‌ను కూడా కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారయ్య, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలపై అప్రమత్తం

- కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం : లక్ష్మీశ

కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వున్నామని, జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్రంలో వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలో విపత్తుల నిర్వహణ, వ్యవసాయం తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. పలు జిల్లాలకు వర్షసూచన వున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం, జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, ముందస్తు హెచ్చరికలకు అనుగుణంగా జిల్లాల్లో తీసుకోవాల్సిన చర్యలు, విపత్తు నిర్వహణలో సాంకేతికత వినియోగం తదితరాలపై సీఎం దిశా నిర్దేశం చేశారు. విపత్తుల సమయంలో అధికార యంత్రాంగం మానవీయ కోణంలో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, జిల్లాలో ప్రస్తుత పరిస్థితిని, అకాల వర్షాలను ఎదుర్కొనేందుకు తీసుకొన్న సన్నద్ధత చర్యలను వివరించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో పటిష్ట సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకొన్నట్లు వివరించారు.

## పారదర్శకతతో అర్జీలు పరిష్కరించండి..



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి, క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విచారించి, పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 117 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే వినతులను గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయి అధికారులు పీజీఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

- పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

విజయవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలంపాటు సేవలందించి పదవీవిరమణ చేసి వయోభారంతో బాధపడుతున్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని గాంధీనగర్‌లో పెన్షనర్ల సంఘం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెన్షనర్లపై ఉన్న మమకారంతో అడిషనల్ కోంటమ్‌ను మంజూరు చేశారన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం అడిషనల్ కోంటమ్‌ను తగ్గించి పెన్షనర్లను మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ అడిషనల్ కోంటమ్‌ను పునరుద్ధరిస్తుందని పెన్షన్‌దారులు సంవత్సరం నుంచి ఎదురుచూస్తున్నట్టు తెలిపారు. కార్యదర్శి జి.ప్రభుదాస్ మాట్లాడుతూ, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సమావేశంలో ఏపీ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.విష్ణువర్ధన్ రావు, సహాధ్యక్షుడు జె.రాజారావు, కోశాధికారి కె. నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## పైసామే పర్సంటేజీ

(5వ పేజీ తరువాయి)

స్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు అందరికీ ఈ పర్సంటేజీలు ఇవ్వాల్సిందే. లేకుంటే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి. నగరాభివృద్ధి అంతా ఈ ఇంజనీరింగ్ విభాగంపైనే ఆధారపడి ఉంటుంది. పర్సంటేజీలకు, మామూళ్లకు అలవాటుపడుతున్న ఇక్కడి అధికారులు నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నారు.

### బినామీ పేర్లతో అధికారులకు పనులు

బీటీ రోడ్ల నుంచి సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కాల్వల్లో పూడికతీత వరకు ప్రతి పనిలో ఇంజనీరింగ్ విభాగం ప్రధాన భూమిక పోషిస్తోంది. పనుల్లో వస్తున్న పర్సంటేజీలు చాలక కొందరు ఇంజనీరింగ్ అధికారులు నగరంలో బినామీ పేర్లతో నామినేషన్ పనులను చేపట్టి ప్రజాధనాన్ని దండుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మామూళ్లు తీసుకున్న పనులైనా సక్రమంగా జరుగుతున్నాయా అంటే ప్రశ్నార్థకమే. చేసిన పనినే పదేపదే చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు.. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో ఉన్న 'రూపాయి'కారి సంబంధాలతో పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు.

### పర్సంటేజీలు ఇలా..

పనులు పూర్తయ్యాక కొలతలు తీసుకుని ఇంజనీరింగ్ అధికారులు బిల్లు సిద్ధం చేస్తారు. ఇక్కడి నుంచే పర్సంటేజీల పర్వం మొదలవుతుంది. బిల్లు సిద్ధంచేసే గుమస్తాకు మామూళ్లు సమర్పించి ఫైల్ ముందుకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి ఏ సర్కిల్లో పని జరిగితే ఆ సర్కిల్ ఏఈ, డీఈ, ఈఈలకు ఒకటి నుంచి మూడు వరకు పర్సంటేజీలు ఇవ్వాలి. సర్కిల్ నుంచి ఫైల్ ఎస్ఈలకు వెళ్తుంది. అక్కడ ఒక శాతం ఉంటుంది. అక్కడి నుంచి ఎగ్జామినర్, అకౌంట్ సెక్షన్లలో ఒక్కొక్కరికి ఒక శాతం, అలాగే బిల్లు చేసేవారికి ఎంతో కొంత సొమ్ము చెల్లించాలి. 20 లక్షల పైన అయితే ఉన్నతస్థాయి అధికారులకు పర్సంటేజీలు ఇవ్వాలి. అయితే, కొందరు కాంట్రాక్టర్లు నిజాయితీగా పనులు చేసినా.. మామూళ్లు లేనిదే ఫైల్ కదలకపోవడంతో బయట తెచ్చిన డబ్బుకు వడ్డీ కట్టలేక ఎవరు ఎంత అడిగితే అంత ముట్టజెబుతున్నారు. ఈ విధంగా ఇంజనీరింగ్ విభాగంలో బిల్లుల కోసం పన్నులు కడుతుంటే అభివృద్ధి పనుల్లో నాణ్యత ఎక్కడ ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలా చేసిన పనులకు సకాలంలో డబ్బు చెల్లించకుండా తమకు ఇవ్వాల్సింది ఇవ్వకుంటే నానా ఇబ్బందులు పెడతారనే ఆరోపణలు ఈ విభాగంపై వస్తున్నాయి. చేసేది లేక కాంట్రాక్టర్లు ఈ చెల్లింపునకు అలవాటు పడ్డారు.

## పేద విద్యార్థుల కలలకు రెక్కలు

- ఐదుగురు టెన్త్ టాపర్లను విమానంలో హైదరాబాద్ తీసుకెళ్తున్న విప్ సౌమ్య

నందిగామ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభకు గౌరవం, ఆశయాలకు ప్రేరణ ఇవ్వాలన్న సంకల్పంతో పేద విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగే కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య చేపట్టారు. నందిగామ నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఐదుగురు పేద విద్యార్థులను విమానం ఎక్కించి హైదరాబాద్ తీసుకువెళ్లి రెక్కలు తొడిగిన వారి ఆశలను నింగిని తాకించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ యాత్ర ఉత్తమ మార్కులు సాధించినందుకు బహుమతి కాదని, భవిష్యత్‌కు నాంది కోసమని సౌమ్య చెప్పారు. పేద విద్యార్థులను ఆమె మంగళవారం గన్నవరం నుంచి విమానంలో హైదరాబాద్ తీసుకువెళుతున్నారు. స్వయంగా ఆమె వారితో కలిసి పర్యటిస్తున్నారు. విమానం ఎక్కబోయే ఐదుగురు విద్యార్థులు ఎవరన్నది తాను పర్యటన నిర్ణయం తీసుకొనే సమయంలో తనకు తెలియదని సౌమ్య చెప్పారు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఏ వర్గానికి చెందిన వారన్నది గానీ, ఏ రాజకీయ పార్టీకి చెందిన వారన్నది గానీ తనకు తెలియదని చెప్పారు. ఓటు వేశారా లేదా అన్న సంకుచిత భావం కూడా తనకు లేదని స్పష్టం చేశారు. ఆ పిల్లలతో చేయబోయే పర్యటన వల్ల తాను కూడా ఉద్వేగానికి లోనౌతున్నట్టు చెప్పారు.

### టూర్‌కు ఎంపికైన విద్యార్థులు వీరే..

కె.వెంకట నాగ శ్రీసాయి, కంచికచర్ల జిల్లా పరిషత్ పాఠశాల, (బిసి), 587 మార్కులు, సీహెచ్ యశశ్విని, ఏపీఆర్‌డబ్లూఎస్ ముప్పాళ్ల, (ఓసి), 583 మార్కులు, పి.అనూష, జిల్లా పరిషత్ పాఠశాల, తోటరావులపాడు, (ఎస్‌సి) 577 మార్కులు, గూడూరు గణేష్ రెడ్డి, జిల్లాపరిషత్ పాఠశాల, అల్లూరు (ఓసి) 573 మార్కులు, సిరివేరు నవ్య, జిల్లా పరిషత్ పాఠశాల, వెల్లంకి, (బిసి) 570 మార్కులు ఎంపికైన వారిలో వున్నారు.

## పట్టణ ప్రాజెక్టు అధికారులకు పదోన్నతులు

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పలు పట్టణ ప్రాజెక్టు అధికారులు(టీపీఓ)లకు పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గ్రేడ్-2 పట్టణ ప్రాజెక్టు అధికారులు నాగు సుబ్బరాయుడు, కె.రజనికుమారి, ఎం.కృష్ణప్ప, డి.సింహాచలంకు గ్రేడ్-1 పట్టణ ప్రాజెక్టు అధికారులుగా అడహాక్ పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలిచ్చారు.

## ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా పుల్లారెడ్డి

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా పి.పుల్లారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. ఈ పదవిలో పుల్లారెడ్డి రెండేళ్లపాటు కొనసాగుతారు. ప్రస్తుతం ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తోన్న ఏపీ ట్రాన్స్‌కో గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ సేవలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఏపీ ట్రాన్స్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్, మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా భాస్కర్ ఇకపై యథావిధిగా బాధ్యతలు నిర్వహిస్తారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇన్‌చార్జి సీఈవోగా విశ్వ

అమరావతి: ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇన్‌చార్జి సీఈవోగా ఎం.విశ్వను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఈవోగా ఉన్న గెడ్డం శేఖర్‌బాబు ఈనెల 5 నుంచి 30 వరకు శిక్షణ నిమిత్తం భోపాల్ వెళ్తున్నారు. దీంతో ప్రస్తుతం ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా సేవలందిస్తున్న ఎం.విశ్వకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇన్‌చార్జి సీఈవోగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: సీపీఐ

అమరావతి: అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేయించి, నష్టపోయిన వాణిజ్య పంటలకు రూ.లక్ష, ఆహార పంటలకు రూ.30 వేలు చొప్పున పరిహారం అందించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, మామిడి రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కూలి మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున చెల్లించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## కూలిన బతుకులు

(5వ పేజీ తరువాయి)

ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చింత వసంత, షేక్ మైలాబీ, వెంకటకుమారి, తుపాకుల దుర్గకు గాయాలయ్యాయి. ఆటోను రాంగ్ రూట్‌లో నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు కోసం గాలిస్తున్నారు.

### పశ్చిమ ఇబ్రహీంపట్నంలో విషాదం

ఈ ప్రమాదంలో ఇద్దరు చనిపోవడం, మరో ఏడుగురికి గాయాలు కావడంతో పశ్చిమ ఇబ్రహీంపట్నంలో విషాదఛాయలు నెలకొన్నాయి. రోజూ కూలి పనులకు వెళ్తే కానీ, పూటగడవని కుటుంబాల్లో కల్లోల్లాన్ని రేపాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని రోదించారు. మరియమ్మ భర్త, దుర్గ భర్త కూలి పనులు చేసుకుంటారు. మరియమ్మకు పిల్లలు లేకపోవడంతో ఒకరిని దత్తత తీసుకుని పెంచుకుంటోంది. దుర్గకు ఇద్దరు పిల్లలు ఉండగా, పెళ్లిళ్లు చేసింది.

## శ్రీవారి స్థలం కబ్జా

(5వ పేజీ తరువాయి)

నాటి వేంకటేశ్వరస్వామి దేవస్థాన అధికారులు, గుమస్తాల పర్యవేక్షణ కొరవడటంతో 11 మంది రేకుల షెడ్లు నిర్మించారు. అందులో దేవస్థానం అధికారులు 6, 7 ఇళ్లపై కోర్టులో కేసు వేశారు. మిగిలిన వాటి గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ప్రస్తుతం స్థానికంగా ఉంటున్న ఓ ప్రైవేట్ వ్యక్తి సుమారు రూ.70 లక్షలకు పైగా విలువచేసే 100 గజాలకు పైగా స్థలాన్ని దర్జాగా కబ్జాచేసి పక్కా నిర్మాణం చేపడుతున్నాడు. దేవస్థానం అధికారులు, ఉద్యోగులు ఆ ఖాళీస్థలంవైపు కన్నెత్తి చూడకపోవటంతో కబ్జాదారులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయ భూమిని కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా భద్రతా చర్యలు చేపట్టి దేవస్థానానికి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

- పౌరసరఫరాల కమిషనర్‌కు కాంగ్రెస్ వినతి

విజయవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్‌ను ఆయన సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించాలని కోరారు. రైతుల వద్ద ఉన్న 20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సౌరబ్‌గౌర్ హామీ ఇచ్చారు.

## స్పాట్ మార్చారు

(5వ పేజీ తరువాయి)

సాగించేందుకు ఉపయోగిస్తున్నారు. విటులు సంప్రదించడానికి నిర్వాహకులు ప్రత్యేకంగా ఒక సెల్ నెంబరు తీసుకుంటున్నారు. ఆ నెంబర్‌ను జస్ట్ డయల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెంబరుకు ఫోన్ చేసిన వారికి లాడ్జీ చిరునామా, గది నెంబరు చెప్పి పంపుతున్నారు. అక్కడికి వెళ్లిన విటులు నచ్చిన యువతిని తీసుకుని పక్క గదిలోకి వెళ్తున్నారు. ఇలా ఆ యువతులను రెండు, మూడు రోజులకు ఒక లాడ్జీ నుంచి మరో లాడ్జీకి మారుస్తున్నారు. ఒకే లాడ్జీలో ఎక్కువ రోజులు ఈ యువతులను ఉంచడం వల్ల సమాచారం పోలీసులకు చేరుతుందన్న ఉద్దేశంతో నిర్వాహకులు ఇలా ప్లాన్లు వేస్తున్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 148,157, 168 |
| చికెన్ విత్ స్కిన్ | 286 |
| చికెన్ స్కిన్‌లెస్ | 296 |

**నెక్ కోడిగుడ్డు ధర (100)**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

## శేషగిరిరావుకు ఘన నివాళి

పటమట: వేదికలు ఎక్కి గొప్ప నీతివాక్యాలు, సిద్ధాంతాలు చెప్పడమే కాకుండా తన జీవితంలో ఆచరించి చూపిన గొప్ప కమ్యూనిస్టు శేషగిరి మాస్టర్ అని పలువురు వక్తలు కొనియాడారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర ప్రముఖ నాయకుడు ఆరేపల్లి శేషగిరిరావు సంస్మరణసభ పార్టీ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో పటమట నల్లూరి వారి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు వి.శంకర్ మాట్లాడుతూ శేషగిరి మాస్టర్ నిబద్ధత గల వ్యక్తి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర నాయకులు ఎస్.మూర్తి, ఎంఎల్ నాయకులు ముప్పాళ్ల భార్గవ శ్రీ, భాస్కరరావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## గోరా టెక్నో హబ్ ఆధ్వర్యంలో జీరో షాడో డే నేడు

బెంజిసర్కిల్, మే 5 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ నాస్తిక్ కేంద్రంలోని గోరా టెక్నో హబ్‌లో మంగళవారం జీరో షాడో డే నిర్వహిస్తున్నట్లు గోరా టెక్నో హబ్ ఛైర్మన్ డాక్టర్ జి.సమరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించి దాని సాంకేతికత రహస్యాన్ని పూర్తి వివరంగా అభ్యాసం చేయడానికి మధ్యాహ్నం 11.30 గంటలకు విద్యార్థులు, నగర ప్రజలకు గోరా టెక్నో హబ్ అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ జీరో షాడో డే సంవత్సరానికి రెండు సార్లు ఏర్పడుతుందని, మంగళవారం నుంచి ఈనెల 14 వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాలు మాయమవుతుందన్నారు. ఈ ఆసక్తికర విషయాన్ని ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్స్ సెర్చ్ క్యాంపెయిన్ జాతీయ సహాయ కన్వీనర్ మేకా సుసత్య రేఖ సాంకేతికంగా ఇది ఎందుకు జరుగుతుందో రేఖా చిత్రాలతో మంగళవారం వివరిస్తారని పేర్కొన్నారు.


ఈస్‌పై అవగాహన కల్పిస్తున్న వక్త

## వైద్య విద్యార్థులలో మానసిక ఆరోగ్యంపై అవగాహనకు ఈస్

ప్రభుత్వాసుపత్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులలో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించేందుకు, వేదనలో ఉన్న సహ విద్యార్థులకు మద్దతు ఇవ్వడం కోసం ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సోమవారం ఎమోషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్ (ఈస్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తొలి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులకు మానసిక వైద్య నిపుణురాలు, ప్రాజెక్టు హెడ్ (యూఎస్‌ఏ) డాక్టర్ అపర్ణా పుప్పాల, డాక్టర్ తేజవతి యూసీ, ఈస్ - ఏపీ ప్రాజెక్టు మేనేజర్, నెల్సన్ వినోద్ మోసెస్, డాక్టర్ రామ్ నరేస్ రెడ్డి, డాక్టర్ సత్యకిషోర్‌లు విద్యార్థులకు పలు విలువైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

## ఫిర్యాదులపై అధికారులు దృష్టి పెట్టాలి

**ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్**

కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే వాటికి శాశ్వత పరిష్కారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు వాటి పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 9 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఈ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, ఎస్‌ఈలు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి పాల్గొన్నారు.


యోగా క్రీడాకారులను అభినందిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

## మర్యాదపూర్వక కలయిక

విజయవాడ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజోతి): న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గత నెల 25నుంచి 27వరకు జరిగిన సెకండ్ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో సీనియర్ ఉమెన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారిణి జి.కావ్యశ్రీ, సీనియర్ మెన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారుడు బీ.కే.రాముడు సోమవారం శాప్ ఛైర్మన్ రవినాయుడును శాప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారు సాధించిన విజయాలు, పతకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఛైర్మన్ రవినాయుడు, శాప్ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## 29న ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలు

ఆటోనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ పాలకవర్గ ఎన్నికలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు అధికారులు పంచకర్ల వెంకట రమణా రావు, తాడేపల్లి శ్రీనివాస దివాకర్‌లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న నిర్వహించే ఎన్నికల్లో గెలిచిన పాలకవర్గం 2028 వరకు కొనసాగుతుందన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో నామినేషన్ల స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఆటోనగర్, ప్లాట్ నం. 86,87 పంచకర్ల వెంకట రమణారావు షెడ్డు వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 6 నుంచి 8 వరకు స్వీకరిస్తారన్నారు. నామినేషన్ల వెరిఫికేషన్‌ను 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి 5 వరకు నామినేషన్లు విత్ డ్రా చేసుకోవచ్చని తెలిపారు. పోటీ ఉన్నచోట సభ్యులకు ఒకరోజు ముందుగా ఫోన్‌లో తెలియజేస్తారని, పోటీ లేనిచోట ఏకగ్రీవం చేస్తామని తెలిపారు.

# ప్రమాదకరంగా కాల్వ కట్ట

- డ్రెయినేజీపై ధ్వంసమైన రక్షణ గోడ
- మురుగునీరు ప్రవాహానికి కోతకు గురైన రోడ్డు
- ప్రమాదాలకు నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రి సర్వీస్ రోడ్డు మార్జిన్

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ ఆసుపత్రి సర్వీస్ రోడ్డులో రోడ్డు మార్జిన్ కోతకు గురై ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ సర్వీస్ రోడ్డు వెంబడి ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయినేజీ ప్రవహిస్తోంది. డ్రెయినేజీకి రోడ్డుకు రక్షణగా గోడను నిర్మించారు. ఈగోడ నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో పలు చోట్ల ధ్వంసమైపోయింది. దీంతో మురుగు నీరు ప్రవాహానికి సర్వీస్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది.

ఈ సర్వీస్ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం, సిద్ధార్థ మెడికల్ కళాశాల ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి సమయంలో ఈరోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులు, వాటి పక్కన రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని దీంతో ఈ ప్రాంతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగాయని పలు వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


ప్రభుత్వ ఆసుపత్రి సర్వీస్ రోడ్డులో డ్రెయినేజీపై ధ్వంసమైన రక్షణ గోడ, ప్రమాదకరంగా మారిన రోడ్డు మార్జిన్

# త్వరలో డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తాం

**ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**

పటమట, మే 5 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే సీఆర్‌డీఏ నిధులతో నియోజకవర్గంలోని అన్ని డ్రెయినేజీల సమస్యలను పరిష్కరిస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం 11వ డివిజన్ కనకదుర్గా కాలనీ, కనకమేడల రవీంద్ర కమ్యూనిటీహాల్ ఏరియాల్లో ఆయన పర్యటించారు. అనంతరం డివిజన్‌లో రూ.11 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఏపీ సీఎం చంద్రబాబు రూ.200 కోట్లు సీఆర్‌డీఏ నుంచి మంజూరు చేయించారని, ఆ నిధులతో నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా బాగు చేయిస్తామన్నారు. తూర్పులోని ప్రధాన కాల్వలైన గుంటతిప్ప డ్రెయిన్, పుల్లేటి కాల్వ, బెంజిసర్కిల్, కృష్ణలంక రిటైనింగ్ వాల్ వద్ద ఇతర ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. గుణదల మురుగు నీటి కాల్వలో ఆడుకుంటూ బాలుడు వర్షపు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కోనేరు రాజేష్, పామర్తి కిషోర్, జాస్తి సురేష్, కొలసాని నాగమణి, మారుతి, సుగుణ, సుజాత, యలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**బాలుడి కుటుంబానికి ఆర్థికసాయం**

గుణదల: గుణదల గంగిరెద్దుల దిబ్బ సైడు కాల్వలో పడి చనిపోయిన మణికంఠ (7) మృతదేహాన్ని గద్దె రామ్మోహన్‌రావు సోమవారం సందర్శించారు. ఆదివారం రాత్రి తన సొంత నిధుల నుంచి రూ 50వేలు ఆర్థిక సాయం అందజేసిన విషయం విదితమే. సదరు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఆయన రెవెన్యూ అధికారి తహసీల్దార్ నుంచి మరో రూ. 50వేలు సాయం అందేలా చేశారు. బాలుడి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి సాయం అందేలా చూస్తానని చెప్పారు. ఇక మీదట ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణ మోహన్, గుణమాల రాజశేఖర్, పాశం కృష్ణ బాబు, శంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలి

- స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని సీపీఎం సంతకాల సేకరణ

కృష్ణలంక, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని సీపీఎం ప్రజాభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణలంక 22వ డివిజన్‌లో ఇంటింటికీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో దోపిడీ యధేచ్ఛగా సాగుతోందన్నారు. బడా కార్పొరేట్లకు వేల కోట్లు దోచిపెడుతూ సామాన్యుల మీద భారాలు వేస్తోందన్నారు. ఈ ప్రభుత్వాలు బడా కంపెనీలతో అడ్డగోలుగా చేసుకొన్న అవినీతి ఒప్పందాల వలనే ఈ భారాలు ప్రజలపై పడుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, బి.చిన్నారావు, టి.తాండవకృష్ణ, ఆనంద్, వి.అప్పారావు, సూరిబాబు, బావనయ్య, కొండ, మాధవరెడ్డి పాల్గొన్నారు.


ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నేత బాబూరావు



## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

ధర్నాచౌక్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తమతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గత 28 నుంచి చేపట్టిన సమ్మెలో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని డిమాండ్ చేశారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలని కోరారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపునివ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు తదితరాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీపీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సందీప్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వర్షిణీ, జనరల్ సెక్రటరీ నవీన్, భవ్య, మారేశ్వరీ, పలువురు హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ కేశినేని నానికి మతిభ్రమించింది

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నిరుద్యోగి అయిన కేశినేని నానికి మతిభ్రమించిందని, ఆయన చేస్తున్న ఆరోపణలు చూస్తేనే ఆయన మానసిక స్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థమౌతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ కుంభకోణం ఏది బట్టబయలైనా దానిని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మీదకి తిప్పే ప్రయత్నం చేస్తుండటం నాని దుర్మార్గమైన రాజకీయ కుట్రకు సంకేతమన్నారు. అవినీతికి ప్రతీక అయిన జగన్మోహన్ రెడ్డి పంచన చేరిన నాని నీతిమాలిన మాటలు మానుకుని సరైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. నాడు వ్యాపారపరంగా, నేడు రాజకీయంగా తమ్ముడు ఎదుగుదలను తట్టుకోలేక పబ్లిక్ డొమైన్‌లో ఉన్న విషయాలను తప్పుదోవ పట్టిస్తూ ట్విట్టర్ పక్షిలా కూస్తున్నాడని విమర్శించారు. నాని దుర్బుద్ధిని ప్రజలు చూస్తున్నారని, రాజకీయ గేమ్‌లు ఆడుతున్న కేశినేని నాని ఇప్పటికైనా మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న జగన్ రెడ్డి

- లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ విమర్శ

వన్‌టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ విమర్శించారు. సోమవారం ఆటోనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయటం లేదని జగన్ విమర్శించటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో రైతులకు బాకీ పెట్టిన సొమ్ము రూ.1,632 కోట్లు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు చెల్లించిందని గుర్తు చేశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను చంద్రబాబు ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ధాన్యం రైతులకు సకాలంలో డబ్బు అందజేయబడుతుందని, జగన్ రెడ్డి కుట్రలు, అబద్ధాలు నమ్మవద్దని ఆయన రైతులకు సూచించారు. ఈ సమావేశంలో బీసీ గౌడ్ సాధికారిక జిల్లా కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం శాప్ ఆధ్వర్యంలో బాక్సింగ్, టెన్నిస్ సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభను గుర్తించడమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇకపై రాత పరీక్ష లేకుండా ప్రతిభ ఆధారంగా క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు కూటమి ప్రభుత్వం కల్పించిందని, దీంతో క్రీడాకారులకు అత్యున్నత గౌరవం, జీవిత భద్రత లభిస్తుందన్నారు. అనంతరం శాప్ కార్యాలయంలో అన్ని జిల్లాల డీఎస్డీవోలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు సమర్థవంతంగా నిర్వహించాలని, క్రీడాయాప్‌లో తప్పనిసరిగా క్రీడాకారుల వివరాలు నమోదు చేయాలని సూచించారు.

## సామ్రాజ్యవాద శక్తులపై విజయమే మార్క్స్‌కు అసలైన నివాళి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

గవర్నర్‌పేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని కుట్రలు చేస్తున్న సామ్రాజ్యవాద శక్తుల మీద పోరాడి విజయం సాధించడమే కార్ల్ మార్క్స్‌కు అసలైన నివాళి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా మార్క్స్, ఎంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాంబమూర్తి రోడ్డులోని మార్క్స్, ఎంగిల్స్ జంట విగ్రహాల వద్ద సభ జరిగింది. విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, వి. శ్రీనివాసరావులు పూలదండలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల వెనుక సామ్రాజ్యవాద శక్తుల కుట్రలు ఉన్నాయని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన తరువాత పన్నులు పెంచుతూ ప్రపంచంలో ఆర్థిక సంక్షోభానికి తెరలేపారని అన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి కె. పోలారి మాట్లాడుతూ బీజేపీ విధానాలపై పోరాడి విజయం సాధించాలంటే కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకే తాటిపైకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి, సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, వామపక్ష నేతలు సీహెచ్ బాబూరావు, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, పి.దుర్గాంబ, భాస్కరరావు పాల్గొన్నారు.


మార్క్స్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

## సమయపాలన లేకుండా మద్యం విక్రయిస్తున్న బార్లపై చర్యలు తీసుకోండి

**కలెక్టర్ ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు వినతి**

కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేస్తున్న బార్ల యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ముఖ్యంగా విజయవాడ నగరంలో పలు ప్రాంతాల్లో అనేక బార్లు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలుమార్లు ఏఐవైఎఫ్ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణ విపరీతంగా సాగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, శీరం రవికుమార్, ఎస్.లాల్‌మోహన్, షైనీ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

## బాల సరస్వతికి మేయర్ అభినందనలు

కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి నృత్యంలో 1156 ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించిన మోదుకూరి బాల సరస్వతిని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అభినందించారు. మేయర్ చాంబర్‌లో సోమవారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూచిపూడి నృత్యంలో 1156 నృత్య ప్రదర్శనలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ బాలరత్న అవార్డు, లెజెండ్ అవార్డు, నాట్యకళా రవళి, నాట్య మయూరి, నాట్య హంసనందిని, నృత్య తరంగిణి, నాట్య అమృతాంజలి, నాట్య కళా హంసిక, ఆజాద్ కా అమృత్ మహోత్సవ అవార్డు, నటరాజ్ అవార్డు లాంటి ఎన్నో అవార్డులు దక్కించుకున్న బాల సరస్వతిని స్ఫూర్తిగా తీసుకొని బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. విజయవాడ నగరపాలకసంస్థ తరఫున బాల సరస్వతికి అన్ని విధాలా మద్దతుగా నిలుస్తామని మేయర్ అన్నారు.


బాల సరస్వతిని అభినందిస్తున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి





పారాహుషార్

## 300 గ్రాములు మించితే..

మాంసాహారుల్లో చికెన్‌ను ఇష్టపడని వారు ఉండరు. కొందరికైతే ఆదివారం వచ్చిందంటే చికెన్ లేనిదే ముద్ద దిగదు. అయితే చికెన్ తినడం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం. వయసు, ఆరోగ్యం, వైద్య చరిత్ర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, 19 ఏళ్ల పాటు, నాలుగు వేల మందిపై ఇటలీ పరిశోధకులు చేసిన అధ్యయనంలో పలు విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. వారానికి 300 గ్రాముల కోళ్ల ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణశయాంతర క్యాన్సర్ ముప్పు రెండింతలు ఎక్కువవుతుందని న్యూట్రియంట్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రమాదం మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువని పరిశోధకులు తేల్చారు. అలాగే వారానికి 300 గ్రాములు, అంతకంటే ఎక్కువగా కోళ్ల ఉత్పత్తులు తినే వారిలో మరణాల ముప్పు కూడా 27 శాతం అధికమని గుర్తించారు. చికెన్‌లో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్, విటమిన్ బి12, కోలిన్ వంటివి పుష్కలంగా ఉన్నప్పటికీ, చికెన్‌ను వారానికి 100 గ్రాములకు మించకుండా మితంగా తినడం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.



హెల్త్ న్యూస్

## టైప్5 మధుమేహం గురించి విన్నారా?

రక్తంలో ఇన్సులిన్ మోతాదు పెరిగితే, దాన్ని టైప్2 మధుమేహంగా నిర్ధారిస్తారు. మరి ఇన్సులిన్ తగ్గితే? రక్తంలో సరిపడా ఇన్సులిన్ లేని పరిస్థితి, టైప్5 మధుమేహంగా అధికారిక గుర్తింపు పొందింది. మరిన్ని వివరాలు...

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని దశాబ్దాల క్రితమే పోషకాహార లోపంతో సంబంధమున్న మధుమేహాన్ని గుర్తించడం జరిగింది. ఈ రకమైన మధుమేహం తాజాగా అధికారిక గుర్తింపును దక్కించుకుంది. అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్, ఈ మధుమేహాన్ని టైప్5 మధుమేహంగా వర్గీకరించింది. 70 ఏళ్ల క్రితమే ఈ మధుమేహాన్ని గుర్తించినప్పటికీ ప్రపంచ ఆరోగ్య చర్చల్లో దీన్ని నిర్లక్ష్యం చేయడం జరిగింది. 20వ శతాబ్దంలోనే వెలుగులోకొచ్చిన ఈ పరిస్థితిని టైప్1 లేదా టైప్2 మధుమేహంగా తప్పుగా వర్గీకరించారు. ఈ అసాధారణమైన మధుమేహం, ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాల్లోని పోషకాహారలోపంతో బాధపడే యువతను పట్టి పీడిస్తున్నట్టు, 160 దేశాల్లోని 250 జాతీయ డయాబెటిక్ అసోసియేషన్లు అంచనా వేసినట్టు అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ పేర్కొంటోంది. దీర్ఘకాలం పాటు పోషకాహార లోపంతో బాధపడే వారిలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి టైప్5 మధుమేహం పెరుగుతోంది. ప్రత్యేకించి కౌమార దశలో బయల్పడే ఈ మధుమేహానికి ఒక జన్యులోపమే కారణం. ఈ రకమైన జన్యు ఉత్పరివర్తనం తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. అయితే టైప్5 మధుమేహానికి ఇటీవలే అధికారిక గుర్తింపు లభించింది కాబట్టి వ్యాధినిర్ధారణ, చికిత్సా విధానాలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సంబంధించి చేపట్టిన పరిశోధన ఆధారంగా ఈ రుగ్మతకు సంబంధించి మరో రెండేళ్లలో మార్గదర్శకాలను అభివృద్ధి చేయనున్నట్టు అంతర్జాతీయ మధుమేహ ఫెడరేషన్ ప్రకటించింది.






# ఉబ్బసం నుంచి ఉపశమనం

**కీలెంచి వాత పెట్టాలనే సూత్రం ఉబ్బసానికి కూడా వర్తిస్తుంది. ఈ రుగ్మత ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే చికిత్స అందించడం సరి కాదు. ప్రేరేపించే అంశాలు, వయసు, తీవ్రతల ఆధారంగా తగిన చికిత్సా మార్గాన్ని ఎంచుకుంటే ఉబ్బసాన్ని అదుపు చేయడమే కాదు, దాన్నుంచి సమూలంగా విముక్తి పొందవచ్చు అంటున్నారు వైద్యులు.**

ఉబ్బసాన్ని వ్యాధిగా పరిగణించకూడదు. దీన్నొక పరిస్థితిగానే భావించాలి. ఈ సమస్య చికిత్సకు లొంగడమే కాకుండా, సకాలంలో స్పందించి, తగిన చికిత్స తీసుకోగలిగితే దీన్నుంచి శాశ్వత విముక్తి కూడా పొందే వీలుంటుంది. నిజానికి ఉబ్బసం వ్యాధి, చికిత్స పట్ల ఉన్న అపోహలే వ్యాధి నియంత్రణకు అవరోధాలుగా మారుతున్నాయి. సమర్థమైన చికిత్స అందుబాటులో ఉన్నా, వ్యాధిని అదుపులో ఉంచే ముందు జాగ్రత్త చర్యల పట్ల అవగాహన లేకపోవడం వల్ల సమస్యను అదుపు చేయలేకపోతున్నాం. ఉబ్బసాన్ని ప్రేరేపించే కారకాలను నిర్లక్ష్యం చేయడం, పక్కదారి పట్టించే లక్షణాలకు స్వీయ చికిత్సలను ఆశ్రయించడం... ఇలా ఈ వ్యాధిని చేతులారా పెంచి పోషించుకుంటున్నాం!

### లెక్కలేనన్ని కారణాలు

ఉబ్బసానికి వయసుతో సంబంధం లేదు. ఈ సమస్య ఎవరికైనా, ఎప్పుడైనా తలెత్తవచ్చు. సాధారణ అలర్జీ కూడా దీర్ఘకాలంలో ఉబ్బసానికి దారి తీయొచ్చు. ఈ పరిస్థితికి ఇంకొన్ని కారణాలు ఏవంటే...

- వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు
- వాతావరణ కాలుష్యం వల్ల రావొచ్చు
- జీవనశైలి, ఆహారశైలి మార్పులు రావొచ్చు
- కృత్రిమ పదార్థ రంగులు, రసాయనాల వల్ల తలెత్తవచ్చు
- ఫుడ్ అలర్జీ, డస్ట్ అలర్జీల వల్ల రావొచ్చు
- కొందరు పుట్టుకతోనే రావొచ్చు
- మరి కొందరికి బాల్యంలో తలెత్తవచ్చు
- జన్యు ఉత్పరివర్తనల వల్ల రావొచ్చు
- బొద్దింకలు, పూలపుప్పొడి వల్ల తలెత్తవచ్చు
- పరిశ్రమల నుంచి వెలువడే పొగల వల్ల రావొచ్చు

**గ్లోబల్ ఇనీషియేటివ్ ఆస్తమా అనే లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ, ప్రతి ఏటా మే ఆరును ఆస్తమా దినంగా ప్రకటించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను చేపడుతూ ఉంటుంది.**

### ఈ లక్షణాల మీద కన్నేసి...

దగ్గు, పిల్లికూతలు, ఆయాసం.. ఈ మూడు ఉబ్బసం ప్రధాన లక్షణాలు. కానీ ఇవే లక్షణాలు సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా కనిపిస్తాయి. కానీ అవి కొన్ని రోజులు వేధించి, తగ్గిపోతాయి. అలా కాకుండా పదే పదే అవే లక్షణాలు వేధిస్తూ ఉన్నా, ఒక రుతువులో మాత్రమే ఈ లక్షణాలు పెరుగుతున్నా ఉబ్బసంగా అనుమానించాలి. కొత్తగా బడికి వెళ్తున్న పిల్లల్లో ఇలాంటి లక్షణాలు ప్రతి నెలా కనిపించినప్పుడు, ఆ లక్షణాలను ప్రేరేపించే అంశాలు, కుటుంబ చరిత్ర, తీవ్రతల ఆధారంగా ఉబ్బసాన్ని నిర్ధారించుకోవాలి. అయితే రుతుపరమైన వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా ఇవే లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి కాబట్టి ఉబ్బసాన్ని నిర్ధారించుకోవడం కోసం కొన్ని పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. పెద్దల్లో కూడా అకస్మాత్తుగా ఉబ్బసం తలెత్తుతుంది.

### పరీక్షలున్నాయి

ఉబ్బసాన్ని నిర్ధారించడం తేలికే! స్పైరోమెట్రీ, పీక్ ఫ్లో మెషిన్ పరీక్షలతో ఉబ్బసం తీవ్రత తెలుస్తుంది. మందులతో ఉబ్బసం లక్షణాలు అదుపులోకి రావడాన్ని బట్టి కూడా సమస్యను ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. లక్షణాలు పగలు తక్కువగా సాయంత్రం, రాత్రి వేళ ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ పరీక్షలు కూడా అవసరమవుతాయి. అలాగే అలర్జీ సంకేతాలు, లక్షణాలకు సంబంధించిన ప్రశ్నావళులను పూరించడం ద్వారా, కలిగి ఉన్న అలర్జీల పట్ల స్పష్టత ఏర్పరుచుకుని, ఉబ్బసానికే దారి తీసే అవకాశాలను కూడా అంచనా వేయవచ్చు. వైద్యులు, ఈ పరీక్షలన్నిటినీ ఉబ్బసం నిర్వహణ సాధనాలుగా పరిగణిస్తారు. అలాగే కొందరు పిల్లల్లో వ్యాయామం చేసినప్పుడు మాత్రమే ఉబ్బసం ప్రేరేపితమవుతూ ఉంటుంది. ఇలాంటి పిల్లల చేత వ్యాయామం చేయించి, పల్మోనరీ ఫంక్షన్ టెస్ట్ చేపట్టి ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు.



### ట్రిగ్గర్ కావొచ్చు!

కొందరికి ఐదు నిమిషాల ముందు వరకూ లేని ఆయాసం హఠాత్తుగా మొదలవుతుంది. భయపడినా, విపరీతమైన ఒత్తిడి, శారీరక శ్రమకు లోనైనా క్షణాల్లో ఉబ్బసం లక్షణాలు కనిపించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేస్తాయి. ఇలాంటివాళ్లు ఇన్‌హేలర్స్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. క్రీడాకారులైతే ఆటకు ముందు వీటిని వాడితే, ఉబ్బసం వేధించకుండా ఉంటుంది.

### ఇన్‌హేలర్స్ సురక్షితం

**ఉబ్బసానికి ఉత్తమమైన చికిత్స నెబ్యులైజర్స్, ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్. చాలామంది వీటిని వాడడానికి ఇష్టపడరు. వైద్యులు ఇన్‌హేలర్స్ సూచించినప్పుడు వేరే మందులను సూచించమని వైద్యులను ఒత్తిడి చేస్తారు. కానీ ఉబ్బసానికి ఇన్‌హేలర్స్ సురక్షితమైన చికిత్స. తీవ్రతను బట్టి కొందరికి స్టిరాయిడ్స్ కూడా అవసరం పడొచ్చు. ఈ రెండూ ఇతరత్రా దుష్ప్రభావాలు కలిగించకుండా నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేస్తాయి.**

అలాగే కొందర్లో పిల్లికూతలు, ఆయాసం లేకుండా కేవలం దగ్గుతోనే ఉబ్బసం బయల్పడవచ్చు. ఐదేళ్ల లోపు పిల్లల్లో పిల్లికూతల రూపంలో ఉబ్బసం బయటపడొచ్చు.

### అలర్జీలున్నాయా?

గత రెండు దశాబ్దాల్లో మన దేశంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయాయి. ఇలా ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయినప్పుడు మన శరీరం వ్యాధినిరోధకశక్తి స్పందన తీరు మారిపోతుంది. ఫలితంగా కొన్ని వాతావరణాలకు, భావోద్వేగాలకూ, పదార్థాలకూ శరీరం ప్రతికూలంగా స్పందించి, ఉబ్బసం లక్షణాలు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా అలర్జీలన్నీ ఉబ్బసానికే దారి తీస్తాయని అనుకుంటూ ఉంటారు. కానీ ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్ లాంటి 40% నుంచి 50% అలర్జీలు మాత్రమే ఉబ్బసానికి దారి తీస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో అలర్జీలు ఉబ్బసాలకు దారి తీసే అవకాశాలు ఎక్కువ. కానీ ఎక్కువ శాతం పిల్లల్లో అలర్జీ కారక ఉబ్బసం ఉన్నప్పటికీ, సరైన చికిత్సను అందించగలిగితే, వయసు పెరిగేకొద్దీ ఆ లక్షణాలన్నీ సమసిపోతూ ఉంటాయి.

### చికిత్స ఇలా...

అకస్మాత్తుగా తీవ్ర ఉబ్బసం దాడి చేసినప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ఆ సమయంలో నెబ్యులేజేషన్‌తో పాటు ఆక్సిజన్ కూడా అవసరమవుతుంది. ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్ కూడా అవసరమవుతాయి. దీర్ఘకాల ఉబ్బసం ఉన్నవారు అలర్జీలను తగ్గించుకోవడం అవసరం. కొందరికి అగరబత్తీలు, సాంబ్రాణి వాసనలకు ఉబ్బసం లక్షణాలు వేధిస్తాయి. వీళ్లు మాస్కులు వాడుకోవాలి. స్వీట్లు తిన్నప్పుడు లక్షణాలు తీవ్రమైతే వాటికి దూరంగా ఉండాలి. చల్లని పదార్థాలు, కొన్ని రకాల పండ్లు, వంకాయ, గుడ్లు, నట్స్‌తో కూడా కొందర్లో ఉబ్బసం తలెత్తుతుంది. ఆ కారకాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ కూడా సర్వత్రా నాటుకుపోయింది. వీటిని ఉబ్బసం చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.

**డాక్టర్ పి. నవీన్ సారథి**
కన్సల్టెంట్ పీడియాట్రిక్ పల్మోనాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్.





# పెద్దపేగు పదిలంగా

**మన దేశంలో అత్యంత సాధారణ క్యాన్సర్లలో పెద్ద పేగు క్యాన్సర్ ఒకటిగా మారిపోయింది. జీర్ణకోశ సమస్యలను తలపించే పెద్ద పేగు క్యాన్సర్ చికిత్స పక్కదారి పట్టే ప్రమాదం ఉంది కాబట్టి అప్రమత్తతతో వ్యవహరించడం అవసరమంటున్నారు వైద్యులు.**

గత ఐదేళ్ల కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ ఉదంతాలు రెట్టింపయ్యాయి. మునుపు ఏడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిమితమైపోయిన ఈ క్యాన్సర్ తాజాగా మూడవ స్థానానికి ఎగబాకింది. ప్రత్యేకించి యువతలో ఈ క్యాన్సర్ పెరగడం ఆందోళన కలిగించే విషయం. మరీ ముఖ్యంగా ఈ క్యాన్సర్‌ను తొలి దశల్లోనే గుర్తించలేకపోవడం వల్ల వ్యాధి ముదిరి చికిత్స క్లిష్టమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం, పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు పొట్ట, పేగుల్లో తలెత్తే సాధారణ సమస్యలను తలపించేలా ఉండడమే!

### తప్పుదోవ పట్టించే లక్షణాలు

**మలబద్ధకం:** రోజుల తరబడి మలబద్ధకం వేధిస్తుంది. అయితే అడపాదడపా ఈ సమస్య సాధారణమే కాబట్టి ఎవరూ దీన్ని పెద్దగా పట్టించుకోరు. కానీ పెద్దపేగు క్యాన్సర్‌గా భావించరు

**విరోచనాలు:** ఈ లక్షణం కూడా అందర్లో అడపాదడపా కనిపిస్తూనే ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు

**మిశ్రమ సమస్య:** కొన్ని రోజులు మలబద్ధకం, ఇంకొన్ని రోజులు విరోచనాలు వేధిస్తాయి. ఇలాంటి మిశ్రమ లక్షణాలు కూడా పెద్దపేగు క్యాన్సర్‌ను సూచిస్తాయి

**మలంలో రక్తం:** మలంలో రక్తం కనిపించడం కూడా పెద్దపేగు క్యాన్సర్ లక్షణమే!

**మలవిసర్జనలో ఇబ్బంది:** మలవిసర్జన సాఫీగా, సునాయాసంగా జరగకపోయినా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

**అల్సరేటివ్ కొలైటిస్:** ఈ సమస్య నిర్లక్ష్యానికి గురైనప్పుడు, అది పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది

**బరువు/ఆకలి తగ్గడం:** అకారణంగా శరీర బరువు, ఆకలి తగ్గుతున్నా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

### పెద్దపేగు ఆహారం

**పెద్ద పేగు ఆరోగ్యం కోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు లాంటి జంక్ ఫుడ్ తగ్గించాలి.**



### నియంత్రణ చర్యలు ఇవే!

పెద్దపేగు క్యాన్సర్ నివారణ సులభమే! కొద్దిపాటి అప్రమత్తతతో, ముందు జాగ్రత్తలతో ఈ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు.

- బరువును అదుపులో ఉంచుకోవాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- వ్యాయామం చేస్తూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్ ఉన్నవాళ్లు 40 ఏళ్లు దాటిన వెంటనే, లేనివాళ్లు 50ఏళ్లు దాటగానే కొలనోస్కోపీ చేయించుకోవాలి
- ఒకసారి కొలనోస్కోపీలో క్యాన్సర్ లేదని నిర్ధారణ అయినవాళ్లు అప్పటి నుంచి ప్రతి పదేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకోవాలి
- రెడ్ మీట్, బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం మానేయాలి

### వీరికి ముప్పు ఎక్కువ

- అధిక బరువు
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్
- అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు
- ఎక్కువగా రెడ్ మీట్ తినడం
- ధూమపానం, మద్యపానం
- వ్యాయామం లోపం
- ఎక్కువ గంటలు కదలకుండా పనిచేయడం
- బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం

### వ్యాధి నిర్ధారణ ఇలా...

మలబద్ధకమైనా, విరోచనాలు అయినా 5 నుంచి 7 రోజులకు క్రమేపీ సర్దుకుంటాయి. పొట్ట, పేగులకు సంబంధించిన సాధారణ సమస్యలన్నీ తాత్కాలికంగానే వేధించి, తగ్గిపోతూ ఉంటాయి. ఇలా కాకుండా నెల, రెండు నెలల పాటు లక్షణాలు వేధిస్తూ ఉన్నా, బరువు తగ్గిపోతున్నా తప్పనిసరిగా వైద్యులను కలిసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. రక్తపరీక్షలు, ట్యూమర్ మార్కర్లు, కొలనోస్కోపీలతో పెద్దపేగు క్యాన్సర్‌ను సులువుగా పసిగట్టవచ్చు. కొలనోస్కోపీతో ఒకటి, రెండు దశల్లోని కనిపెట్టవచ్చు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి సిటి స్కాన్, సిటి కొలనోగ్రఫీలు చేసి, క్యాన్సర్ తీవ్రతను అంచనా వేయవచ్చు. శరీరంలోకి ఎలాంటి స్కోప్‌ను చొప్పించకుండానే పెద్దపేగు, పురీషనాళంలోని పాలిప్స్, పుండ్లు, క్యాన్సర్ గడ్డలను కనిపెట్టడంలో సిటి కొలనోగ్రఫీ బాగా తోడ్పడుతుంది. పెద్దపేగు క్యాన్సర్ ప్రారంభంలో చిన్న పాలిప్‌లా మొదలవుతుంది. కాబట్టి స్కాన్ సమయంలోనే వీటిని పసిగట్టి, తొలగించగలిగితే వ్యాధి ముదురకుండా చూసుకోవచ్చు.

### చికిత్స సులువే!

పెద్దపేగుల్లో తలెత్తే క్యాన్సర్ ముందరి పాలిప్స్ కణుతులను ఎండోస్కోపీతో తొలగించుకోవచ్చు. ఈ చికిత్స రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. తర్వాతి రోజే రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. క్యాన్సర్ మూడు, నాల్గవ దశలకు చేరుకున్నప్పుడు సర్జరీ చేయక తప్పదు. చివరి దశల్లో క్యాన్సర్ పెద్దపేగు నుంచి కాలేయం, ఎముకలు, ఊపిరితిత్తులకు వ్యాపించినప్పుడు సర్జరీ ముందు, తర్వాత కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతుంది. తాజాగా రొబొటిక్ సర్జరీ కూడా అందుబాటులోకొచ్చింది. చిన్న కోతతో కొనసాగే ఈ సర్జరీతో రోగి తక్కువ కాలంలోనే కోలుకోగలుగుతాడు. సర్జరీ తదనంతరం దుష్ప్రభావాలు కూడా ఉండవు.

**డాక్టర్ కృష్ణగోపాల్ ఎస్ భండారి**
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



తెలుసుకుందాం

# మెదడుకు పదును ఇలా...

మెదడు చురుగ్గా ఉంచుకున్నంత కాలం, మతిమరుపు సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వాళ్లు మెదడుకు వ్యాయామాన్ని అందిస్తూనే ఉండాలి. అందుకోసం...

**రోజుకొక కొత్త విషయం:** కొత్త సమాచారంతో మెదడుకు సవాలు విసురుతూ మెదడును చురుగ్గా ఉంచుకుంటూ ఉండాలి. కొత్త అభిరుచి ఏర్పరుచుకోవడం, కొత్త భాష నేర్చుకోవడం, కొత్త సంగీత వాయిద్యం సాధన చేయడం లాంటివన్నీ మెదడుకు వ్యాయామాలే! ఇవన్నీ చేయలేనివాళ్లు కొత్త వంటకం వండడం, కొత్త విషయాలను తెలుసుకోవడం లాంటివి చేయొచ్చు.

**బ్రెయిన్ గేమ్స్, పజిల్స్:** సుడొకు, పజిల్స్ పూరిస్తూ వాటిని నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఈ ఆటల కోసం రోజుకు అరగంట కేటాయించడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుంది. అయితే రోజూ ఒకే రకమైన బ్రెయిన్ గేమ్స్‌కు బదులుగా ఒక రోజు సుడొకు, ఒక రోజు పదవినోదం, మరొక రోజు అంకెల గారడీ లాంటివి ఆడుతూ ఉండాలి.

**ధ్యానం:** ధ్యానంతో మానసిక ప్రశాంతత దక్కడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. క్రమం తప్పక ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తితో సంబంధమున్న మెదడులోని హిప్పొపొటమస్ అనే ప్రదేశం బలపడుతుంది.

**వాటం మార్పు:** కుడి చేతి వాటం ఉన్న వాళ్లు ఎడమ చేతినీ, ఎడమ చేతి వాటం ఉన్న వాళ్లు కుడి చేతినీ వాడుకుంటూ ఉండాలి. బ్రష్‌తో పళ్లు తోముకోడానికీ, చీపురు పట్టుకుని ఊడ్చడానికీ, ఏదైనా అందుకోడానికీ, గరిట తిప్పడానికీ.. ఇలా తేలికపాటి పనుల కోసం చేతి వాటం మారుస్తూ ఉండడం వల్ల మెదడులోని రెండు అర్థభాగాలూ చైతన్యమవుతాయి.

**వ్యాయామం:** వ్యాయామంతో మెదడు కూడా లాభపడుతుంది. ఏరోబిక్ వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. నడక, ఈత, డాన్స్... ఇవన్నీ మెదడును చురుగ్గా ఉంచుతాయి. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

**అనుబంధాలు:** సంభాషణ, హాస్యం, అనుబంధాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. కాబట్టి స్నేహితులతో కాలక్షేపం చేయడం, కలిసి సినిమాలు చూడడం, చర్చలు జరపడం లాంటివి చేస్తూ ఉండాలి. సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి.



## ఆర్బీకేల్లో రూ.100 కోట్లు తినేశారు!

**గత ప్రభుత్వ పెద్దలు, ఏడీఏల చేతివాటం!**

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాల్లోకి రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లూ చేరాయి. వైసీపీ గొప్పగా ఏర్పాటు చేశామని చెప్పుకొన్న ఆర్బీకేల నిర్వహణ నిధులూ దారి మళ్లిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఒక్కో ఆర్బీకేకు నెలకు రూ.2,047 చొప్పున గత ప్రభుత్వం మంజూరు చేయగా.. ఆ శాఖ చూసిన ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు కుమ్మక్కై దోచేసుకున్నారు. ఈవిధంగా 10,778 ఆర్బీకేలకు నాలుగేళ్లలో విడుదలైన రూ.100 కోట్లకుపైగా సొమ్ము దుర్వినియోగమైనట్టు తెలిసింది. ఆర్బీకేల నిర్వహణకు నిధులు ఇచ్చినట్లే ఇచ్చి, ఆ సొమ్మును దారిమళ్లించి, ఖర్చుల భారాన్ని మాత్రం గ్రామ వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పట్టు, పశుసంవర్ధక సహాయకులపై మోపారు. ప్రతి ఆర్బీకేలో స్వీపరుకు గౌరవ వేతనం, ఇంటర్నెట్, స్టేషనరీ ఖర్చుల నిమిత్తం రూ.2,047 ఇచ్చినట్లు లెక్కలు చూపారు. కానీ ఆ డబ్బులు క్షేత్రస్థాయికి పంపకుండా అధికారులు నొక్కేశారు. దీంతో గత్యంతరం లేక కొందరు వీఏఏలు ఆర్బీకే సేవల పేరుతో రైతుల నుంచి వసూళ్లు చేశారు. ఈవిధంగా నెలకు రూ.2,20,62,566 చొప్పున ఏడాదికి రూ.26.48కోట్లు నొక్కేశారు. ఇందులో గత ప్రభుత్వంలో ఆ శాఖకు చెందిన వ్యక్తులకు వాటాలు వెళ్లినట్లు సమాచారం. 2020-24 మధ్య ఆర్బీకేల నిర్వహణ నిధుల్లో అవినీతి జరిగినట్లు తాజాగా ప్రజాప్రతినిధులు గుర్తించారు. దీనిపై విచారణ జరపాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 2024-25లో కూడా ఆర్బీకేల నిర్వహణ నిధులు వినియోగించుకున్నట్లు వ్యవసాయ శాఖ ఇటీవల సమాచార హక్కు చట్టం కింద స్పష్టత ఇచ్చింది. ఈ నిధులన్నీ దుర్వినియోగం అయినట్టు తెలుస్తోంది.

## జూన్ 1 నుంచి విశాఖ-బెజవాడ విమాన సర్వీస్

న్యూఢిల్లీ, విశాఖపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి విజయవాడకు ఒక విమానాన్ని నడపడానికి ఇండిగో సంస్థ ముందుకువచ్చింది. ఈ విమానం విజయవాడలో ఉదయం 7.15కు బయలుదేరి 8.25కు విశాఖపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 8.45కు బయలుదేరి 9.50కి విజయవాడ చేరుతుందని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు 'ఎక్స్'లో స్పందిస్తూ రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నం నుంచి రాజధాని విజయవాడ ప్రాంతం మధ్య విమాన సర్వీసులు తిరిగి ప్రారంభిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. కాగా, విశాఖపట్నం-విజయవాడ మధ్య విమాన సర్వీసులు ఏప్రిల్1 నుంచి నిలిచిపోయాయి.

**బంగాళాఖాతంలో ఘర్షణలు..**

## తమిళ జాలర్లకు గాయాలపై పవన్ ఆందోళన

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల బంగాళాఖాతంలో జరిగిన ఐదు వేర్వేరు ఘర్షణల్లో తమిళనాడుకు చెందిన 24 మంది భారత జాలర్లు భాగస్వామ్యం కావడం ఆందోళన కలిగిస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సంఘటనలపై సోమవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. తమిళనాడులోని నాగపట్నం జిల్లాకు చెందిన జాలర్లు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా గాయపడ్డారని తెలిసిందన్నారు. ఇది వారి జీవనోపాధిపై కూడా ప్రభావితం చూపిస్తుందన్నారు. భారత్, శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను పవన్ కోరారు. ఇరు దేశాలకు చెందిన జాలర్ల భద్రత దృష్ట్యా.. భారత్, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు.

## పార్లమెంటరీ ప్రజాపద్దుల కమిటీ పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, మే 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ ప్రజాపద్దుల(పబ్లిక్ అకౌంట్స్) కమిటీని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పునర్వ్యవస్థీకరించారు. కమిటీ చైర్మన్‌గా కేసీ వేణుగోపాల్‌ను తిరిగి నియమించారు. కమిటీ సభ్యులుగా తెలుగు రాష్ట్రాల ఎంపీలు కె.లక్ష్మణ్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎం రమేశ్, వల్లభనేని బాలశౌరి తిరిగి చోటు దక్కించుకున్నారు. కమిటీలో మొత్తం 22 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 15 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు ఉంటారు. కమిటీ సభ్యుల పదవీకాలం ఏడాది ఉంటుంది.

# అధికారుల జనం బాట!

**21 నుంచి మూడ్రోజులు 'స్వర్ణాంధ్ర సంకల్పం'.. తొలి విడత 450 సచివాలయాల్లో నిర్వహణ**

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు? పథకాలన్నీ ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా? ప్రభుత్వం నుంచి జనం ఇంకా ఏం ఆశిస్తున్నారు? ప్రస్తుతం అందుతున్న పథకాలపై లబ్ధిదారులు సంతృప్తిగా ఉన్నారా? ఇలాంటి ప్రశ్నలకు వారి నుంచే సమాధానం తెలుసుకునేందుకు సర్కార్ సమాయత్తమైంది. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర సంకల్పం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మే 21, 22, 23 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. గత నెల 3న జరిగిన కేబినెట్ సమావేశంలో.. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అప్పుడే ప్రజాభిప్రాయాన్ని నిష్పక్షపాతంగా తెలుసుకోగలమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అప్పటి కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయానికి కార్యరూపం ఇస్తూ 'స్వర్ణాంధ్ర సంకల్పం'కు రూపకల్పన చేశారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 450 సచివాలయాలను ఎంపిక చేసుకుని ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ సచివాలయాల ఎంపిక కేవలం పట్టణ ప్రాంతాలకు పరిమితం కాకుండా అధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లో ఉండేలా చూడనున్నారు. తొలి విడతలో ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు హెచ్‌వోడీలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. ఆ తర్వాత జరిగే కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులనూ భాగస్వాములను చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగితే ప్రభుత్వ పనితీరుపై మరింత మెరుగైన సమాచారం తెలుసుకోవచ్చని, క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి ఓ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని సీఎం భావిస్తున్నారు. ప్రతి అధికారి ఎంపిక చేసుకున్న ప్రాంతంలో మూడు పగళ్లు.. రెండు రాత్రుళ్లు గడిపి, స్థానికులతో మమేకమై వారి అభిప్రాయాలు, స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవాలన్నది స్థూలంగా ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ కార్య క్రమంలో ఎక్కడా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోంది.

**'స్వర్ణాంధ్ర సంకల్పం'లో ఏం చేస్తారంటే..**

- ప్రతి అధికారి ఎంపిక చేసుకున్న ప్రాంతంలోని సచివాలయాన్ని తప్పనిసరిగా సందర్శించాలి. అక్కడ సిబ్బంది ఎలా పనిచేస్తున్నారు.. అక్కడున్న సమస్యలు.. సచివాలయాలకు వస్తున్న ప్రజలకు సరైన విధంగా సేవలు అందుతున్నాయా అన్న అంశాలను పరిశీలిస్తారు.
- ఆ తర్వాత రేషన్ షాపులు, అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలలను సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలిస్తారు. డ్వాక్రా గ్రూపులు, రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారు.
- ఒక రాత్రి స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసుకుని, స్థానిక అవసరాలు, సమస్యలపై సమగ్రంగా చర్చిస్తారు.
- ఒక రోజు సచివాలయం పరిధిలోని ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడుతారు. లబ్ధిదారుల నుంచి పథకాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. చివరిగా స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటారు.
- స్వర్ణాంధ్ర సంకల్పం పర్యటన వివరాలను పొందుపరిచేందుకు ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించారు. అధికారులు తమ పర్యటనలో తెలుసుకున్న వివరాలను అందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

**ముఖహాజరు మాయాజాలంతో**

## విధులకు ఎగనామం!

**» 224 మంది పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఇతర సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు**

ఏలూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ముఖ గుర్తింపు ఆధారిత(ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరు నమోదులో అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 224 మంది పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులపై చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. హాజరు నమోదులో ఐఫోన్లలోని అధునాతన సాంకేతికను ఉపయోగించి తేదీ, సమయం సెట్టింగ్‌ను ట్యాంపరింగ్ చేయడం ద్వారా హెల్త్ ఎఫ్‌ఆర్‌ఎస్ మొబైల్ యాప్‌లో బురిడీ కొట్టించారని ఎఫ్‌ఆర్‌ఎస్ స్టేట్ నోడల్ అధికారి గతనెల 10న గుర్తించారు. పీహెచ్‌సీల సిబ్బందికి కేటాయించిన ప్రధాన స్థానాల్లో విధిగా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేయాల్సి ఉండగా, కొందరు తమకు అనువైన సబ్ సెంటర్లను, మరికొందరు ఇతర ప్రాంతాలను మ్యాపింగ్ చేసుకుని ఐఫోన్ల ద్వారా ట్యాంపరింగ్ చేస్తూ హాజరు వేసి వెళ్లిపోతున్నట్టు గుర్తించారు. ఇలా చేయడం వల్ల పీహెచ్‌సీలు, వాటి పరిధిలో వైద్య సేవలకు విఘాతం కలుగుతున్నట్టుగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఐఫోన్లలో డేట్, టైం సెట్టింగ్‌లను ట్యాంపరింగ్ చేసి ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేసిన 224 మందిని గుర్తించారు. ఇలా గుర్తించిన వారిలో రెగ్యులర్ వైద్యాధికారులు, ఉద్యోగులపై సీసీఏ రూల్స్‌ప్రకారం చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ మెడికల్ ఆఫీసర్లు, ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

# ఏ2 ఆఫీసులో సోదాలు

అసలు సూత్రధారి అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు కాగా, రెండో నిందితుడిగా మధుసూదన్‌పై ఇటీవల సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లిన బెజవాడ పోలీసులు బంజారా హిల్స్‌లోని పంచవటి కాలనీలో ఉన్న కార్యాలయంలో మధుసూదన్‌ను ప్రశ్నించారు. అప్పట్లో ఏం జరిగింది.. ఏపీపీఎస్సీ కార్యాలయంలో కాకుండా ప్రైవేటు రిసార్ట్స్‌లో డిజిటల్ మూల్యాంకనం ఎందుకు చేశారు? అలా చేయమని పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పారా? ఏపీపీఎస్సీ నుంచి ఎవరైనా అడిగారా? మీరే ప్రభుత్వ పెద్దల నుంచి పైరవీ చేయించుకున్నారా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అప్పట్లో డిజిటల్ మూల్యాంకనానికి వినియోగించిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

### అక్రమాలకు వేదిక హాయ్‌ల్యాండ్

వైసీపీ హయాంలో పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉన్న సమయంలోనే గ్రూప్-1లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఏపీపీఎస్సీ ఆఫీసుతో సంబంధం లేని గుంటూరు హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం చేయించడమే అక్రమాలకు వేదికైంది. అయితే, ఆ తర్వాత మళ్లీ రెండోసారి మూల్యాంకనం చేయించినా, రెండుసార్లు జరిగిందనే విషయాన్ని వైసీపీ ప్రభుత్వం దాచిపెట్టింది. హాయ్‌ల్యాండ్ అనే పేరు కూడా తమకు తెలియదన్నట్టుగా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొయింది. హాయ్‌ల్యాండ్‌లో మొదటిసారి మూల్యాంకనానికి చేసిన ఏర్పాట్లు, చెల్లింపుల వివరాలను అభ్యర్థులు ఆధారాలతో సహా నిరూపించడంతో హైకోర్టు ఏకంగా మెయిన్స్‌ను కొట్టివేసింది. అయితే, ఈ మొత్తం వ్యవహారం వెనుక చక్రం తిప్పింది పీఎస్ఆర్ ఆంజనేయులు అని విచారణాధికారులు భావిస్తున్నారు. 2018లో ఏపీపీఎస్సీ 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. దీనిలో మాన్యువల్ విధానం(చేతితో దిద్దే)లో మెయిన్స్ మూల్యాంకనం జరుగుతుందని పేర్కొంది. వైసీపీ హయాంలో 2020, డిసెంబరు 14 నుంచి 20 వరకు మెయిన్స్ పరీక్షలు జరగ్గా 6,807 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. అయితే, కరోనా కారణం చూపుతూ ఏపీపీఎస్సీ మాన్యువల్‌గా కాకుండా డిజిటల్ విధానంలో మూల్యాంకనం చేయించింది. దీనిపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లడంతో నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా(మాన్యువల్) మూల్యాంకనం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

### పీఎస్ఆర్ డిజిటల్.. సవాంగ్ మాన్యువల్..

మూల్యాంకనం చేసే ప్రొఫెసర్లకు ఏర్పాట్లు, ఇతర సిబ్బందికి కామ్‌సైన్ అనే కంపెనీకి రూ.1.14 కోట్లు చెల్లించారు. 2021, డిసెంబరులో ప్రారంభించిన మూల్యాంకనానికి హాయ్‌ల్యాండ్‌లో 26 రోజుల హాల్ అద్దె, సిబ్బందికి భోజనాలు, ఇతర అవసరాలు అంటూ రూ.20.06 లక్షలు చెల్లించారు. ఓఎంఆర్ షీట్లు, డిజైన్ కోసం మరో కంపెనీకి కూడా నిధులు విడుదల చేశారు. హాయ్‌ల్యాండ్‌లో జవాబుపత్రాలకు భద్రత కోసం కర్నూలు పోలీస్ యూనిట్ నుంచి 15 రోజులకు ఒక బ్యాచ్ చొప్పున 32 మంది సిబ్బందిని నియమించారు. 2021, డిసెంబరు 5 నుంచి 2022, ఫిబ్రవరి 26 వరకు వారు అక్కడే ఉన్నారు. అంతకముందు విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి గుంటూరులోని హాయ్‌ల్యాండ్‌కు జవాబుపత్రాల తరలింపునకు గుంటూరు అర్బన్ ఎస్పీకి పీఎస్ఆర్ ఆంజనేయులు లేఖ రాశారు. అనంతరం ఏపీపీఎస్సీ రెండోసారి మాన్యువల్‌గా జవాబుపత్రాలు మూల్యాంకనం చేయించి తుది ఫలితాలు ప్రకటించింది. రెండోసారి ఏపీపీఎస్సీ కార్యాలయంలోనే మూల్యాంకనం జరిగింది. అంతకంటే ముందే పీఎస్ఆర్ బదిలీ జరిగింది. ఆ తర్వాత ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన గౌతం సవాంగ్ డిజిటల్ మూల్యాంకనాన్ని కట్టుకథగా తోసిపుచ్చారు. మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనం చేసినప్పుడు తమకు అనుకూలంగా ఉండే అభ్యర్థులు ఎంపిక కాలేదనే ఉద్దేశంతో రెండోసారి మూల్యాంకనం చేశారని, ఫలితంగా డిజిటల్ మూల్యాంకనానికి, రెండోసారి మాన్యువల్ మూల్యాంకనానికి మధ్య ఎంపికైన అభ్యర్థుల్లో 62 శాతం వ్యత్యాసం వచ్చిందని అభ్యర్థులు వాదించారు. డిజిటల్ మూల్యాంకనం చేసినప్పుడు ఇంటర్వ్యూలకు 326 మందిని ఎంపిక చేయగా, వారిలో 202 మంది రెండోసారి మాన్యువల్ మూల్యాంకనంలో అనర్హులయ్యారు.

**అక్రమాల అంజన్న**

అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో అంజన్నగా పిలిపించుకున్న పీఎస్ఆర్ ఆంజనేయులు అన్నీ తానై వ్యవహరించి.. డిజిటల్ మూల్యాంకనంపై నిర్ణయం తీసుకున్నారు. నిబంధనల ప్రకారం ఏ పోటీ పరీక్షల మూల్యాంకనం అయినా ఏపీపీఎస్సీ కార్యాలయంలోనే జరగాలి. కానీ, దానికి విరుద్ధంగా వ్యవహరించిన పీఎస్ఆర్ ప్రైవేటు రిసార్ట్స్‌కు జవాబుపత్రాలను తరలించారు. పైగా ఏర్పాట్ల కోసం రూ.1.14 కోట్లు చెల్లించారు. అసలు ప్రైవేటుకు ఎందుకు వెళ్లారనే కోణంలోనే ఇప్పుడు పీఎస్ఆర్‌పై నమోదైన కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలకు మేలు చేయడం కోసమే మూల్యాంకనాన్ని అక్కడికి మార్చారా? కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం కోసం చేశారా? అనే రహస్యాన్ని తేల్చేపనిలో నిమగ్నమయ్యారు.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## టైటిల్ వీడియోకు సెన్సార్ అనుమతి




భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రామాయణ' సినిమాకు సంబంధించి ఓ కీలక అడుగు పడింది. సాయిపల్లవి, రణబీర్ కపూర్ సీతారాములుగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ వీడియోకు సెన్సార్ బోర్డ్ ఆమోద ముద్ర వేసింది. రెండు నిముషాల 36 సెకండ్లు ఉన్న ఈ వీడియోకు యు సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'రామాయణ' చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభించడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. విమర్శలకు తావు లేకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో చిత్రాన్ని తీస్తున్నామనీ, విజువల్ వండర్‌గా ప్రేక్షకులను 'రామాయణ' అలరిస్తుందనే నమ్మకం ఉందని నితీశ్ తివారీ పేర్కొన్నారు.



## తమిళంలోకి ఎంట్రీ!

స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా కథాంశంతో తమిళ నిర్మాత ఎల్రెడ్ కుమార్ నిర్మించే కొత్త తమిళ చిత్రం 'మండాడి'. ప్రధాన పాత్రలో సూరి నటించనున్నారు. తెలుగు నటుడు సుహాస్ ఈ చిత్రంతోనే తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. సినిమాలో ఆయన ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. సూరి, సుహాస్ మధ్య వచ్చే సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించే ఈ సినిమాకు 'సెల్ఫీ' చిత్ర దర్శకుడు మతిమారన్ పుహళేంది దర్శకత్వం వహించనున్నారు. అన్ని భాషల్లోనూ ఆకట్టుకొనే విధంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్‌ను, సుహాస్ ఫస్ట్ లుక్‌ను నిర్మాత విడుదల చేశారు.

## కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రం



కార్తీక్ రాజు

'నిను వీడని నీడను నేనే' ఫేమ్ కార్తీక్ రాజు తెరకెక్కించిన చిత్రం 'హ్యాష్‌ట్యాగ్ సింగిల్'. శ్రీవిష్ణు హీరోగా గీతాఆర్ట్స్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించారు. ఇవానా, కేతిక శర్మ కథానాయికలు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 9న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కార్తీక్ మీడియాతో ముచ్చటించారు. "ఈ కథను శ్రీవిష్ణుకి చెప్పగానే.. 'బాగుంది తప్పకుండా చేద్దాం' అన్నారు. సినిమా ఆయన బాడీలాంగ్వేజ్‌కు తగ్గట్లుగా ఉంటుంది. ఆయన నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఆద్యంతం వినోదంతో సాగిపోయే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులనూ అలరిస్తుంది. వెన్నెల కిషోర్ పాత్ర సినిమాలో కీలకం. శ్రీవిష్ణు, వెన్నెల కిషోర్ మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలకి ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటారు. ఇవానా, కేతిక పాత్రలకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. శ్రీవిష్ణు అద్భుతమైన నటుడు. ఆయన టైమింగ్ చాలా బాగుంటుంది. ఆయన నటన సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. విశాల్ చంద్రశేఖర్ ఇచ్చిన సంగీతం ప్రధానాకర్షణ. వినోదంతో పాటూ మంచి భావోద్వేగాలూ ఉన్నాయి. కుటుంబసమేతంగా చూడదగ్గ ఈ చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.



## విగ్రహావిష్కరణకు ముహూర్తం

లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో ఈ నెల 9న రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొనడానికి లండన్ బయల్దేరారు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, రామ్‌చరణ్, ఉపాసన, క్లీంకార. ఈ విగ్రహంలో రామ్‌చరణ్‌తో పాటు తన పెంపుడు కుక్క రైమీ కూడా ఉండనుంది. ఆవిష్కరణ అనంతరం ఈ విగ్రహాన్ని సింగపూర్‌కు తరలించనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే మేడమ్ టుస్సాడ్స్‌లో అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్, మహేశ్, ప్రభాస్, అల్లు అర్జున్, ఐశ్వర్యా రాయ్ తదితరుల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

## ఆ ఉద్దేశంతోనే నిర్మాతగా మారా



సమంత

"నేను వైజాగ్ వస్తే, ప్రతీ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతోంది. ఇక్కడి అభిమానుల్ని చూశాకే నాకు నిజమైన ప్రేమ అంటే ఏంటో అర్థమైంది. దర్శకుడు ప్రవీణ్ ఎనర్జీ చూసి అంతా మర్చిపోయాను" అని అన్నారు సమంత. ఆమె నిర్మాతగా మారి రూపొందించిన తొలి చిత్రం 'శుభం'. హర్షిత్ రెడ్డి, శ్రీనివాస్ గవిరెడ్డి, చరణ్ పెరి, షాలినీ కొండెపూడి ప్రధాన పాత్రల్లో ప్రవీణ్ కండ్రీగుల తెరకెక్కించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా వైజాగ్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ "నిర్మాతగా ఓ కొత్త ఆలోచనతో ఈ చిత్రాన్ని ప్రారంభించాను. కొత్తవారితో కొత్తకథల్ని నిర్మించి ప్రేక్షకులను అలరించడమే ఉద్దేశంగా 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'ను మొదలుపెట్టాను. థియేటర్‌లో సినిమాను చూసిన ప్రతీ ఒక్కరూ నవ్వుతూ బయటకి వస్తారు" అని చెప్పారు. "సినిమా అద్భుతంగా ఉంటుంది. ఇంతవరకూ తెలుగులో ఇలాంటి కంటెంట్‌తో సినిమా రాలేదు. సమంత లేకపోతే 'శుభం' ఇంతవరకూ వచ్చి ఉండేది కాదు" అని దర్శకుడు ప్రవీణ్ కండ్రీగుల తెలిపారు. "నిర్మాతగా సమంత ఎంతో ప్యాషన్‌తో తీసిన సినిమా ఇది. తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుంది" అని హర్షిత్ రెడ్డి అన్నారు. "ఇది అందర్నీ మెప్పించే హారర్ కామెడీ" అని చరణ్ పెరి చెప్పారు. "సమంత ధైర్యం చేసి నిర్మించిన ఈ చిత్రం ద్వారా ఎంతో మంది వెండితెరకు పరిచయమవ్వడం శుభపరిణామం" అని శ్రీనివాస్ గవిరెడ్డి తెలిపారు.

## అమెరికాలో మన సినిమాలకు దెబ్బ

- వంద శాతం సుంకాల విధింపు
- తక్షణ అమలుకు ట్రంప్ ఆదేశాలు
- సినీ రంగానికి నష్టమన్న నిపుణులు
- భారత్‌పై తీవ్ర ప్రభావం పడే చాన్స్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా విదేశీ సినిమాలపై కొరడా ఝుళిపించారు. అమెరికాలో నిర్మించని సినిమాలపై 100 శాతం సుంకాలను విధించనున్నట్టు పేర్కొన్నారు. హాలీవుడ్ ప్రస్తుతం సంక్షోభంలో ఉందని.. నానాటికీ ఇబ్బందుల్లో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన.. "అమెరికా సినీ పరిశ్రమ అత్యంత వేగంగా మరణానికి చేరువ అవుతోంది" అని సంచలన వ్యాఖ్య చేశారు.

"విదేశీ గడ్డపై నిర్మించిన సినిమాలకు తక్షణమే 100 శాతం సుంకాలు విధించాలని నిర్ణయించా. వాణిజ్య విభాగం, వ్యాపార ప్రతినిధులు తగు విధంగా చర్యలు తీసుకోవాలి. అన్ని సినిమాలకూ ఇది వర్తిస్తుంది. మనం కోరుకునేది.. అమెరికాలోనే మళ్లీ సినిమా నిర్మాణాలు జరగాలి" అంటూ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు.

### కొరవడిన స్పష్టత

అమెరికాలో విడుదల చేసే విదేశీ చిత్రాలకే ఈ టారిఫ్‌లు అమలు చేస్తారా? లేక విదేశాల్లో నిర్మించే అమెరికా సినిమాలపైనే వేస్తారా అన్నదానిపై స్పష్టత కొరవడింది. అయితే హాలీవుడ్ వెలుపల షూటింగ్ చేసే సినిమాలకు, టెలివిజన్ కార్యక్రమాలకు కొన్ని నగరాలు భారీ ఎత్తున పన్ను మినహాయింపులు కల్పిస్తున్నాయి. దీంతో ఇటీవల చాలా నిర్మాణ సంస్థలు తమ కార్యకలాపాలను హాలీవుడ్ నుంచి టొరంటో(కెనడా), డబ్లిన్(ఐర్లాండ్) వంటి నగరాలకు తరలించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా నిర్ణయం తీసుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసోమ్ స్పందిస్తూ.. తమ రాష్ట్రంలో సినిమాలు తీసేవారికి భారీ పన్ను రాయితీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

### భారత్‌పై తీవ్ర ప్రభావం

అమెరికాలో మన సినిమాలకు మంచి క్రేజీ ఉంటుంది. చాలా సినిమాలను భారత్‌లో కంటే ఒక రోజు ముందుగానే అక్కడ విడుదల చేస్తారు. రాజమౌళి తెరకెక్కించిన ఆర్ఆర్ఆర్‌తో పాటు బాలీవుడ్‌కి చెందిన డుంకీ, జవాన్ చిత్రాలు ఇక్కడ భారీ వసూళ్లు రాబట్టాయి. ఇటీవలె విడుదలైన 'ఛావా' కేవలం రెండు వారాల్లో 5 మిలియన్ డాలర్ల కలెక్షన్స్ సాధించింది. దీన్ని బట్టి అమెరికాలో మన సినిమాల పట్ల ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదని అర్థమవుతోంది. "బాలీవుడ్ సినిమా అయినా టాలీవుడ్ చిత్రమైనా ఓవర్సీస్ కలెక్షన్లపైనే ఆధారపడే రోజులివి. ఇప్పుడు వంద శాతం సుంకాలు అమలైతే భారతీయ చలన చిత్రపరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది" అని ఓ తెలుగు నిర్మాత ఆందోళన వ్యక్తం చేశారు. ఉదాహరణకు బయ్యర్ ఓ భారతీయ సినిమాను ఒక మిలియన్ డాలర్లకు కొన్నాడనుకుందాం. వంద శాతం సుంకాలు అమల్లోకి వస్తే సదరు బయ్యర్ మరో మిలియన్ డాలర్లు అక్కడి ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుంది. ఇది బయ్యర్‌కు భారమవుతుంది. ఆ భారాన్ని ప్రేక్షకులపై వేస్తాడు. ప్రస్తుతం అమెరికాలో భారతీయులు ఎక్కువగా నివసిస్తున్న రాష్ట్రాల్లో టిక్కెట్ రేట్లు 14 డాలర్ల నుంచి 20 డాలర్ల మధ్య ఉన్నాయి.. వంద శాతం సుంకాలు గనుక అమల్లోకి వస్తే అప్పుడు 14 డాలర్లుగా ఉన్న టిక్కెట్ రేటును 28 డాలర్లకు పెంచక తప్పదు. స్థానిక పన్నుల్ని కూడా కలిపితే కనీస టిక్కెట్ రేటు 30 డాలర్లకు చేరుకుంటుంది. అప్పుడు 30 డాలర్ల టిక్కెట్‌పై స్థానిక పన్నులు, డిస్ట్రిబ్యూటర్ షేర్, థియేటర్ ఓనర్ షేరు పోగా నిర్మాతకు 15 డాలర్లు(50 శాతం) మిగులుతాయి అదే వంద శాతం ట్యాక్స్ అమల్లోకి వస్తే కేవలం 5 నుంచి 10 డాలర్లు మాత్రమే మిగులుతాయి. అంటే ఆదాయం సగానికి పడిపోతుందన్నమాట. తెలుగు సినిమానే ఉదాహరణగా తీసుకుంటే మన నైజాం ఏరియాలో ఓ సూపర్ డూపర్ హిట్ సినిమాకు ఎంత ఆదాయం వస్తుందో దాదాపుగా అంతే ఆదాయం అమెరికాలో షోల ద్వారా నిర్మాతలకు లభిస్తోంది. 'ట్రంప్ తాజా నిర్ణయంపై వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుంది. ఎందుకంటే గత ముప్పై, నలభై రోజులుగా ఆయన తీసుకుంటున్న అనేక నిర్ణయాలు పలు మార్పులు చేర్పులకు గురయ్యాయి. ఇదీ అంతే అని అనుకుంటున్నాను. ఒక వేళ అమల్లోకి వస్తే అమెరికాలో థియేట్రికల్ బిజినెస్ కుప్పకూలే ప్రమాదముంది' అని ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శిబాసిస్ సర్కార్ వ్యాఖ్యానించారు. కాగా, ట్రంప్ నిర్ణయం వల్ల హీరోల రెమ్యూనరేషన్లు, సినిమాల బడ్జెట్లు కూడా తగ్గే అవకాశం ఉంది.

**చైనా ఇప్పటికే..**

కరోనా అనంతరం అమెరికా చిత్ర రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సినిమాలు తీసేవారు తగ్గిపోగా.. థియేటర్‌కు వచ్చి వీక్షించే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. దీనికితోడు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు ప్రజలు అలవాటు పడ్డారు. దీంతో థియేటర్లు బోసిపోతున్నాయి. ఇక, దీనికితోడు ట్రంప్ అమలు చేస్తున్న వాణిజ్య విధానాలు కూడా సినీ రంగంపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. కాగా, చైనా నెల రోజుల కిందటే అమెరికా సినిమాలపై చర్యలు ప్రారంభించింది. తక్కువ సంఖ్యలోనే అగ్రరాజ్యానికి చెందిన సినిమాలను చైనాలో ప్రదర్శిస్తున్నారు. చైనా మీద కోపంతోనే ట్రంప్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడనే టాక్ ఫిల్మ్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది.

### బయ్యర్లలో భయాందోళనలు

ట్రంప్ తాజా ప్రకటనతో ఓవర్సీస్ బయ్యర్లలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే చేసుకొన్న ముందస్తు ఒప్పందాల కారణంగా వారు తీవ్రంగా నష్టపోతారు. హరిహర వీరమల్లు, కింగ్‌డమ్, కుబేర, వార్-2, విశ్వంభర వంటి భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. వీటిలో చాలా సినిమాలకు యూఎస్‌లో డిస్ట్రిబ్యూషన్ బిజినెస్ కూడా ఖరారైంది "ట్రంప్ అసంబద్ధ నిర్ణయాలతో ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న భారత చలన చిత్ర రంగం ఒక్కసారిగా కుప్పకూలుతుంది. దీనిని ఎవరూ రక్షించలేరు." అని నిర్మాత వివేక్ అగ్నిహోత్రి వ్యాఖ్యానించారు.

# రైజర్స్ ఆశలపై 'నీళ్లు'




**వర్షంతో మ్యాచ్ రద్దు**

**ప్లేఆఫ్స్ రేసు నుంచి హైదరాబాద్ అవుట్**

**ఢిల్లీ 133/7**

**హైదరాబాద్:** ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులో సాంకేతికంగానే ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇప్పుడా అవకాశం కూడా లేకుండా పోయింది. సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో కేవలం ఏడు పాయింట్లతో ఉన్న రైజర్స్ అధికారికంగానే నిష్క్రమించింది. మరోవైపు ఈ వర్షం ఢిల్లీ పాలిట వరంగా మారింది. ఆ జట్టు 13 పాయింట్లతో తమ చాన్స్‌ను మరింత మెరుగుపర్చుకుంది. సరిగ్గా ఢిల్లీ ఇన్నింగ్స్ పూర్తయ్యాక దాదాపు గంటన్నర పాటు కురిసిన వర్షంతో మైదానం పూర్తి చిత్తడిగా మారింది. వర్షం తగ్గినా అక్కడక్కడా నీటి గుంటలు ఏర్పడడంతో ఐదు ఓవర్ల మ్యాచ్ కూడా వీలు పడలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో ఇరు జట్లకు ఒక్కో పాయింట్‌ను కేటాయించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని రైజర్స్ బౌలర్లు వణికించారు. దీంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 133 పరుగులు చేసింది. అశుతోష్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 41), స్టబ్స్ (36 బంతుల్లో 4 ఫోర్లతో 41) రాణించారు. కమిన్స్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత వర్షం కారణంగా సన్‌రైజర్స్ బరిలోకి దిగలేకపోయింది.

**పేకమేడను తలపించేలా...**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. గతంలో ఇదే పిచ్‌పై రైజర్స్ 190 రన్స్ చేయగా.. లఖ్‌నవూ 16 ఓవర్లలోపే బాదేసింది. ఈసారి కూడా అలవోకగా 200 పరుగులు వస్తాయని క్రీడా విశ్లేషకులు అంచనా వేశారు. కానీ రైజర్స్ పేసర్లు అద్భుతమే చేశారు. టపటపా వికెట్లు తీయడంతో ఒక్కో పరుగు సాధించేందుకు డీసీ అష్టకష్టాలు పడింది. స్టబ్స్-అశుతోష్ ఏడో వికెట్‌కు 66 పరుగులు జోడించడంతో కాస్త గౌరవప్రదమైన స్కోరందుకుంది. కెప్టెన్ కమిన్స్ ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ కరుణ్ (0)ను అవుట్ చేసి షాకిచ్చాడు. ఆ తర్వాత తన వరుస ఓవర్లలో డుప్లెసి (3), పోరెల్ (8)లను వెనక్కి పంపాడు. ఈ ముగ్గురి క్యాచ్‌లను కీపర్ ఇషాన్ పట్టేయడం విశేషం. ఇక ఆరో ఓవర్‌లో అక్షర్ (6)ను హర్షల్ దెబ్బ తీయగా, పవర్‌ప్లేలో జట్టు 26/4 స్కోరుతో అత్యంత ఇబ్బందికర పరిస్థితిలో నిలిచింది. ఫామ్‌లో ఉన్న రాహుల్ (10) కూడా మరో మూడు పరుగులకే పెవిలియన్‌కు చేరడంతో ఢిల్లీ కనీసం వంద పరుగులైనా చేయగలుగుతుందా? అనే సందేహం నెలకొంది. విప్రజ్ (18) ధాటిగా ఆడినా 13వ ఓవర్‌లో రనౌటయ్యాడు. ఈదశలో స్టబ్స్-అశుతోష్ జోడీ క్రీజులో నిలిచి పరువు కాపాడే ప్రయత్నం చేశారు. 15వ ఓవర్‌లో అశుతోష్ రెండు సిక్సర్లతో 14 రన్స్ సమకూరాయి. అలాగే హర్షల్ ఓవర్‌లోనూ రెండు వరుస ఫోర్లతో స్కోరును వంద దాటించాడు. అటు స్టబ్స్ కూడా 18వ ఓవర్‌లో రెండు ఫోర్లతో సహకరించాడు. కానీ చివరి రెండు ఓవర్లలో 18 పరుగులే చేసిన డీసీ అశుతోష్ వికెట్‌ను కోల్పోవడంతో స్వల్ప స్కోరుకే పరిమితమైంది.




**స్కోరుబోర్డు**

**ఢిల్లీ:** కరుణ్ నాయర్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 0, డుప్లెసి (సి) ఇషాన్ (బి) కమిన్స్ 3, అభిషేక్ పోరెల్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 8, కేఎల్ రాహుల్ (సి) ఇషాన్ (బి) ఉనాద్కట్ 10, అక్షర్ (సి) కమిన్స్ (బి) హర్షల్ 6, స్టబ్స్ (నాటౌట్) 41, విప్రజ్ (రనౌట్) 18, అశుతోష్ (సి) మనోహర్ (బి) మలింగ 41, స్టార్క్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 20 ఓవర్లలో 133/7; వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-15, 4-26, 5-29, 6-62, 7-128; **బౌలింగ్:** కమిన్స్ 4-0-19-3, ఉనాద్కట్ 4-0-13-1, హర్షల్ 4-0-36-1, మలింగ 4-0-28-1, జీషన్ 3-0-30-0, అభిషేక్ శర్మ 1-0-5-0.

## నేటి మ్యాచ్

వేదిక ముంబై

**ముంబై x గుజరాత్** రా.7.30 నుంచి

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 8 | 3 | 0 | 16 | 0.482 |
| పంజాబ్ | 11 | 7 | 3 | 1 | 15 | 0.376 |
| ముంబై | 11 | 7 | 4 | 0 | 14 | 1.274 |
| గుజరాత్ | 10 | 7 | 3 | 0 | 14 | 0.867 |
| ఢిల్లీ | 11 | 6 | 4 | 1 | 13 | 0.362 |
| కోల్‌కతా | 11 | 5 | 5 | 1 | 11 | 0.249 |
| లఖ్‌నవూ | 11 | 5 | 6 | 0 | 10 | -0.469 |
| హైదరాబాద్ | 11 | 3 | 7 | 1 | 7 | -1.192 |
| రాజస్థాన్ | 12 | 3 | 9 | 0 | 6 | -0.718 |
| చెన్నై | 11 | 2 | 9 | 0 | 4 | -1.117 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

## చెన్నై జట్టులో ఉర్విల్ పటేల్

**రైజర్స్‌కు హర్ష్ దూబే**

**న్యూఢిల్లీ:** గాయపడిన వంశ్ బేడీ స్థానంలో గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్‌ను జట్టులోకి తీసుకున్నట్టు చెన్నై సూపర్ కింగ్స్ ప్రకటించింది. టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ (28 బంతుల్లో) చేసిన రెండో క్రికెటర్‌గా ఈ 26 ఏళ్ల కీపర్ రికార్డులకెక్కాడు. మరోవైపు సన్‌రైజర్స్ జట్టులోకి స్మరణ్ రవిచంద్రన్ స్థానంలో ఆల్‌రౌండర్ హర్ష్ దూబే వచ్చాడు.

## షమికి బెదిరింపు



**అమ్రోహా (యూపీ):** భారత పేసర్ మహ్మద్ షమిని చంపుతామంటూ ఓ వ్యక్తి ఈ-మెయిల్ ద్వారా బెదిరించాడు. దాంతో షమి సోదరుడు హసీబ్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బెదిరించిన వ్యక్తిని రాజ్‌పుత్ సిందర్‌గా గుర్తించారు. కోటి రూపాయలు ఇవ్వాలని.. లేదంటే షమిని చంపుతామని రాజ్‌పుత్ బెదిరించాడు.

## స్విమ్మింగ్‌లో సంపత్‌కు కాంస్యం



ఖేలో ఇండియా యూత్ గేమ్స్

**గయ (బిహార్):** ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు స్విమ్మర్ సంపత్‌కుమార్ యాదవ్ కాంస్య పతకంతో సత్తా చాటాడు. బాలుర 200 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్ 1:55.89 సెకన్లలో గమ్యాన్ని చేరి మూడోస్థానంలో నిలిచాడు. కేరళ స్విమ్మర్ అభినవ్‌కు స్వర్ణం, కర్ణాటకకు చెందిన దక్షణ్‌కు రజత పతకాలు దక్కాయి.

## మన ఆధిపత్యానికి తిరుగులేదు!

**వన్డేలు, టీ20లలో టాప్ ర్యాంక్**

- టెస్ట్‌ల్లో నాలుగో స్థానం
- ఐసీసీ వార్షిక ర్యాంకింగ్స్

**దుబాయ్:** తెల్ల బంతుల ఫార్మాట్‌లో తనకు తిరుగులేదని భారత్ నిరూపించుకుంది. అయితే టెస్ట్‌ల్లో మాత్రం ఒకింత వెనుకంజలో నిలిచింది. ఈమేరకు ఐసీసీ సోమవారం ప్రకటించిన వార్షిక ర్యాంకింగ్స్‌లో..టీమిండియా వన్డేలు, టీ20ల్లో అగ్రస్థానాన్ని కాపాడుకుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రం నాలుగో ర్యాంక్ దక్కించుకుంది. పురుషుల తాజా ర్యాంకింగ్స్‌లో..2024 మే నుంచి ఆడిన అన్ని మ్యాచ్‌లనుంచి 100 శాతం పాయింట్లను పరిగణనలోకి తీసుకున్నారు. అంతకుముందు రెండు సంవత్సరాలలో ఆడిన మ్యాచ్‌లనుంచి 50 శాతం పాయింట్లనే తీసుకున్నారు.

**వన్డేలు:** భారత్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. దాంతో జట్టు రేటింగ్ పాయింట్లు 122 నుంచి 124కు పెరిగాయి. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. శ్రీలంక, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా తర్వాతి ర్యాంకులు సాధించాయి. ఇంగ్లండ్‌ను వెనక్కు నెట్టిన అఫ్ఘానిస్థాన్ ఏడో స్థానంలో నిలవడం విశేషం.

**టీ20లు:** ఈ విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ టీమిండియా (271 పాయింట్లు) నెం.1గా నిలిచింది. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (254) వరుసగా రెండు మూడు స్థానాలు దక్కించుకున్నాయి. న్యూజిలాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లకు వరుసగా ఆ తదుపరి ర్యాంక్‌లు లభించాయి.

**టెస్ట్‌లు:** ప్రస్తుత ప్రపంచ టెస్ట్ చాంపియన్ ఆస్ట్రేలియా (126 పాయింట్లు) సుదీర్ఘ ఫార్మాట్‌లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఇంగ్లండ్ (113), దక్షిణాఫ్రికా (111), భారత్ (105) వరుసగా వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంక్‌లలో నిలిచాయి. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, జింబాబ్వే వరుసగా ఆ తదుపరి ర్యాంకులు కైవసం చేసుకున్నాయి.

## ఇండియన్ ఐడల్ నుంచి ఐపీఎల్‌కు..

**అంపైర్ పరాశర్ ఆసక్తికర ప్రయాణం**




**న్యూఢిల్లీ:** ఆటగాడిగా.. పాటగాడిగా.. ఇప్పుడు అంపైర్‌గా పరాశర్ జోషి (30) బహుముఖ ప్రజ్ఞ అద్భుతం. గతేడాది మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అందరి దృష్టినీ ఆకర్షించాడు పరాశర్ (30). కారణం టీమిండియా క్రికెటర్ శ్రేయాస్ అయ్యర్‌ను పోలి ఉండడమే. అయితే, ఈ ఏడాది జోషి ఏకంగా ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. గతనెల 5న చెన్నై-ఢిల్లీ మ్యాచ్‌కు అంపైరింగ్ చేశాడు. చిన్నతనంలో క్లబ్ స్థాయిలో జోషి మ్యాచ్‌లు ఆడాడు. 2008లో ప్రఖ్యాత రియాల్టీ షో ఇండియన్ ఐడల్‌లో పోటీపడ్డాడు. ఈ క్రమంలో పియానో రౌండ్‌కు ఎంపికయ్యాడు. తర్వాత గాయకుడిగా ఎదగడం కష్టంగా మారడంతో మళ్లీ క్రికెట్ వైపు అడుగులు వేశాడు. అయితే, ఈసారి అంపైర్‌గా. 2015లో బీసీసీఐ అంపైరింగ్ ప్యానెల్‌లో చోటు సంపాదించిన జోషి.. రంజీలు, దులీప్ ట్రోఫీ లాంటి దేశవాళీ టోర్నీలకు అంపైరింగ్ చేశాడు. దీంతో గతేడాది డబ్ల్యూపీఎల్‌లో చాన్స్ లభించింది. అక్కడ తన పనితీరుకు మంచి మార్కులు రావడంతో.. ఈ సీజన్ ఐపీఎల్‌లో చోటు దక్కించుకున్నాడు..

## మయామి గ్రాండ్ ప్రీ విజేత ఆస్కార్



**మయామి గార్డెన్ (ఫ్లోరిడా):** మెక్‌లారెన్స్ ఎఫ్-1 డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి.. మయామి గ్రాండ్ ప్రీ విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్స్‌కే చెందిన లాండో నోరిస్ రెండు, మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడు స్థానాలను సొంతం చేసుకొన్నారు. కాగా, పోల్ పొజిషన్ నుంచి రేస్ ఆరంభించిన వరల్డ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు.

## రూడ్‌కు 'మాడ్రిడ్' టైటిల్



**మాడ్రిడ్:** నార్వేకు చెందిన కాస్పెర్ రూడ్ మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ టైటిల్ నెగ్గాడు. ఫైనల్లో రూడ్ 7-5, 3-6, 6-4తో జాక్ డ్రేపర్ (బ్రిటన్)ను ఓడించాడు. తద్వారా కెరీర్‌లో తొలిసారి మాస్టర్స్ 1000 టైటిల్‌ను కాస్పెర్ సొంతం చేసుకున్నాడు.

## శ్రీకాంత్ ఫామ్‌లోకొచ్చేనా?

**తైపీ ఓపెన్ నేటి నుంచి**

**తైపీ:** సుదీర్ఘ కాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న కిడాంబి శ్రీకాంత్‌తోపాటు యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, అనుపమ ఉపాధ్యాయ సత్తా చాటాలనుకొంటున్నారు. మంగళవారం నుంచి జరిగే తైపీ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనపై గురిపెట్టారు. గాయాలతో ఇబ్బంది పడుతున్న శ్రీకాంత్.. తొలి రౌండ్‌లో భారత్‌కే చెందిన శంకర్‌తో తలపడనున్నాడు. తరుణ్, మిరాబా కూడా బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అనుపమ, ఆకర్షి కశ్యప్ పోటీపడనున్నారు.

## లిఫ్టర్ పర్వ్‌కు రెండు పతకాలు



**లిమా (పెరూ):** ఐడబ్ల్యూఎఫ్ యూత్, జూనియర్ ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ లిఫ్టర్ పర్వ్ చౌధరి రెండు పతకాలతో మెరిశాడు. యూత్ బాలుర 96 కిలోల విభాగంలో ఓవరాల్‌గా 315 కిలోలు ఎత్తి మూడోస్థానంతో కాంస్యం అందుకున్నాడు. ఇక, స్నాచ్‌లో 140 కిలోలు ఎత్తిన పర్వ్.. క్లీన్ అండ్ జెర్క్‌లో 175 కిలోలతో రెండోస్థానంలో నిలిచి రజతం దక్కించుకున్నాడు.

# 60 సంవత్సరాల్లో 55,02,284 శాతం

**సీఈఓ పదవికి బఫెట్ గుడ్‌బై**

**గ్రెగ్ అబెల్‌కు కంపెనీ పగ్గాలు**




**బఫెట్ సారథ్యంలో బెర్క్‌షైర్ హ్యాత్‌వే స్టాక్ అందించిన రాబడి**

ఒమాహా (అమెరికా): ప్రపంచ ప్రఖ్యాత స్టాక్ ఇన్వెస్టర్, బెర్క్‌షైర్ హ్యాత్‌వే చైర్మన్, సీఈఓ వారెన్ బఫెట్ ఎట్టకేలకు తన వారసుడిని ప్రకటించారు. ఈ ఏడాది చివరి నాటికి కంపెనీ సారథ్య బాధ్యతలను ప్రస్తుత వైస్ చైర్మన్ గ్రెగ్ అబెల్ చేతుల్లో పెట్టాలనుకుంటున్నట్టు గత శనివారం జరిగిన వాటాదారుల వార్షిక సమావేశం చివర్లో ప్రకటించారు. బఫెట్ సీఈఓ పదవి నుంచి తప్పుకోనున్నప్పటికీ కంపెనీ చైర్మన్‌గా మాత్రం కొనసాగుతారు. బఫెట్ నేతృత్వంలో బెర్క్‌షైర్ జైత్రయాత్ర సాగిందిలా..

- 94 ఏళ్ల బఫెట్.. గత 6 దశాబ్దాలుగా (1964-2024) బెర్క్‌షైర్ హ్యాత్‌వేకు సారథ్యం వహిస్తున్నారు. ఈ 60 వసంతాల్లో బెర్క్‌షైర్ హ్యాత్‌వేను ఓ విఫల టెక్స్‌టైల్ కంపెనీ నుంచి దాదాపు 180 వ్యాపారాల అతి పెద్ద సామ్రాజ్యంగా తీర్చిదిద్దారు. 1.2 లక్షల కోట్ల డాలర్ల (రూ.101 లక్షల కోట్లు) మార్కెట్ క్యాప్‌తో ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా నిలబెట్టారు.
- గడిచిన అరవై ఏళ్లలో కంపెనీ స్టాక్ 55,02,284 శాతం రిటర్నులు పంచింది. అదే సమయంలో అమెరికన్ ఈక్విటీ ఇండెక్స్ 'ఎస్ అండ్ పీ 500' పంచిన రిటర్నులు 39,054 శాతమే. ఈ ఆరు దశాబ్దాల్లో బెర్క్‌షైర్ హ్యాత్‌వే షేరు విలువ ఏటేటా 19.9 శాతం చొప్పున వృద్ధి (సీఏజీఆర్) చెందుతూ వచ్చింది. ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్ 10.4 శాతం సీఏజీఆర్‌తో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు.
- ప్రపంచంలోని అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల జాబితాలో బెర్క్‌షైర్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉంది.
- బెర్క్‌షైర్ గ్రూప్ వ్యాపారాల వార్షిక ఆదాయం దాదాపు 40,000 కోట్ల డాలర్ల (రూ.33.72 లక్షల కోట్లు) స్థాయికి చేరుకుంది.
- ఈ మార్చి 31 నాటికి కంపెనీ వద్ద ఉన్న నగదు నిల్వలు 34,770 కోట్ల డాలర్లకు (రూ.29.31 లక్షల కోట్ల పైమాటే) పెరిగాయి. అంతేకాదు, ప్రస్తుతం చలామణిలో ఉన్న యూఎస్ ట్రెజరీ బిల్లుల్లో 5 శాతం కంపెనీ చేతుల్లో ఉన్నాయి.
- గత ఏడాది చివరినాటికి కంపెనీలో 3.92 లక్షలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

## మహీంద్రా లాభంలో 13.5% వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.3,541.85 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.3,124.94 కోట్లతో పోల్చితే లాభం 13.34 శాతం పెరిగింది. ఆటో, వ్యవసాయ పరికరాల రంగాలు ప్రదర్శించిన అద్భుత పురోగతి ఇందుకు కారణం. కాగా ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.35,373.34 కోట్ల నుంచి రూ.42,585.67 కోట్లకు చేరింది. ఆటో విభాగంలో అమ్మకాలు 18 శాతం పెరిగి 2.53 లక్షల యూనిట్లకు చేరాయని ఆటోమోటివ్, వ్యవసాయ పరికరాల విభాగం సీఈఓ రాజేష్ జెజూరికర్ తెలిపారు. ఆదాయంలో ఎస్‌యూవీ అమ్మకాల వాటా 3.10 శాతం, ఎల్‌సీవీల వాటా 4.80 శాతం పెరిగినట్టు చెప్పారు. ట్రాక్టర్ల విభాగంలో జీవితకాల గరిష్ఠ స్థాయిలో 41.2 శాతంమార్కెట్ వాటా సాధించామన్నారు. మొత్తం త్రైమాసిక వ్యయాలు రూ.39,113.61 కోట్లుగా నమోదయ్యాయని తెలిపారు. త్రైమాసికంలో మొత్తం 2,53,028 వాహనాలు విక్రయించినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా మార్చి 31వ తేదీతో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,58,749.75 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.14,073.17 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించినట్టు గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అమర్‌జ్యోతి బారువా చెప్పారు. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఒక్కో షేరుపై రూ.25.30 తుది డివిడెండును ప్రకటించింది.

**కార్ల తయారీకి కొత్త ప్లాంట్:** ప్రయాణికుల వాహనాల తయారీ కోసం కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. 2028 మార్చి నాటికి ఈ ప్లాంట్ పని ప్రారంభిస్తుందని జెజూరికర్ తెలిపారు. అది పూర్తిగా భవిష్యత్ దృక్పథంతో, అధునాతన టెక్నాలజీలతో నిర్మించే అతి పెద్ద ప్లాంట్ అని ఆయన చెప్పారు. ప్రస్తుతానికి ఆ ప్లాంట్‌ను ప్రయాణికుల వాహనాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని వాహనాల తయారీకి కూడా అవకాశాలు కల్పించే అంశం పరిశీలించవచ్చునని ఆయన తెలిపారు. ఏ ప్రాంతంలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నది ఇంకా నిర్ణయించలేదని, ఇందు కోసం వివిధ రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న పెట్టుబడి సబ్సిడీలు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామని ఆయన వెల్లడించారు. అయితే ఇందుకు అవసరం అయిన నిధులను మాత్రం పెట్టుబడి వ్యయాల్లో కేటాయించామని ఆయన తెలిపారు.

### ఐఎంఎఫ్ బోర్డులో భారత ప్రతినిధిగా అయ్యర్

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్‌ను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) బోర్డులో భారత్ తరఫున డైరెక్టర్‌గా ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ఐఎంఎఫ్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను ఆకస్మికంగా తప్పించిన ప్రభుత్వం.. ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ నియామకం జరిపింది. ఈ నెల 9న ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశమవుతున్న నేపథ్యంలో ఈ నియామకం ఆవశ్యకమైంది. ఎందుకంటే, ఆర్థికంగా దివాలా తీసిన పాకిస్థాన్‌కు 700 కోట్ల డాలర్ల ఉద్దీపన ప్యాకేజీపై ఐఎంఎఫ్ బోర్డు ఈ భేటీలోనే సమీక్ష జరపనుంది.

### ఆర్‌బీఐ వద్ద 880 టన్నుల పసిడి

ముంబై: ఆర్‌బీఐ కూడా పెద్ద ఎత్తున పసిడి కొనుగోలు చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 57 టన్నుల పసిడి కొనుగోలు చేసింది. గత ఏడేళ్లలో ఆర్‌బీఐ ఎన్నడూ ఇంత పెద్ద మొత్తంలో పసిడి కొనుగోలు చేయలేదు. ఇందులో 25 టన్నులు 2024 సెప్టెంబరు-2025-మార్చి మధ్య కొనుగోలు చేసింది. దీంతో గత నెలాఖరు నాటికి ఆర్‌బీఐ వద్ద ఉన్న పసిడి నిల్వలు 879.59 టన్నులకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 24.86 టన్నులు ఎక్కువ. దీంతో ఆర్‌బీఐ మొత్తం విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో పసిడి వాటా గత నెలాఖరుకు 11.70 శాతానికి చేరింది.

## క్రూడ్ డౌన్.. మార్కెట్ అప్

- 60 డాలర్ల దిగువకు ముడిచమురు
- 295 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్




ముంబై: ఈక్విటీ సూచీలు సోమవారం 4 నెలల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 60 డాలర్ల కన్నా దిగి రావడం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఒకదశలో 547.04 పాయింట్ల లాభంతో 81,049.03 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 294.85 పాయింట్ల వృద్ధితో 80,796.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114.45 పాయింట్లు బలపడి 24,461.15 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో సూచీలకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు కొనసాగడం కూడా మార్కెట్ లాభాలకు దోహదపడింది.

**ఆయిల్ షేర్ల హైజంప్ :** ముడిచమురు ధరలు బాగా తగ్గడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్లు మంచి లాభాలను నమోదు చేశాయి. హెచ్‌పీసీఎల్ 6.65 శాతం, ఐఓసీ 3.66 శాతం, బీపీసీఎల్ 3.25 శాతం పెరిగాయి. జూన్‌లో చమురు ఉత్పత్తిని మరింత పెంచనున్నట్లు సౌదీ అరేబియా నేతృత్వంలోని పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్+) ప్రకటించడంతో క్రూడాయిల్ ధర 60 డాలర్ల కన్నా దిగువకు తగ్గింది.

**అదానీ షేర్లు జూమ్**

అదానీ గ్రీన్ ఎనర్జీ నుంచి సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఏపీ సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు రూ.2,200 కోట్ల లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై గత ఏడాదిలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా 8 మంది వ్యక్తులపై అమెరికాలో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో నేరారోపణలను రద్దు చేయాలంటూ అదానీ తరఫున ప్రతినిధులు అమెరికా అధికారులను కలిసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ షేరు ఏకంగా 11.01 శాతం ఎగబాకగా.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6.96 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.61 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, అదానీ పవర్ 5.96 శాతం పెరిగాయి. దాంతో గ్రూప్ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13.33 లక్షల కోట్లకు పెరిగింది.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి రూ.84.30 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో లాభాలతోపాటు ముడిచమురు ధరల తగ్గుదల ఇందుకు తోడ్పడ్డాయి.

### షెల్ గూటికి బీపీ?

అంతర్జాతీయ ఇంధన రంగంలో త్వరలోనే మెగా డీల్ కుదిరే అవకాశాలు కన్పిస్తున్నాయి. బ్రిటిష్ ఇంధన దిగ్గజం బీపీ పీఎల్‌సీని కొనుగోలు చేసేందుకు బ్రిటన్‌కు చెందిన మరో ప్రముఖ ఆయిల్ కంపెనీ షెల్ పీఎల్‌సీ ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. మార్కెట్లో ముడిచమురు ధరలతోపాటు బీపీ స్టాక్ మరింతగా తగ్గుముఖం పట్టాక టేకోవర్ చేయాలని షెల్ యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# బిజినెస్


## వడ్డీరేట్లు మరింత కిందికే

**మార్చిలోగా మరో 1.5% కోత..ఎస్‌బీఐ రీసెర్చ్**

న్యూఢిల్లీ: దేశంలో వడ్డీరేట్లు మరింత తగ్గడమే తప్ప, పెరిగే అవకాశం లేదని ఎస్‌బీఐ రీసెర్చ్ తేల్చి చెప్పింది. 2026 మార్చితో ముగిసే వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ కీలక రెపోరేటును 1.25 శాతం నుంచి 1.5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేసింది. గత నెల జరిగిన ఎంపీసీ భేటీలో ఆర్‌బీఐ రెపోరేటును 6.25 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించింది. వచ్చే ఏడాది మార్చిలోగా మరో ఒక శాతం నుంచి 1.25 శాతం తగ్గించే అవకాశం ఉందని 'ద్రవ్యోల్బణం, రేట్ల కోత గమనం' పేరుతో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. జూన్, ఆగస్టుల్లో జరిగే ఎంపీసీ సమావేశాల్లో ముప్పావు శాతం, వచ్చే ఏడాది మార్చిలోగా జరిగే భేటీల్లో మరో అర శాతం రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేసింది.


**కలిసొచ్చే అంశాలు:** ఈ ఆర్థిక సంవత్సరం రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు శాతం మించే అవకాశం లేకపోవడం ఆర్‌బీఐ రెపోరేటు తగ్గింపునకు ప్రధానంగా దోహదం చేయనుంది. మార్చి రిటైల్ ద్రవ్యోల్బణం ఇప్పటికే 67 నెలల కనిష్ఠ స్థాయి 3.34 శాతానికి దిగొచ్చింది. ప్రస్తుత ధరల ప్రకారం జీడీపీ వృద్ధిరేటు సైతం తొమ్మిది నుంచి తొమ్మిదిన్నర శాతం మధ్యన ఉండవచ్చునని అంచనా. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ రేపోరేటును పావు శాతం చొప్పున కాకుండా ఒకేసారి అర శాతం చొప్పున తగ్గిస్తే, ఆర్థిక వ్యవస్థపై ఆ ప్రభావం త్వరగా కనిపిస్తుందని ఎస్‌బీఐ రెసెర్చ్ అంచనా. ఈ సంవత్సరం డాలర్‌తో రూపాయి మారకం రేటు కూడా రూ.85-87 మధ్య స్థిరపడే అవకాశం ఉందని తెలిపింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 6వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 475 | విజయవాడ | 500 |
| వరంగల్ | 477 | గోదావరి | 490 |
| చిత్తూరు | 553 | విశాఖపట్నం | 500 |
| | | దజను గుడ్లు రూ. 66 | |

**ఫామ్‌గేట్ ధర** — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 140 | విజయవాడ | 142 |
| వరంగల్ | 140 | గుంటూరు | 140 |
| కరీంనగర్ | 140 | ఒంగోలు | 140 |
| మహబూబ్‌నగర్ | 140 | చిత్తూరు | 112 |
| కర్నూలు | 140 | నెల్లూరు | 117 |
| విశాఖపట్నం | 141 | అనంతపురం | 117 |
| గోదావరి | 142 | | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 95,730 ▲ | 87,750 ▲ | 1,08,000 ▼ |
| విజయవాడ | 98,300 ▲ | 92,500 ▲ | 96,700 ▲ |
| విశాఖపట్నం | 98,300 ▲ | 87,750 ▲ | 1,08,000 ▼ |
| రాజమండ్రి | 95,730 ▲ | 87,750 ▲ | 96,600 ▲ |
| ప్రొద్దుటూరు | 96,700 ▲ | 88,320 ▲ | 96,000 ▼ |
| ముంబై | 95,280 ▲ | 87,780 ▲ | 94,100 ▼ |

### బీజేపీ నేతలే కౌరవులు

# నేను గాంధారిని కాదు

» మద్దతు ధరపై రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

» రాష్ట్రంలో ఏ పంటకూ మద్దతు ధర లేదు: షర్మిల




అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): 'కేంద్రంలోని బీజేపీతో రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగమూ లేదు. కాదు, ఉపయోగపడిందని ఆ పార్టీ నేతలు నిరూపిస్తే నేను గాంధారినని ఒప్పుకుంటా' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. విజయవాడలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నేను గాంధారిని కాదు... బీజేపీ నేతలే కౌరవులు అంటూ ఆమె ఎదురుదాడి చేశారు. 'మద్దతు ధరపై కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. అకాల వర్షాల వల్ల పంట, ఆస్తి, ప్రాణ నష్టం తీవ్రంగా ఉంది. ఎక్కడ చూసినా తడిచిన ధాన్యమే కనిపిస్తోంది. రాలిపోయిన మామిడి, కూలిన అరటి చెట్లు పొలాల్లో కనిపిస్తున్నాయి. దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈసారి దాదాపు 20 లక్షల టన్నుల ధాన్యం పండింది. కూటమి ప్రభుత్వం 13 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. రైతు సేవా కేంద్రాలను ప్రభుత్వం బొందపెట్టింది. మిల్లర్లు తక్కువ రేటుకు ధాన్యం కొంటున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. రాష్ట్రంలో ఏ పంటకూ ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు' అంటూ ఉదాహరణల సహితంగా షర్మిల విమర్శ చేశారు. ధరల స్థిరీకరణకు రూ.6,000 కోట్లు ఖర్చు చేసినట్లుగా శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ ఒప్పందాలపై అసత్య ప్రచారం

» యాక్సిస్‌తో రాష్ట్రానికి అన్ని విధాలా మేలే: మంత్రి గొట్టిపాటి

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): యాక్సిస్ సంస్థతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై జగన్ పత్రిక అసత్య ప్రచారాలు చేస్తోందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. రాష్ట్ర ప్రజలను జగన్ తప్పుదోవపట్టిస్తున్నారని సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. వైసీపీ హయాంలో యూనిట్ విద్యుత్ కేవలం రూ.2.49కే కొనుగోలు చేశామని జగన్ ప్రచారం చేస్తున్నాడని, అయితే అప్పుడు యూనిట్ రూ.5 కంటే ఎక్కువకే కొన్నారని పేర్కొన్నారు. యాక్సిస్‌తో ఒప్పందం వందశాతం సక్రమమని, దీనిపై వైసీపీ అబద్ధాలాడుతోందని తెలిపారు. యాక్సిస్ కంపెనీ సోలార్‌తోపాటు బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టునూ నిర్వహిస్తుందని.. దీని ద్వారా ప్రజావసరాల మేరకు మాత్రమే విద్యుత్‌ను కొనుగోలు చేస్తామని తెలిపారు. యాక్సిస్‌తో ఒప్పందం వల్ల రాష్ట్రానికి అన్నివిధాలా మేలేనన్నారు. విద్యుత్ డిమాండ్ గరిష్ఠస్థాయిలో ఉన్న సమయంలో యూనిట్‌కు రూ.10 వరకూ చెల్లించి కొనాల్సి వస్తోందని, యాక్సిస్‌తో యూనిట్ రూ.4.65కే లభించనుందని తెలిపారు.

## రాజ్యసభ సభ్యుడిగా పాకా ఎన్నిక ఏకగ్రీవం



అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా కూటమి అభ్యర్థి, బీజేపీ తరఫున పోటీ చేసిన పాక వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సోమవారం ఈమేరకు రిటర్నింగ్ అధికారి వనితా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానానికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఒక నామినేషన్ మాత్రమే చెల్లుబాటయ్యింది.

## సైకో సీఎంతో రాష్ట్రం సర్వనాశనం

» పరిశ్రమలను పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టించిన దుర్మార్గుడు జగన్: మంత్రి అనగాని

» టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్: బాలకృష్ణ

హిందూపురం, మే 5(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. జగన్ సృష్టించిన భయానక వాతావరణంవల్ల పరిశ్రమలు పక్క రాష్ట్రానికి వెళ్లిపోయాయి. యువతకు ఉపాధి లేకుండా పోయింది' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం కొల్లకుంట ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో కలసి మంత్రి 230 మందికి పొజిషన్ సర్టిఫికెట్‌లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. 'ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం' అని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ 'టీడీపీ అంటే జవాబుదారీతనం. రాయలసీమ గడ్డ నా అడ్డా. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్' అని వార్నింగ్ ఇచ్చారు.

## లండన్ మార్కెట్‌లో సుజనాకు తీవ్ర గాయం

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ నేత సుజనా చౌదరి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న ఆయన, ఆదివారం లండన్‌లోని ఓ సూపర్ మార్కెట్‌లో కిందపడిపోయారు. ఆయన కుడి భుజం వద్ద ఎముక విరిగింది. సర్జరీ కోసం సుజనాను హైదరాబాద్ తీసుకొస్తున్నారు.

## సహకార సంస్థల్లో అవకతవకలపై విచారణ

» కొణతాల చైర్మన్‌గా ఏడుగురితో సభాసంఘం ఏర్పాటు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్(ఆప్కాబ్), జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)ల్లో 2019-24 మధ్య జరిగిన అవినీతి, అవకతవకలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాల్లో జరిగిన అవినీతిని గత అసెంబ్లీ సమావేశాల్లో పలువురు సభ్యులు ప్రస్తావించారు. దీంతో మార్చి 20న అసెంబ్లీ తీర్మానం మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక హౌస్ కమిటీతో విచారణ జరిపించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏడుగురు సభ్యులతో సభాసంఘాన్ని నియమిస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సభాసంఘం చైర్మన్‌గా కొణతాల రామకృష్ణ వ్యవహరించనున్నారు. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట్రావు, బూర్ల రామాంజనేయులు, ఎన్ అమరనాథ్‌రెడ్డి సభ్యులుగా నియమితులయ్యారు. సభాసంఘం మొదటి సిటింగ్ తేదీ నుంచి ఆరు నెలల్లోగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఎంఎస్ఎంఈలకు 'ట్రెడ్స్'లో చెల్లింపులు

» ఆర్బీఐ ప్లాట్‌ఫాంలోకి ప్రభుత్వరంగ సంస్థలు

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఉత్పత్తులు, సేవలకు ఆలస్యమవుతున్న చెల్లింపుల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్రస్థాయి సంస్థలు, సొసైటీలన్నింటినీ ఆర్బీఐ ఆన్‌లైన్ డిజిటల్ ప్లాట్‌ఫాం.. ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టం (ట్రెడ్స్) పరిధిలోకి తీసుకువస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పురోగతికి దోహదపడుతున్న ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సవాళ్లలో కొనుగోలుదారుల చెల్లింపుల్లో జాప్యం ప్రధానమైనది. నిధులు బ్లాక్ అయిపోతుండటంతో రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఎస్ఎంఈల సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర పరిశ్రమలశాఖ, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు 'ట్రెడ్స్' ప్లాట్‌ఫాంను ఉపయోగించుకోవడానికి గత ఏడాది జూన్‌లో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఎస్ఎంఈల వస్తు, సేవలకు సంబంధించిన బిల్లుల పరిష్కారం కోసం ట్రెడ్స్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వ రంగ, అటానమస్ తదితర సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం రూ.250 కోట్లు, అంతకంటే ఎక్కువ వార్షిక టర్నోవర్ ఉన్న అన్ని కంపెనీలు తప్పనిసరిగా ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో ఉండాలని నిర్దేశించింది. దీంతో ఎంఎస్ఎంఈలకు తక్షణ చెల్లింపులు జరుగుతాయి. ఈ ఆర్థిక లావాదేవీల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. రాష్ట్రంలో ట్రెడ్స్ అమలు కోసం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా పని చేస్తుంది. సకాలంలో ట్రెడ్స్‌లో ఆన్‌బోర్డింగ్ అయ్యేలా శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ప్రపంచస్థాయి నగరంగా అమరావతి



» కార్యరూపం దాలుస్తున్న పలు ప్రాజెక్టులు

» విజయవాడ, విశాఖ మెట్రో రైలుకు చర్యలు

» పీఎం ఈ-బస్ కింద ఏపీకి 750 ఏసీ బస్సులు

» కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ డీజీ వెల్లడి

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ రాజీవ్ జైన్ అన్నారు. ఇప్పటికే వివిధ కేంద్ర పథకాలు, మిషన్‌ల కింద అనేక ప్రాజెక్టులు కార్యరూపం దాలుస్తున్నాయని వివరించారు. సోమవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వం, ఆయా మంత్రిత్వ శాఖలతో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ పథకాల కింద సుమారు 38 కిలోమీటర్ల మేర కొత్త రైలు నెట్‌వర్క్‌తోపాటు విజయవాడ, విశాఖపట్టణాల్లో ప్రతిపాదిత మెట్రో రైలు ప్రాజెక్టుల అమలుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. పీఎం ఈ-బస్ సేవ పథకం కింద సుమారు 750 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించామన్నారు. స్మార్ట్ సిటీస్ మిషన్ కింద అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటికే రూ. 5,701 కోట్ల విలువైన పనులు (84 శాతం కంటే ఎక్కువ) పూర్తయ్యాయని వివరించారు. ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి కింద లబ్ధిదారులకు 103 శాతం రుణాలు పంపిణీ చేసి ఏపీ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధానమంత్రి అవాజ్ యోజన (అర్బన్) పథకం కింద ఏపీలో ఇప్పటికే 3.5 లక్షల ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అటల్ మిషన్ (అమృత్, అమృత్ 2.0) కింద ఏపీలో రూ. 6,200 కోట్ల కంటే ఎక్కువ ప్రతిపాదనలతో కూడిన 367 ప్రాజెక్టుల డీపీఆర్‌కు కేంద్ర ఆమోదం లభించిందని, ఇప్పటికే రూ. 589 కోట్ల నిధులు విడుదలయ్యాయని వివరించారు.

# '95 సీఎం' వచ్చేశారు!

» మంత్రులతో భేటీలకు చంద్రబాబు శ్రీకారం

» ఇక నెలకు 2-3 లంచ్ భేటీలు: ముఖ్యమంత్రి



మోదీ సభ విజయవంతం కావడానికి కృషి చేసిన అధికారుల సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తనలో మళ్లీ 1995నాటి సీఎంను చూస్తారని ఇటీవలి కాలంలో పదేపదే చెబుతూ వస్తున్నారు. ఆ మాటలకు తాజాగా కార్యరూపం ఇచ్చారు. మంత్రులతో లంచ్ భేటీలను ప్రారంభించారు. సోమవారం నలుగురు మంత్రులతో ఈ సమావేశం నిర్వహించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి (దేవదాయ), వంగలపూడి అనిత (హోం), కొండపల్లి శ్రీనివాస్ (ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాలు), వాసంశెట్టి సుభాష్ (కార్మిక, బీమా వైద్య సేవలు) హాజరయ్యారు. వారు ఇన్‌చార్జులుగా ఉన్న జిల్లాలతోపాటు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లోని సమస్యలపైనా వారితో ఆయన చర్చించారు. ముందస్తుగా తెప్పించుకున్న సమాచారంతో వివిధ అంశాలపై మాట్లాడారు. నియోజకవర్గాల్లో టీడీపీ అంతర్గత విభేదాలు.. ఎమ్మెల్యేలు, నేతలకు మధ్య సమన్వయ లోపం.. కూటమి పక్షాల నేతల నడుమ విభేదాలు వంటి అంశాలన్నింటినీ చర్చించారు. సుమారు 2 గంటలపాటు ఈ భేటీ జరిగింది. వాసంశెట్టి సుభాష్ కృష్ణా జిల్లాకు, అనిత విజయనగరం జిల్లాకు, ఆనం ప్రకాశం జిల్లాకు, శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లాకు ఇన్‌చార్జిగా ఉన్న సంగతి తెలిసిందే.

- సుభాష్ తొలిసారి ఎమ్మెల్యే అయినప్పటికీ మంత్రి పదవి ఇవ్వడంతోపాటు కీలకమైన కృష్ణా జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించామని.. ఆయన మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. కృష్ణా జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో ఉన్న అంతర్గత సమస్యలపై వెంటనే దృష్టి పెట్టాలని ఆదేశించారు.
- కొండపల్లి శ్రీనివాస్ ఇన్‌చార్జిగా ఉన్న శ్రీకాకుళం జిల్లా సమస్యలనూ చంద్రబాబు ప్రస్తావించినట్లు సమాచారం. ఆ జిల్లాకు తక్కువ సార్లు వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. కూటమి పక్షాలతో సమన్వయ కమిటీ సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని కొండపల్లిని ప్రశ్నించినట్లు తెలిసింది. అనిత ఇటీవల సింహాచలం చందనోత్సవ దుర్ఘటన సమయంలో చొరవ తీసుకుని అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేయడాన్ని సీఎం ప్రస్తావించి, ఇలాంటి చొరవ మంత్రులందరూ చూపాలని సీఎం వ్యాఖ్యానించినట్లు సమాచారం.

### ఇక తరచూ భేటీలు..

ఇకపై ఇటువంటి లంచ్ భేటీలను తరచూ నిర్వహిస్తానని సీఎం మంత్రులకు స్పష్టం చేసినట్లు సమాచారం. అన్ని మార్గాల నుంచి నివేదికలు తెప్పించుకుంటానని, మంత్రులు కష్టపడితేనే ఎమ్మెల్యేలు కూడా సక్రమ మార్గంలో ఉంటారన్నారు. తప్పనిసరిగా పురోగతి చూపించాలని చెప్పారు. ఎమ్మెల్యేల పనితీరుపై కేడర్ నుంచి ఫిర్యాదులు వస్తే విచారించాలని.. నిజాలుంటే ఎమ్మెల్యేలతో మాట్లాడాలని మంత్రులకు సూచించారు. పరిస్థితి తీవ్రతను బట్టి తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నెలలో కనీసం రెండు మూడు లంచ్ భేటీలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

### మళ్లీ 30 ఏళ్ల తర్వాత..

1995-98 నడుమ చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో సచివాలయంలో ఇలాంటి లంచ్ మీటింగ్‌లు నిర్వహించేవారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తెలుసుకోవడంతోపాటు మంత్రులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి వీటిని వేదికగా ఉపయోగించుకునేవారు. మళ్లీ 30 ఏళ్లకు అదే తరహా భేటీలు ప్రారంభించారు.

### సమన్వయంతో పనిచేశారు

» పునఃప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

» అధికారులను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన అధికారులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం సచివాలయంలో కార్యక్రమంలో భాగస్వాములైన అధికారులతో ఆయన సమావేశమయ్యారు. భవిష్యత్తులో ఇదే తరహాలో సమష్టిగా, సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. సమన్వయం కోసం అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం, విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం ద్వారా సభ సజావుగా సాగిందని అధికారులు సీఎంకి తెలిపారు.

## లిక్కర్ స్కాంలో దిలీప్ త్రిపాత్రాభినయం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. డిస్టిలరీస్‌లో ఎవరెవరు కమీషన్లు ఇచ్చారో రాజ్ కసిరెడ్డికి వివరాలు పంపి.. ఆయన సూచన మేరకు తర్వాతి వారంలో ఆర్డర్లు ఇచ్చేలా డిపోలను సైతం ఎలా మేనేజ్ చేశారు.. ఆ మొత్తాన్ని ఎలా మనీలాండరింగ్ చేశారో సంచలన వివరాలను కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో వివరించింది. రాజ్ కసిరెడ్డి సూచన మేరకు ఎవరెవరికి మద్యం సరఫరా ఆర్డర్లు ఇవ్వాలో.. ఎంత ఇవ్వాలో.. ఎవరికి తిరస్కరించాలో దిలీప్ నిర్ణయించేవారని స్పష్టం చేసింది. 2019-24 మధ్య అమలైన మద్యం కుంభకోణంలో డిస్టిలరీస్ నుంచి కమీషన్లు వసూలు చేసిన బృందానికి దిలీప్ కెప్టెన్‌గా వ్యవహరించారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం ఉత్పత్తి, సరఫరా, అమ్మకాలపై పూర్తి నియంత్రణ పొందేందుకు ప్రభుత్వ అధికారులు, వైసీపీ నేతలు, లిక్కర్ వ్యాపారుల సమ్మతితో ఏర్పడిన లిక్కర్ మాఫియాలో కీలక వ్యక్తి. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్(ఏపీఎస్‌బీసీఎల్)పై పెత్తనం చెలాయించేలా ఒక ముఠాను ఏర్పాటు చేసి నాయకత్వం వహించారు. కమీషన్లు ఇచ్చిన వారికి సరఫరా ఆర్డర్లు, ఇవ్వని వారికి ఛీత్కారాల వెనుక ఉన్నది ఈయనే. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన దిలీప్.. తాను ఏది చెబితే అది వినే రాజ్ కసిరెడ్డి(ఏ-1) నమ్మకాన్ని ఎప్పటికప్పుడు చూరగొంటూ బాగా దగ్గరయ్యారు. కమీషన్ల రూపంలో రూ.కోట్లు వసూలు చేయడమే గాక.. ముడుపులు తీసుకుని ఖరీదైన స్థిరాస్తులు, విదేశీ కార్లు కొనుగోలు చేశారు. మద్యం సరఫరాదారుల నుంచి లంచాలు డీల్ చేయడంలో ఈయన ముం దుండే వారని ఈ కేసులో మూడో నిందితుడైన ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేక అధికారి డీవీ సత్యప్రసాద్ వాంగ్మూలం ఇచ్చారు. బూనేటి చాణక్య(ఏ8), తాటిపర్తి కిరణ్ కుమార్ రెడ్డి(ఏ9)తో కలిసి దిలీప్ డిస్టిలరీల యజమానుల నుంచి కమీషన్లు వసూలు చేసేవారు. సదరు డిస్టిలరీల యజమానులు ఇచ్చిన వాంగ్మూలాల ప్రకారం.. దిలీప్ ఏర్పాటు చేసిన బృందం కమీషన్లను నగదు రూపంలో సేకరించి.. ఆ సొమ్మంతా మూడో కంటికి తెలియకుండా వివిధ మార్గాల్లో ఓ కేంద్రానికి తరలించారు. ఇప్పటి వరకూ తేలిన లిక్కర్ స్కాం విలువ రూ.మూడున్నర వేల కోట్లు. దిలీప్ విదేశాలకు పారిపోయే ప్రయత్నం చేయగా.. చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేశాం. ఈ కుట్రలో ఇతర నిందితులను కూడా అరెస్టు చేయాల్సి ఉంది' అని సిట్ రిపోర్టులో వివరించింది.

# సాయంత్రంలోగా సాయం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో పంట, ప్రాణ నష్టం గురించి అధికారులను అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో పరిస్థితులను కలెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్షసూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజల్ని అప్రమత్తం చేయాలని, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిడుగులు పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్లకు హెచ్చరిక సందేశాలు పంపాలన్నారు. సందేశం వెళ్లని పరిస్థితుల్లో దగ్గరగా ఉన్న అధికారులు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలన్నారు. పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం వర్షాలతో రాష్ట్రంలో 2,224హెక్టార్లలో వరి, మొక్కజొన్న దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 15 మండలాల్లో 1,033 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 641, కాకినాడ జిల్లాలో 530, శ్రీసత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. అలాగే అరటి, బొప్పాయి, మామిడి, తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. పిడుగుపాటుకు తిరుపతి జిల్లాలో నలుగురు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఇద్దరు చొప్పున, ఏలూరు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు చెప్పారు.

### ధాన్యం కొనలేదనే మాట రాకూడదు

రబీ సీజన్‌లో 30లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరభ్‌గౌర్ సీఎంకు వివరించారు. ఇప్పటికే 13లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయాల్సిందేనని గట్టిగా చెప్పారు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ ఒక్క రైతు నుంచి కూడా ధాన్యం కొనలేదన్న మాట రాకూడదని స్పష్టం చేశారు. కాగా, రాబోయే రోజుల్లో కూడా ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం, విపత్తు నిర్వహణ సంస్థ నుంచి ఎప్పటికప్పుడు వాతావరణంపై ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటామని చెప్పారు. కలెక్టర్లందరూ ఇందుకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో విపత్తు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి యంత్రాంగం, సాంకేతికత ఉందని, వీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలకు పలు జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేసిన కృషిని సీఎం అభినందించారు.

### తక్షణమే పంట నష్టం అంచనా: అచ్చెన్న

అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నష్టపోయిన రైతులకు రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా తగిన సూచనలు ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

### తడిసిన ధాన్యాన్ని కొంటాం: మంత్రి మనోహర్

కాకినాడ: రబీలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. గతంలో 16, 17గా ఉన్న తేమ శాతాన్ని 22 శాతం వరకు అనుమతించాలని మిల్లర్లను ఆదేశించామన్నారు. తరుగు ఐదు కిలోల కన్నా ఎక్కువ ఉండకూడదని చెప్పామన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై పౌరసరఫరాల శాఖ రాష్ట్ర అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులు, మిల్లర్లు, రైతులతో ఆయన సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకూ సుమారు 49లక్షల 40వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. దాదాపు 11,400 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో 24 గంటల్లోపే జమ చేశామన్నారు. దీనిపై కొందరు వైసీపీ నేతలు రాద్ధాంతం చేస్తూ.. రైతుల్లో ఇబ్బందికర వాతావరణం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గతంలో వారు ఖరీఫ్, రబీ సీజన్లలో కొనుగోలు చేసింది కేవలం 38 లక్షల టన్నులేనని, కూటమి ప్రభుత్వం దాదాపు 11 లక్షల టన్నులు అదనంగా కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతుండగా.. అకాల వర్షాల వల్ల రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎమ్మెల్యేల సూచనల మేరకు మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలో 1:2 వెసులుబాటు కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు ఉపయోగపడేలా అదనపు టార్గెట్లు కేటాయించామన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు 2.56 లక్షల టన్నులకుగాను అదనంగా మరో రూ.50 లక్షల టన్నులు కేటాయించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన రూ.1,674 కోట్ల బకాయిలను నెల రోజుల్లోనే రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. మిల్లర్లకు పెట్టిన రూ.400 కోట్ల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వమే చెల్లించిందని చెప్పారు.

## ఆర్‌టీఐలో నేనే సర్కార్!

(మొదటి పేజీ తరువాయి)

పడేలా చేశారు. ఆర్‌టీఐ వర్గాల్లో ఇప్పుడిదే చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే...సమాచార కమిషన్ సెక్రటరీగా వీ అంజనేయులును ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీన నియమించింది. ఆర్‌టీఐ వ్యవహారాలపై సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు ఆర్‌టీఐకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. కేసుల విచారణకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ స్టూడియో సిద్ధం చేయాల్సి ఉంది. వీటితోపాటు ఆర్‌టీఐ కమిషనర్ల నియామకంలో నిబంధనలు పాటించలేదన్నదానిపై ఆరువారాల్లో సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించాలి. ఇందులో ఇప్పటికే రెండువారాలు గడిచిపోయాయి. మరో నాలుగు వారాల్లో దీనిపై సుప్రీం కోర్టుకు నివేదిక ఇవ్వాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై కొత్త సెక్రటరీగా అంజనేయులును నియమించింది. ఆంజనేయులు బాధ్యతలు తీసుకోవడానికి సోమవారం కార్యాలయానికి చేరుకున్నారు.


### గది ముందు పడిగాపులు..

ఆంజనేయులు సమాచార కమిషన్ కార్యాలయానికి వెళ్లే ముందే కింది అధికారికి కొన్ని పనులు పురమాయించారు. ప్రభుత్వం అడిగిన కొన్ని ఫైళ్లను సిద్ధం చేయాల్సింగా ఆదేశించారు. చీఫ్ కమిషనర్‌ను తాను కార్యాలయంలో కలుస్తానని కూడా సమాచారం పంపించారు. తొలిరోజు చేయాల్సిన పనులకోసం హడావుడిగా కార్యాలయానికి చేరుకున్న ఆయనను తన గదికి వేసిన తాళంకప్ప వెక్కిరించింది. రూమ్ తాళం తెరవాలని కార్యాలయం సిబ్బందిని ఆయన ఆదేశించారు. తాళం చీఫ్ కమిషనర్ బాషా వద్ద ఉందని ఆయనకు వారు తెలిపారు. దీంతో ఆయన గది బయటే నిలబడిపోయారు. చీఫ్ కమిషనర్‌ను కలవాలనుకుంటున్నట్టు వ్యక్తిగత సిబ్బందితో ఆర్.ఎం.బాషాకు సమాచారం అందించారు. అయితే, తాను పనిలో ఉన్నారని...వేచి ఉండాలని బాషా కబురంపారు. ఈ సమయంలోనే.. కొత్త సెక్రటరీ నియామకంపై బాషా భగ్గుమన్నట్టు సమాచారం. తన ఇలాకాలో తన అనుమతి లేకుండా ప్రభుత్వం కూడా ఏమీ చేయడానికి వీల్లేదంటూ హుంకరించినట్టు తెలిసింది. ఎంతసేపు ఎదురుచూసినా బాషా నుంచి స్పందన లేకపోవడం.. ఇటు తన గదిలోకి వెళ్లే వీలు లేకపోవడంతో ఆంజనేయులు అవమానభారంతో అక్కడినుంచి వెనుదిరిగారు. జీఏడీ సెక్రటరీ శేషగిరి బాబుకు జరిగిన విషయమంతా సమాచారం అందించారు. మంగళవారం సీఎస్ విజయానంద్‌ను కలిసి నివేదించాలని ఆంజనేయులు భావిస్తున్నారని సమాచారం. ఆర్‌ఐటీ విషయంలో సుప్రీంకోర్టుతో మాట పడరాదని ప్రభుత్వం కొత్త సెక్రటరీ నియామకం, కోర్టుకు ఇవ్వాల్సిన నివేదిక తయారీ, ఇతర పనులను వేగవంతం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్‌టీఐ చీఫ్ కమిషనర్ తీరు ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది.

# ప్రజల్లో సంతృప్తి పెరిగింది

### పథకాలపై సానుకూలంగా ఉన్నారు

### మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి



అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ నాయకుడి సంతృప్తి కోసం వైసీపీ ప్రభుత్వం పనిచేస్తే, ప్రజల సంతృప్తే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా పథకాలు అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పలు అంశాల్లో సీఎం సమీక్షల వివరాలను వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్న తీరుపై సీఎం ఆరా తీశారన్నారు. ఐవీఆర్ఎస్, ఇతర సమాచారాన్ని క్రోడీకరించి చూస్తే ప్రజల సంతృప్త స్థాయి కొన్ని నెలలుగా పెరుగుతోందనే విషయం స్పష్టమైందన్నారు. ఇంటివద్దే పింఛను ఇవ్వడంపై 87.8 శాతం మంది, అధికారుల ప్రవర్తన బాగుందని 85 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. రెవెన్యూ, హౌసింగ్‌లపై లబ్ధిదారులు సంతృప్తికరంగా ఉన్నట్లు ఐవీఆర్ఎస్ నివేదికలు తెలుపుతున్నాయన్నారు. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యంగా సర్కారు పనిచేస్తోందని మంత్రి చెప్పారు. దానిలో భాగంగా ఏడాదికి ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు-5.00 లక్షలు అనే కార్యాచరణను రూపొందించిందన్నారు. నైపుణ్య అంచనాకు స్కిల్ టెస్టులు పెడతామన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ వాట్సాప్ గవర్నెన్స్‌లపై కూడా సీఎం సమీక్షించారని మంత్రి చెప్పారు. పిడుగుల వల్ల గొర్రెలకాపరులు మరణిస్తున్న నేపథ్యంలో దగ్గర్లోని సచివాలయ అధికారులు గొర్రెల కాపరులను అప్రమత్తం చేసేందుకు ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని రూపొందించాలని కూడా సీఎం చెప్పారన్నారు.

## రెండు రోజులు భారీ వర్షాలు.. ఎండలు

» కోస్తాలోని పలు జిల్లాలకు విపత్తులశాఖ హెచ్చరిక

అమరావతి, విశాఖపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని చోట్ల 41-43 డిగ్రీల ఉష్ణోగ్రతలు, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, గంటకు 50-60కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని వివరించింది. మేఘాలు కమ్ముకున్న వెంటనే పొలాలు, తోటల్లో ఉండే వారంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. రుతుపవనాల రాకకు ముందు.. అంటే మే నెలలో పిడుగులు, ఈదురుగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. తీవ్రమైన ఎండతో వాతావరణంలో ఎక్కువ మార్పులు వస్తుండడంతో ఉద్యానవన పంటలకు ఎక్కువ నష్టం సంభవిస్తుందని పేర్కొన్నారు. రుతుపవనాల రాకకు ముందు అకాలవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కోసిన పంటను కల్లాల్లో భద్రపరిచేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, సోమవారం నంద్యాల జిల్లా పసుపులలో 42.5, కడప జిల్లా జమ్ములమడకలో 42.4, పల్నాడు జిల్లా రావిపాడులో 42.1, కర్నూలు జిల్లా కలుగోట్లలో 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



# మాతృత్వ సెలవులు ఇక 180 రోజులు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ చెబుతున్నారు. ఒక్కరితోనో, ఇద్దరు పిల్లలతోనో సరిపెట్టుకోవద్దు. అంతకంటే ఎక్కువ మంది పిల్లల్ని కనండంటూ ఆయన పదే పదే కోరుతున్నారు. జనాభా తగ్గిపోతే అభివృద్ధి కుంటుబడిపోతుందని వివరిస్తున్నారు. జనాభా పెరుగుదలకు అడ్డంకిగా ఉన్న స్థానికసంస్థల చట్టంలోని.. ఇద్దరు పిల్లలు కంటే ఎక్కువ ఉండకూడదు అనే నిబంధనను కూడా ఇటీవల సవరించారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా కూడా పోటీకి అర్హులే అంటూ కొత్త నిబంధన తీసుకొచ్చారు. ఆ విధంగానే మాతృత్వ సెలవులను కూడా పెంచారు. ఇద్దరికే వర్తింపు అనే నిబంధన కూడా సవరించారు.

### జనాభాతోనే సంపద..

ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్న విషయం తెలిసిందే. జనాభా పెరిగితేనే సంపద పెరుగుతుందని, దేశాన్ని, రాష్ట్రాన్ని నడిపించే యువ జనాభా తగ్గిపోతే ఇబ్బందులు తప్పవని ఇటీవల చంద్రబాబు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తావన, స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్ వచ్చినప్పటి నుంచి జనాభా ప్రాముఖ్యం గురించి అనేక సందర్భాల్లో చెప్పారు. యువత సంఖ్య తగ్గి, వృద్ధుల సంఖ్య పెరిగిపోతే రాష్ట్రం, దేశం వృద్ధిలో వెనుకబడిపోతాయని, జపాన్, చైనా వంటి దేశాలు ఈ సమస్యతో ప్రస్తుతం పోరాడుతున్నాయని పేర్కొన్నారు. భారత రిజిస్ట్రార్ జనరల్ గణాంకాల ప్రకారం 2001లో వృద్ధుల జనాభా 12.6 శాతం ఉండగా, 2011లో 15.4 శాతం, 2021లో 18.5 శాతం ఉంది. అది 2031 నాటికి 24.7 శాతానికి పెరగొచ్చని అంచనాలున్నాయి. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1992-93లో 2.6 శాతం ఉండగా, 2019-21 నాటికి అది 1.7 శాతానికి తగ్గింది. ఈ క్షీణత ఇలాగే కొనసాగితే ప్రపంచంతో రాష్ట్రం, దేశం పోటీ పడలేవని, అందుకే జనాభాను పెంచుకునే అవసరం ఉందని చెబుతున్నారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం వైపునుంచి నిర్ణయాలు కూడా తీసుకుంటున్నారు.

# విశాఖ నుంచి రాయ్‌పూర్‌కు హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్

(మొదటి పేజీ తరువాయి)



రాయ్‌పూర్‌కు పైప్‌లైన్(వీఆర్‌పీఎల్) ఏర్పాటుకు రూ.2,212 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో నాలుగు జిల్లాలు(విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం) మీదుగా ఈ పైప్‌లైన్ ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు వెళ్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 165 కిలోమీటర్లు. ఈ మార్గంలో పంపింగ్, పిగ్గింగ్ స్టేషన్లు, సెక్షన్లవారీగా వాల్వ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో పంపింగ్ స్టేషన్‌కు ఆరు నుంచి ఎనిమిది ఎకరాల భూమి అవసరం. అలాగే వాల్వ్ స్టేషన్‌లకు అర ఎకరా చొప్పున కావాలి. ఈ నాలుగు జిల్లాల్లో అవసరమైన భూములను డీ పట్టాలు, ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించగా జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, ఆర్‌డీఓ, హెచ్‌పీసీఎల్ ప్రాజెక్ట్ మేనేజర్, డీజీఎం, జీఎం స్థాయి అధికారులతో ఐదుగురు సభ్యుల కమిటీలను ఏర్పాటుచేయాలని సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీరు అక్కడి ధరల ఆధారంగా భూమికి పరిహారం ఇస్తారు. పైపులైన్ ప్రాజెక్ట్‌ను మూడేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# లిక్కర్‌లో బాసులూ లాక్!

"తన పరిధి, అధికారాల ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. బుధవారం విచారణలో హైకోర్టు ఏదొక నిర్ణయం తీసుకోవాలి. ఈ కేసులో ఇంతకుమించి కామెంట్స్ చేయడం లేదు. నిర్ణయాధికారం హైకోర్టుదే"

\- సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

వెలుగొందిన ధనుంజయ్‌రెడ్డికాగా, మరొకరు జగన్ వెన్నంటే ఉండి ఆయన సొంత వ్యవహారాలను చక్కబెట్టిన ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి.

### అప్పట్లో బాసుల దర్పం

ధనుంజయ్‌రెడ్డిది తొలుత ఐ.ఎ.ఎస్. కాదు. ఢిల్లీ, అండమాన్ నికోబార్ ఐలాండ్స్ (డానిక్స్) సర్వీసుకు చెందిన ధనుంజయ్‌రెడ్డిని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. కడప జిల్లాకు చెందిన ఆయన వైఎస్ కోటరీలో కీలక అధికారిగా మారారు. ఆ తర్వాత ఆయనను ఐ.ఎ.ఎస్.కు ఎంపిక చేయించారు. ఏపీలోనే పోస్టింగ్ ఇప్పించారు. జగన్ అధికారంలోకి వచ్చీరాగానే ధనుంజయ్‌రెడ్డిని ముఖ్యమంత్రి పేషీలోకి తీసుకున్నారు. సీఎం కార్యదర్శిగా నియవించారు. పేరుకే సీఎం కార్యదర్శిగానీ పెత్తనమంతా ఆయనదే అన్నట్లుగా కాలక్రమేణా ధనుంజయ్‌రెడ్డి హవా పెరిగిపోయింది. జగన్‌తో తనకున్న సాన్నిహిత్యంతో సకల అధికార యంత్రాంగాన్ని తన గుప్పిట పట్టుకొని శాసించగలిగేలా ఎదిగారు. జగన్‌కు ఓఎస్‌డీగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి తొలుత ప్రభుత్వ ఉద్యోగి. ఉద్యోగానికి రాజీనామా చేసి జగన్‌కు పీఏగా పనిచేశారు. గతంలో ఆయన సర్పంచ్‌గా చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ప్రకటన కూడా జరిగింది. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక కృష్ణమోహన్‌రెడ్డి హోదా పీఏ నుంచి ఓఎస్డీగా మారింది.

### ఊహించని షాక్

మద్యం కుంభకోణంలో తమ పేర్లు బయటకొచ్చాయని తెలియగానే ఆ ఇద్దరిలో వణుకు మొదలయింది. అర్జంటుగా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణలో ఉండగానే ఆగమేఘాల మీద సుప్రీం కోర్టు తలుపుతట్టారు. అక్కడ కాదు పొమ్మనడంతో షాక్‌కు గురయ్యారు. హైకోర్టు ఏం చెబుతుందోనని తీక్షణంగా ఎదురుచూస్తున్నారు. నిజానికి వీరిద్దరికి లిక్కర్‌స్కామ్‌తోనే సంబంధాలున్నాయా? అంతవరకే వీరి పాత్ర పరిమితమైందా? అని ఆరాతీస్తే ఒక్కసారి వారి గత వైభవాన్ని పరిశీలిస్తే అసలు విషయాలు ఎన్నో బయటకొస్తాయి. జగన్ హయాంలో జరిగిన ఏ స్కామ్‌ను గురించి విచారించాలన్నా ఈ ఇద్దరే కీలకం అని పోలీసు అధికారులు భావిస్తున్నారు. శివుడు ఆజ్ఞలేకుండా చీమయినా కుడుతుందో లేదు కానీ ఈ ఇద్దరి ఆదేశం లేకుండా జగన్ ప్రభుత్వంలో ఏదీ జరగలేదన్నది పోలీసుల అభిప్రాయం. అనేక స్కామ్‌లతో పెనవేసుకుపోయిన ధనుంజయ్‌రెడ్డిని విచారించడానికి సిట్ అధికారులు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### ఏదైనా సెటిలయ్యేది అక్కడే!

జగన్‌కు సంబంధించిన సెటిల్‌మెంట్లన్నీ వీళ్లద్వారానే జరిగాయని అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది. జగన్ పేరిట కొన్ని, ఆయన పేరుచెప్పి చేసేవి కొన్ని అన్నట్లుగా ధనుంజయ్‌రెడ్డి వ్యవహారాలు ఉన్నాయని అప్పట్లో బహిరంగ విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఎంతటి పెద్ద పారిశ్రామికవేత్త అయినా, ఇంకా ఎంతపెద్ద నేత అయినప్పటికీ ధనుంజయ్‌రెడ్డి కాళ్లచుట్టూ తిరగాల్సిందే. ఆయన దర్శనం కూడా అంత సులువుగా దొరికేది కాదని చెబుతుంటారు. ధనుంజయ్‌రెడ్డి ఏది ఆదేశిస్తే అది జరిగిపోవాల్సిందే అన్నట్లుగా అధికారయంత్రాంగాన్ని నడిపించారు. ఆయన బాధితుల సంఖ్య వందలు, వేలల్లో ఉంటుందని చెబుతున్నారు. పదవిపోయాక ఆయన గురించి ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ, ఒక్కసారిగా మద్యం స్కామ్‌లో ఈ మాజీ సూపర్‌బాస్ పేరు తెరపైకి వచ్చింది. జగన్ హయాంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో రూ.వేల కోట్లను అప్పటి పాలకులు సొంత ఖాతాల్లో వేసుకున్నారన్న ఆరోపణలపై సీఐడీ జరుపుతున్న విచారణలో ఒక్కరొక్కరి పేరు బయటకొస్తుంది.

### ఆదేశాలు ఎక్కడినుంచి అందుకున్నారు?

మద్యం కుంభకోణంలో ప్రధానంగా సొంత బ్రాండ్లను తయారు చేయించడం, రాష్ట్రంలోని ప్రముఖ డిస్టిలరీలను బెదిరించి లాక్కోవడం కీలకమైన అంశాలు. ఇందులో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిల పాత్ర ఏ మేరకు ఉంది? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. మద్యం ముడుపుల వ్యూహం ఖరారు, ఇతర కీలక సమావేశాల్లో తమతోపాటు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారని ఈ కేసులో ఏ1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డితో పాటు పలువురు నిందితులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆ ముడుపుల దందాను ఖరారు చేసే సమావేశాల్లో పాల్గొనాలని, ఆ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించాలని ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను ఎవరు ఆదేశించారో తేలాల్సి ఉంది. అది తేలకుండా లిక్కర్‌స్కామ్ దర్యాప్తు ముగిసినట్లు కాదు. దీంతో వీరిద్దరి వాంగ్మూలాలను నమోదుచేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిసింది. అయితే, ఐదేళ్లపాటు అధికారాన్ని అనుభవించి ఇప్పుడు సాధారణ వ్యక్తులుగా విచారణకు హాజరుకావడానికి ఆ ఇద్దరికి అహం అడ్డొస్తున్నట్లుంది. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు వీరు సమాధానాలు చెప్పాల్సి వస్తే, ఈ వ్యవహారంలో జగన్ పాత్ర కూడా నిర్ధారణ అవుతుంది. అదే జరిగితే తమకు మరిన్ని చిక్కులు తప్పవని ఆ ఇద్దరు భావిస్తున్నారు. దీంతో విచారణను ఎలా ఎగ్గొట్టాలా అని పథక రచన చేస్తున్నారని తెలిసింది. సుప్రీం కోర్టులో వీరికి ఎలాంటి వెసులుబాటు రానందున దర్యాప్తు సంస్థ వీరిని తక్షణ విచారణకు పిలిస్తే తప్ప ఈ కేసులో అసలు నిజాలేవిటో బయటకు రావని పోలీసువర్గాలే చెబుతున్నాయి.

### ఈ ఇద్దరే కీలకం..

లిక్కర్‌స్కామ్‌లో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ల విచారణ తర్వాత అనేక మంది అనుమానితులను పోలీసులు ప్రశ్నించారు. మద్యం ముడుపుల వ్యవహారం ప్రస్తుతం ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిల దగ్గర ఆగింది. ధనుంజయ్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకే తాము పనిచేశామని మద్యం కుంభకోణంలో ఇప్పటికే అరెస్టైయిన అనేక మంది వెల్లడించారు. నిజానికి ధనుంజయ్‌రెడ్డి పేరు చెప్పారంటే... దాన్ని జగన్ పేరు చెప్పడంగానే చూడాల్సి ఉంటుందని పోలీసువర్గాలు అనుమానిస్తున్నాయి. జగన్ చెబితేనే మద్యం ముడుపుల ఆదేశాలు ఇచ్చి ఉంటారని ఈ వర్గాలు సందేహిస్తున్నాయి. కాబట్టి ఈ జగన్ పాత్ర నిరూపించేందుకు ఈ ఇద్దరే కీలకం.

## ఆ హక్కు ఏపీ ప్రభుత్వానికి ఉంది



న్యూఢిల్లీ, మే 5(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు కీలక నిందితులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. స్వేచ్ఛగా నడుచుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని వ్యాఖ్యానించింది. ఏపీ మద్యం కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నెల 2వ తేదీన హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో వివరాలు సమర్పించేందుకు ప్రాసిక్యూషన్ సమయం కోరడంతో హైకోర్టు ధర్మాసనం కేసును ఈనెల 7వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే, ఆ ముగ్గురు ఈ నెల 2వ తేదీన సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. మద్యం కొనుగోళ్లతో తమకెలాంటి సంబంధమూ లేదని, ఉద్దేశపూర్వకంగానే తమను కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ఆ మూడు పిటిషన్లను కలిపి సోమవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, ముందస్తు బెయిల్ కోసం ఎప్పుడు పిటిషన్లు దాఖలు చేశారు? కోర్టు ప్రత్యర్థులకు నోటీసులేమైనా జారీ చేసిందా? అని జస్టిస్ పార్దీవాలా పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించారు. హైకోర్టు తమ వాదనలు వినడంలేదని, అందుకే ఈ నెల 2న సుప్రీంకోర్టును ఆశ్రయించినట్టు వారు బదులిచ్చారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, ముకుల్ రోహిత్గీ కలుగజేసుకుని, హైకోర్టులో ఈ నెల 7న ఇదే అంశంపై విచారణ జరగనుందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బుధవారమే హైకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి ధర్మాసనం ఆసక్తి చూపలేదు. అరెస్టు చేయకుండా ఉండేందుకు స్టే ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. హైకోర్టులో బుధవారమే విచారణ ఉంది కదా? అని మరోసారి జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించగా, అప్పటిలోగా అరెస్టు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెప్పాలని న్యాయవాదులు పట్టుబట్టారు. ఈ క్రమంలో జస్టిస్ పార్దీవాలా అసహనం వ్యక్తం చేశారు. అలా ఆదేశాలు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. తమ పరిధి, అధికారాల ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం జరిగే విచారణలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సూచించారు. ఈ కేసులో ఇంతకుమించి ఎలాంటి కామెంట్స్ చేయడం లేదని, నిర్ణయాధికారం హైకోర్టుదేనని బెంచ్ తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 8న చేపడతామని పేర్కొంది.

# ఏడుగురిపై వేటు!

(మొదటి పేజీ తరువాయి)

కురిసిన భారీవర్షానికి ఆ గోడ మర్నాడు కూలిపోయి ఏడుగురు భక్తులు మరణించారు. దీనిపై విచారణకు ప్రభుత్వం పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, 'ఈగల్' ఐజీ ఆకె రవికృష్ణ, జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేసింది. వారు మరుసటిరోజే సింహాచలం వచ్చి కొండపైకి వెళ్లి ఘటనా స్థలంలో విచారణ చేశారు. ఆ తర్వాతి రోజు విశాఖ ప్రభుత్వ అతిథిగృహంలో మరోసారి అందరినీ విచారించారు. మొత్తం 19 మందితో మాట్లాడారు. ఎటువంటి డిజైన్, అనుమతులు లేకుండా గోడను నిర్మించినట్లు తేల్చారు. ఆ నిర్మాణంలో కూడా ఇంజనీరింగ్ నిబంధనలు పాటించలేదని గుర్తించారు. ఈ పనులను కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' కింద చేపట్టారు. అధికారులు ఒత్తిడి చేస్తేనే గోడ కట్టానని కాంట్రాక్టర్ స్పష్టంచేశారు. అన్నింటినీ పరిశీలించిన త్రిసభ్య కమిటీ.. ఎవరు బాధ్యులో తేలుస్తూ చర్యలకు సిఫారసు చేసింది. సురేశ్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ఆరు పేజీలతో ప్రాథమిక నివేదికను సమర్పించారు. ఆ వెంటనే ప్రభుత్వం ఏడుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చింది. దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ కె.సుబ్బారావు, దేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డీజీ శ్రీనివాసరాజు (ఈఈ), కేఎస్ఎన్ మూర్తి (డిప్యూటీ ఈఈ), కె.బాబ్జీ (జేఈ), ఏపీటీడీసీకి చెందిన కె.రమణ (ఈఈ), ఏబీవీఎల్ఆర్ స్వామి (డిప్యూటీ ఈఈ), పి.మదన్‌మోహన్(ఏఈ)లను సస్పెండ్ చేసింది. కాంట్రాక్టర్ కె.లక్ష్మీనారాయణ (లక్ష్మణరావు)పై క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఆయన సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని స్పష్టంచేసింది. అసలా రోజు అక్కడ ఏం జరిగిందో సురేశ్‌కుమార్‌ను సీఎం అడిగి తెలుసుకున్నారు. 15 నిమిషాలు ఆయన ఆ వివరాలన్నీ తెలియజేశారు. వెంటనే ముఖ్యమంత్రి.. హోం మంత్రి అనిత, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఫోన్లో మాట్లాడారు.

ఏపీటీడీసీ, దేవదాయ శాఖ అధికారులు గోడ కట్టాలని చెప్పారే గానీ.. ఆ పనులు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇంజనీర్లు, అధికారులు తనిఖీలు చేయకుండానే నిర్మాణాన్ని పూర్తి చేసేశారు.

సాంకేతిక, అధికారిక అనుమతి లేకుండా ఆలయాల్లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టవద్దు. నిర్మాణ సమయంలో రోజువారీ పాటించాల్సిన అన్ని రకాల ప్రొటోకాల్స్‌నూ కచ్చితంగా పాటించాలి. నాణ్యతా లోపాల పర్యవేక్షణ, జవాబుదారీ బాధ్యత మొత్తం ఇంజనీర్లకు అప్పగించాలి. - త్రిసభ్య కమిటీ

### పునాదే లేదు..

గోడ నిర్మాణానికి సరైన డిజైన్, డ్రాయింగ్‌లు లేవని.. దీని నిర్మాణానికి ఎలాంటి ప్రణాళికనూ అధికారులు సిద్ధం చేయలేదని త్రిసభ్య కమిటీ వెల్లడించింది. పైగా గోడ నిర్మాణం వర్షపు నీటిని నివారించాలన్న ఉద్దేశంతో నిర్మించారు. కానీ వర్షపునీటి తాకిడిని తట్టుకునే సామర్థ్యంతో దానిని కట్టలేదు. పైగా దానికి పునాది కూడా లేదు. నిర్మాణంలోనూ ఫ్లైయాష్ బ్రిక్స్ ఉపయోగించారు. ఇంత బలమైన గోడ నిర్మాణానికి వాటిని వాడకూడదు. ఇలాంటి భారీ గోడలు నిర్మించే సమయంలో డ్రెయిన్ పైపులు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్రెంచ్ డ్రెయిన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల వర్షపు నీరు గోడను ఆనుకుని నిలబడకుండా డ్రెయిన్ పైపుల ద్వారా బయటకు వెళ్తుంది. సింహాచలం గోడ నిర్మాణంలో ఈ నిబంధనలు పాటించలేదని నివేదికలో పొందుపరిచారు. అలానే నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో కూడా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వర్షం పడిన తర్వాత నీరు బయటకు పోకుండా గోడ కట్టడంతో నీరు అక్కడే నిలిచిపోయింది. చందనోత్సవం కోసం నిర్మించిన తాత్కాలిక షెడ్లు గోడపై భారంగా మారి.. వర్షం, గాలి వల్ల దానిపై మరింత ఒత్తిడి పెరిగింది. 'గోడ కూలడం వెనుక అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గోడ నిర్మాణానికి డిజైన్లు, దానికి అంచనాలు ఏమీ లేవు. అధికారులు వాటి ఊసే ఎత్తలేదు. సాధారణ ఇంజనీరింగ్ సూత్రాలను కూడా పాటించలేదు. దేవస్థానం ఈవో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తమ విధి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారు. పైగా గోడ ప్రమాదానికి ఏపీటీడీసీ అధికారులు కారణమన్నట్లు వారిపై నిందలు మోపేందుకు ప్రయత్నించారు. ప్లాన్ లేకుండానే గోడ నిర్మించినట్లు ఏపీటీడీసీ అధికారులు విచారణలో అంగీకరించారు. నిర్మాణం సమయంలో నాణ్యత తనిఖీల కోసం కచ్చితంగా ఉండాల్సిన ఎం-బుక్‌ను ఇంజనీర్లు ఉపయోగించలేదని తేలింది' అని నివేదికలో పేర్కొన్నారు.

### ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..

ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని కమిటీ సూచించింది. శాశ్వత నిర్మాణాలైనా.. తాత్కాలికమైనవైనా కచ్చితంగా డిజైన్లు ఉండాలి. అనుమతులు కచ్చితంగా తీసుకోవాలి. డిజైన్, నిర్మాణంలో నాణ్యత కోసం అర్హత కలిగిన ఇంజనీర్లకు మాత్రమే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలి. అనుమతి పొందిన మెటీరియల్స్‌ను మాత్రమే నిర్మాణాల్లో ఉపయోగించాలి. ముఖ్యంగా నిర్మాణం అనంతరం కచ్చితంగా క్యూరింగ్ చేయడంతో పాటు దానికి ఇవ్వాల్సిన సమయం ఇవ్వాలి. ప్రతి నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ టెస్ట్‌లు కచ్చితంగా నిర్వహించాలని సిఫారసు చేసింది. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం కచ్చితంగా ప్రత్యేకమైన ప్రొటోకాల్స్ సిద్ధం చేసుకోవాలని.. ముఖ్యంగా దేవస్థానం, ఏపీటీడీసీ మధ్య ప్రొటోకాల్స్ కచ్చితంగా ఉండాలని సూచించింది. 'నిర్మాణాల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా.. కచ్చితంగా అందరూ ఆమోదించాకే అనుమతివ్వాలి. అనధికార సమాచారంతో, ఆమోదంతో, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ప్లాన్ మార్చి నిర్మాణాలు చేపట్టవద్దు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, జవాబుదారీపై ప్రత్యేక మార్గదర్శకాలు సిద్ధం చేయాలి' అని నివేదికలో స్పష్టంగా పొందుపరచింది.

### రుషికొండ నిర్మాణ పర్యవేక్షకుడు రమణే!



ఏపీటీడీసీ ఈఈ కె.రమణపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. రూ.450 కోట్లతో రుషికొండలో ప్యాలెస్ నిర్మాణ పనులను పర్యవేక్షించింది ఈయనే. అంతకుముందు అదే కొండపై ఉన్న హరిత రిసార్ట్స్ ఫర్నిచర్ విక్రయం, ప్యాలెస్ నిర్మాణానికి తవ్విన మట్టి అమ్మకంతో బాగా ఆర్జించారని విమర్శలున్నాయి. అదేవిధంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక శాఖ అధీనంలో ఉన్న యాత్రీ నివాస్‌లు, హరిత రిసార్ట్స్ ఆధునికీకరణ పనుల అంచనాలు భారీగా పెంచేశారు. మూడేళ్లుగా విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు ఆ శాఖ తరఫున ఒక్క గది కూడా లేకుండా చేశారు. ఆయనకు వైసీపీ ప్రభుత్వ పెద్దలు సహరించారు. కూటమి సర్కారు వచ్చాక ఆయనపై చర్యలు చేపడుతుందని అందరూ భావించారు. కానీ అదేం మాయో.. మరో రెండు పోస్టులు అదనంగా అప్పగించింది. దీనిపై పత్రికల్లో అనేక కథనాలు వచ్చినా చర్యలు తీసుకోలేదు. ఇటీవల చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన నేపథ్యంలో రమణను సస్పెండ్ చేశారు. అంతేతప్ప ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి పర్యాటక శాఖ ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. విచిత్రం ఏమిటంటే...ఆయన వైసీపీ హయాంలో జల వనరుల శాఖ నుంచి డిప్యుటేషన్‌పై ఏపీటీడీసీకి వచ్చి రూ.వందల కోట్ల విలువైన ప్రాజెక్టులను పర్యవేక్షించారు. ఇప్పటికైనా డిప్యుటేషన్ రద్దు చేస్తారో లేదో చూడాలి.

## వైఫల్యం వీరిదే..



**కె.సుబ్బారావు-ఈవో, సింహాచలం దేవస్థానం:** తాత్కాలిక గోడ నిర్మాణానికి అనుమతిచ్చారు. తన విధి నిర్వహణలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇంజనీరింగ్ అధికారులపై పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఈయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.



**డి.జి.శ్రీనివాసరావు, ఈఈ, సింహాచలం దేవస్థానం:** సింహాచలం దేవస్థానంలో పరిస్థితులు, ప్రమాదాల గురించి ఈయనకు పూర్తిగా అవగాహన ఉంది. అయినా గోడ నిర్మాణం చేపట్టాలని పట్టుబట్టారు. కానీ నిర్మాణ పర్యవేక్షణలో పూర్తిగా విఫలమయ్యారు. విధి నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారు. క్రిమినల్ చర్యలతోపాటు క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోవాలి.

**కె.రమణ-ఈఈ, ఏపీటీడీసీ:** కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' స్కీమ్‌లో భాగంగా నిర్మాణాలకు అనుమతి ఇచ్చినందున ఈయనే బాధ్యత తీసుకోవాలి. అక్కడ జరుగుతున్న నిర్మాణాలపైన, నాణ్యతాలోపాలపైన ఈయనకు పూర్తి అవగాహన ఉంది. అయినా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించినందుకు క్రిమినల్ చర్యలతోపాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**కె.ఎస్.ఎన్.మూర్తి, డిప్యూటీ ఈఈ, సింహాచలం దేవస్థానం:** గోడ నిర్మాణ పనులు తనిఖీలు చేయడంలో, నాణ్యతలోపాలు గుర్తించడంలో ఈయన పూర్తిగా విఫలమయ్యారు. నాణ్యతాలోపాలు సరిదిద్దడంలోనూ విఫలం చెందారు. సురక్షితం గాని గోడ నిర్మాణానికి అడ్డుకోలేదు. కాబట్టి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**ఏఆర్‌వీఎల్‌ఆర్ స్వామి-డిప్యూటీ ఈఈ, ఏపీటీడీసీ:** గోడ నిర్మాణంలో నాణ్యత తక్కువ ఉందని ఈయన అంగీకరించారు. కానీ అది తాత్కాలిక గోడ కావడంతో వల్ల ప్రశ్నించలేదని, జోక్యం చేసుకోలేదని చెప్పారు. ఈయనపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**పి.మదనమోహన్-ఏఈ, ఏపీటీడీసీ:** గోడ నిర్మాణంలో నాణ్యత తక్కువ ఉందని తెలిసినా.. నాణ్యత పెంచే చర్యలు చేపట్టలేదు. ఈయనపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**కె.బాబ్జీ-జేఈ, సింహాచలం దేవస్థానం:** గోడ నిర్మాణంలో లోపాలు గమనించి ఈయన ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ లోపాలు సరిదిద్దేందుకు సత్వర చర్యలు తీసుకోలేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**కె.లక్ష్మీనారాయణ-కాంట్రాక్టర్:** గోడ కూలి ఏడుగురు మరణించడానికి కాంట్రాక్టర్ కారణం. అనధికారికంగా పనులు చేపట్టారు. నిర్మాణ పనుల్లో లోపాలున్నాయని తెలిసినా వాటిని నివారించే చర్యలు తీసుకోలేదు. అధికారులు, కాంట్రాక్టర్‌కు వృత్తిపరమైన జవాబుదారీతనం లేకపోవడం వల్లే ఏడుగురు భక్తులు మరణించారు. నాణ్యతలేని గోడ నిర్మాణం చేపట్టి భక్తుల మరణాలకు కారణమయ్యారు కాబట్టి కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్ట్ చేయడంతో పాటు లక్ష్మీనారాయణపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

### దేవదాయ శాఖ కమిషనర్ వైఫల్యాలు..

త్రిసభ్య కమిటీ దేవదాయ కమిషనర్ వైఫల్యాలను కూడా ఎత్తిచూపింది. లోపాలను గుర్తించడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. పర్యాటక శాఖతో సమన్వయం చేసుకోలేదు. గోడ నిర్మాణం గురించి తెలిసి కూడా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మొత్తం పర్యవేక్షణలో పూర్తిగా విఫలమయ్యారు. జవాబుదారీ లేకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించాయి.

## పోలీసు అధికారులు తప్పుడు అఫిడవిట్లు వేశారు!

» వర్రా రవీందర్‌రెడ్డి భార్య పిటిషన్‌పై తుది విచారణ జరుపుతాం: హైకోర్టు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరుడు వర్రా రవీందర్ రెడ్డి అరెస్టుకు సంబంధించి పోలీసులు తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేశారని హైకోర్టు వ్యాఖ్యానించింది. తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపరచాల్సిందిగా వారిని ఆదేశించాలని కోరుతూ రవీందర్ రెడ్డి భార్య కల్యాణి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై తుది విచారణ జరుపుతామంది. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా రిజిస్ట్రార్(జ్యుడీషియల్) సమక్షంలో కర్నూలు టోల్ ప్లాజా సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించామన్నారు. వర్రా రవీందర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు నిందితులను పోలీసులు నవంబరు 8న టోల్ ప్లాజా వద్ద నిర్బంధంలోకి తీసుకున్నారని.. ఆ ఫుటేజ్‌ను రిజిస్ట్రార్ కోర్టు ముందు ఉంచారని తెలిపారు. నిందితులను పోలీసులు గత ఏడాది నవంబరు 8న అరెస్టు చేసి 11న అరెస్టు చేసినట్లుగా అఫిడవిట్లు వేశారన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. ప్రతివాదులుగా ఉన్న పోలీసు అధికారులు తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేశారని అభిప్రాయపడింది. హెబియస్ కార్పస్ పిటిషన్ వేసి 5 నెలలు గడచిందని, వ్యాజ్యంపై తుది విచారణ జరుపుతామని పేర్కొంది. ఏజీపీ స్పందిస్తూ.. రిజిస్ట్రార్ వద్ద సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనలో తానూ ఉన్నానని.. పోలీసుల నుంచి వివరాలు తెప్పించుకుని వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం అంగీకరించి.. విచారణను జూన్ 17కి వాయిదా వేసింది. సీసీటీవీ ఫుటేజ్‌ను సీల్డ్‌కవర్‌లో భద్రపరచి, తదుపరి విచారణలో అందజేయాలని రిజిస్ట్రార్(జ్యుడీషియల్)ను ఆదేశించింది.

## ఏఐతో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ

» రాష్ట్రవ్యాప్తంగా పోలీసు, డాక్టర్లు, ఏపీపీలకు ప్రత్యేక శిక్షణ

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఫోరెన్సిక్ ఆధారాల సేకరణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగాన్ని విరివిగా తీసుకొస్తున్నామని ఏపీ పోలీసు శాఖ స్పష్టం చేసింది. దీనిలో భాగంగా ఫోరెన్సిక్ ఆధారాల సేకరణలో మెళకువలు నేర్పేందుకు వర్చువల్ వర్క్‌షాప్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఈ నెల 10 వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌ను మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి శాంతి భద్రతల ఏడీజీ ఎన్ మధుసూదన్ రెడ్డి, ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ పాలరాజు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివిధ రకాల ఏఐ టూల్స్ అభివృద్ధి చేసి శాస్త్రీయతతో పాటు సమర్థవంతంగా ఆధారాలు సేకరించేలా తీర్చిదిద్దడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమని చెప్పారు. సోమవారం నుంచి ఈ నెల 10 వరకూ అన్ని జిల్లాల పోలీసు యూనిట్లలో ఫోరెన్సిక్ నిపుణులు ఆయా జిల్లాల్లోని దర్యాప్తు అధికారులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, ఏపీపీలకు వారంపాటు శిక్షణ ఇస్తారన్నారు.

## విడదల గోపి బెయిల్ పిటిషన్ కొట్టివేత

విజయవాడ, మే 5(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి విడదల రజని మరిది విడదల వేణుగోపీనాథ్ అలియాస్ గోపికి ఏసీబీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. గ్రానైట్ వ్యాపారులను బెదిరించి రూ.కోట్లు ముడుపులు వసూలు చేశారన్న ఆరోపణలతో ఏసీబీ ఆయన్ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## సహకరించకుంటే చర్యలు తీసుకోవచ్చు

» తోపుదుర్తికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి: హైకోర్టు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి దర్యాప్తునకు సహకరించకుంటే.. చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు పోలీసులకు స్పష్టం చేసింది. పోలీసుల విధులను అడ్డుకొని, దాడిచేసిన వ్యవహారంలో నమోదైన కేసులో ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండల పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. హెలిప్యాడ్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై నమోదైన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తోపుదుర్తి వేసిన వాజ్యంపై పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.